



# ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 30-8-2019 శుక్రవారం సిటీ సంపుటి 46 సంచిక 21

రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi





## కనకంబూ మోగేను!



రూ. 40,300

ఇదీ హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర

పసిడి ధరల పెరుగుదలకు అడ్డేలేకుండా పోయింది. దేశీయంగా మేలిమి (999 స్వచ్ఛత) బంగారం 10 గ్రాముల ధర గురువారం రూ.40,000 దాటింది. వెండి కూడా కిలో రూ.49,000కు చేరింది. బంగారం ధర దేశీయంగా ఈ స్థాయికి చేరడం ఇదే తొలి సారి. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ. 40,300, వెండి కిలో రూ.49,000 ఉంది. అంతర్జాతీయ ఆర్థిక మందగమన ఆందోళనలు, అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో, సురక్షితమని భావించి మదుపర్లు తమ పెట్టుబడులను పసిడిపైకి మళ్లిస్తున్నందునే, ధర ఇంతలా పెరుగుతోంది.

# దశ మారుస్తాం

## 10 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి

- మూడు షిఫ్టుల్లో పనిచేయండి.. గడువులోపు పూర్తి చేయండి
- పొద్దున అడిగితే.. సాయంత్రానికల్లా నిధులిస్తా
- హైదరాబాద్‌లో భూములమ్మి సొమ్ములు తెస్తాం
- ప్రాజెక్టు పనుల పరిశీలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మొదలు పెట్టినప్పుడు అందరూ ఎద్దేవా చేశారు. ఇది పూర్తయ్యాక దేశవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారు. అమెరికాలోని న్యూయార్క్‌లో కూడా దీని గొప్పతనాన్ని ప్రదర్శించారు. మిషన్ భగీరథపై అప్పుడు ప్రతిపక్షాలు ఏమన్నాయి? పథకం పూర్తికాగానే ఇప్పుడు అందరూ గుడ్లెళ్లబెట్టారు.

– ముఖ్యమంత్రి కేసీఆర్

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు – ఈనాడు డిజిటల్: 'రాబోయే 10 మాసాల్లో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేస్తాం. రూ. 10,000 కోట్లు అప్పులు తీసుకొచ్చాం. వచ్చే బడ్జెటులో మరిన్ని నిధులు కేటాయించి త్వరలోనే ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నిధులు సరిపోకుంటే.. హైదరాబాదులో ఉన్న విలువైన భూములను అమ్మకానికి పెట్టాం. ఆ డబ్బును పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణానికి ఖర్చు చేస్తామ'ని ముఖ్యమంత్రి చెప్పారు. మూడు షిఫ్టుల్లో పనిచేసి వచ్చే ఖరీఫ్ నాటికి జలాశయాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ...మిగతా 2లో



నార్లాపూర్ వద్ద ప్రాజెక్టు చిత్రపటాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్




'ఫిట్ ఇండియా' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ. వేదికపై అద్భుత విన్యాసంతో అలరించిన విద్యార్థులు

# దృఢమేవ జయతే

- సాంకేతికత విస్తృతితో తగ్గిన శ్రమ
- జీవనశైలిని మార్చుకోవడమే పరిష్కారం
- శారీరక శ్రమను ప్రోత్సహించేందుకే 'ఫిట్ ఇండియా'
- ప్రధాని మోదీ వెల్లడి

11లో

శారీరక దృఢత్వానికి, విజయానికి దగ్గరి సంబంధం ఉంది, విజయాలు సాధించిన వ్యక్తులంతా శారీరకంగా బలంగా ఉన్నవారే. దేహం దృఢంగా ఉంటే.. మనసూ దృఢంగా ఉంటుంది.

## జై బోలో 'మట్టి' మహరాజ్‌కీ!



బొజ్జగణపయ్య పండగంటే.. పిల్లల వేడుకే! ఇక ఆ చిట్టిచేతులే స్వయంగా గణేశుణ్ని తయారుచేస్తే? గణపతిని బజారు నుంచి తీసుకురాకుండా... పర్యావరణానికి మేలుచేసేలా ఇంట్లోనే మట్టితో తయారుచేయడం ఎలానో నేర్చుకుందామా?

హాయ్! బుజ్జీ!! లో

# గులాబీ జెండాకు ఓనర్లం మేమే

- నాకు మంత్రి పదవి కుల భిక్ష కాదు
- తెలంగాణ ప్రజల కోసం చేసిన ఉద్యమమే మంత్రిని చేసింది
- రాజకీయాల్లో సొంతంగా ఎదిగాను
- నాకు నేనుగా నిలబడతా.. కలబడతా
- నా ఇంటి జాగా నా కష్టార్జితమే
- హుజూరాబాద్‌లో తెరాస శ్రేణుల సమావేశంలో మంత్రి ఈటల

### మా నాయకుడు కేసీఆరే

- నా మాటల్ని కొందరు వక్రీకరించారు
- హుజూరాబాద్ ప్రసంగంపై రంధ్రాన్వేషణ తగదు: ఈటల
- సభ అనంతరం ప్రకటన విడుదల

న్యూస్‌టుడే– హుజూరాబాద్ పట్టణం: మంత్రి పదవి తనకు కులంతో వచ్చిన భిక్ష కాదని, తెలంగాణ ప్రజల కోసం చేసిన ఉద్యమమే మంత్రిని చేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి బాసటగా నిలిచి కొట్లాడి సాధించిన తెలంగాణలో గులాబీ జెండాకు ఓనర్లం తామేనన్నారు. రాబోయే పురపాలక ఎన్నికల్లో ముమ్మాటికీ గులాబీ జెండానే ఎగురుతుందన్నారు. ...మిగతా 5లో



హుజూరాబాద్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల

# మరో సామాజిక దారుణం

- ప్రాణం తీసిన ఫేస్‌బుక్ పరిచయం
- మూడు నెలల క్రితం బాలికకు వల
- నమ్మించి తీసుకెళ్లి అత్యాచారయత్నం
- ప్రతిఘటించడంతో కిరాతకంగా హత్య
- ఒక్కరోజులో నిందితుణ్ని పట్టుకున్న పోలీసులు



నిందితుడు నవీన్‌రెడ్డి

జడ్చర్ల గ్రామీణం, కోహెడ – న్యూస్‌టుడే

ఇదో 'సామాజిక' విపరిణామం!
తెలిసీ తెలియని వయసు.. తోడు లేని మనసు..
అరచేతిలో మొబైల్‌ఫోను.. ఆకాశానికి ద్వారాలను తెరిచే సైట్లు!
ఇంకేముంది.. ఒంటరితనపు సంకెళ్లు తెంచుకుని.. నచ్చినవారితో స్వేచ్ఛగా స్నేహం చేద్దామనుకునే అమాయకులు. సరిగ్గా ఇలాంటివారి కోసమే కాచుకుని కూర్చుని కాటేసే కాలనాగులు! మొన్న.. సామాజిక మాధ్యమం ద్వారా వందలమంది యువతులను పరిచయం చేసుకుని.. రిసెప్షనిస్టు ఉద్యోగాలిప్పిస్తానంటూ వారి ఫొటోలను సేకరించి బెదిరిస్తూ ఓ యువకుడు పట్టుబడగా.. తాజాగా ఫేస్‌బుక్ ద్వారా అభంశుభం తెలియని బాలికతో పరిచయం పెంచుకున్న మరో యువకుడు మాట్లాడుకుందాం రమ్మని పిలిచి.. అత్యాచారానికి యత్నించి దారుణంగా హత్య చేశాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈ ఉదంతం చోటుచేసుకుంది. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా 24 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

మహబూబ్‌నగర్ డీఎస్పీ భాస్కర్, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. జడ్చర్లకు చెందిన ఓ బాలిక (15) పదో తరగతి చదువుతోంది. మూడు నెలల క్రితం ఆమెకు ఫేస్‌బుక్ ద్వారా ఏనుగు నవీన్‌రెడ్డి (27) పరిచయమయ్యాడు. ...మిగతా 2లో



# పర్యావరణం పెను విధ్వంసం

- కడప జిల్లా ఎం.తుమ్మలపల్లెలో కాలుష్యాన్ని ఏ వ్యవస్థా పట్టించుకోవడంలేదు
- ప్రస్తుత పరిస్థితుల్లో యురేనియం అవసరమేంటి?
- 'ఈనాడు'తో పర్యావరణ నిపుణులు బాబూరావు

14లో

## కాళేశ్వరానికి భారీ రుణం

ఆర్ఈసీ నుంచి రూ.18,751.38 కోట్లు

అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మరో భారీ రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి తెలిపింది. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) లిమిటెడ్ నుంచి రూ.18,751.38 కోట్ల రుణం తీసుకునేందుకు కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కార్పొరేషన్‌కు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ...మిగతా 2లో

## ఇదీ సంగతి!




# జలధాత్రి.. గాయత్రి

- ఇప్పటికే 8 టీఎంసీల ఎత్తిపోత
- బహుబలి మోటర్ల జైత్రయాత్ర
- రాజరాజేశ్వర జలాశయానికి జలకళ

ఈనాడు డిజిటల్, కరీంనగర్: గోదారమ్మ ఉరకలేస్తోంది.. శరవేగంగా జలాశయాలకు చేరుతోంది. తెలంగాణ సాగునీటి రంగానికి కొత్త జీవం పోస్తున్న కాళేశ్వరం పథకంలో కీలక ఘట్టాలు ఒక్కొక్కటిగా ఆవిష్కృతమవుతున్నాయి. బాహుబలి పంపులుగా పేరొందిన గాయత్రి పంపుహౌస్ వద్ద జలధారల ఎత్తిపోత నిర్విరామంగా కొనసాగుతోంది. ఇప్పటికే లక్ష్మీ, పార్వతి, సరస్వతి బ్యారేజీల్ని దాటుకొని ఎల్లంపల్లి జలాశయం వరకు గోదావరి ఎత్తిపోతల ప్రక్రియ కొనసాగిన విషయం విదితమే. ఇక కాళేశ్వరం రెండో లింకేజీలో కీలకంగా భావించే ప్రక్రియ దాదాపుగా సఫలీకృతమైంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఎల్లంపల్లి జలాశయం నుంచి నంది పంపుహౌస్‌కు.. అటు నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్(గాయత్రి) పంపుహౌస్‌కు గోదావరి నీళ్లు నిత్యం చేరుతున్నాయి.

### మధ్యమానేరుకు జలకళ..

గాయత్రి పంపుహౌస్ నుంచి ఈ నెల 11వ తేదీ నుంచి క్రమంగా పెరుగుతూ వస్తున్న నీటి ప్రవాహంతో శ్రీరాజరాజేశ్వర(మధ్యమానేరు) జలాశయం జలశోభితంగా మారుతోంది. పక్షం రోజుల కిందట 3.55 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్న ఈ జలాశయంలో ఇప్పుడు సుమారు 11.28 టీఎంసీలకుపైగా వచ్చిచేరాయి. 25.87 టీఎంసీల సామర్థ్యమున్న మధ్యమానేరులో గతేడాది గరిష్ఠంగా 8 టీఎంసీల మేర నీటి మట్టం కనిపించింది. సుమారుగా 40 కి.మీ మేర ఉన్న వరద కాలువల్లో ప్రస్తుతం జలదృశ్యం ఆవిష్కృతమవుతుండటంతో పరీవాహక అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చిన నీళ్లతో ఇప్పటికే కొత్తపల్లి మండలం నాగుల మల్యాల చెరువు నిండింది. కాళేశ్వరం ద్వారా నిండిన తొలి చెరువుగా ఇది ఖ్యాతిని అందుకుంది. దీనికి అనుబంధంగా ఉన్న మరో నాలుగు గొలుసు చెరువులు త్వరలో నిండనున్నాయి. తమ కళ్లముందు సాక్షాత్కరిస్తున్న గోదావరి జలాలతో పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల రైతుల్లో ఆనందం రెట్టింపవుతోంది.



గాయత్రి పంపుహౌస్ వద్ద జల ఉద్ధృతి

### పనితీరు భళా

బాహుబలి మోటర్లతో కూడిన గాయత్రి జలధాత్రిని తలపిస్తోంది. 139 మెగావాట్ల సామర్థ్యమున్న మూడుపంపులు 115 మీటర్ల ఎత్తుకు నీళ్లను ఎత్తిపోస్తున్నాయి. ఇప్పటికే 8 టీఎంసీల ఎత్తిపోత పూర్తయింది. ఇలా ఎత్తిపోసిన నీళ్లు గురుత్వాకర్షణ కాలువల ద్వారా మధ్యమానేరుకు రోజుకు 9 వేల క్యూసెక్కులు వెళ్తున్నాయి. గత వారం రోజులుగా నిరంతరాయంగా నడుస్తున్న పంపుల ద్వారా రోజుకు ఒక టీఎంసీల నీళ్లు కాలువల్లో పారుతున్నాయి. లక్ష్మీపూర్ నుంచి 5.7 కి.మీ దూరం వరకు నిర్మించిన నూతన కాలువల్లో పారుతున్న గోదావరి జలాలు శ్రీరాములపల్లి వద్ద వరద కాలువ కూడలిలో కలుస్తున్నాయి. ఒకవైపు ఎస్సారెస్పీ దిశగా నీళ్లు వెళ్తుండగా.. మరోవైపు మధ్యమానేరు వైపు నీటి జోరు కనిపిస్తోంది. ఇలా నిరంతర ప్రవాహంతో వరద కాలువ పొడవునా 25 కి.మీ మేర 4 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలిచాయి.



జగిత్యాల జిల్లాలో...

# చెప్పుకోలేని బాధ

రైతులకు అవసరమైన యూరియాను డిమాండ్ మేర పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో కొద్ది రోజులుగా కొరత ఎదురవుతోంది. దీంతో అన్నదాతలు ఎండలో నిలబడే ఓపిక లేక చెప్పులు, పాస్‌పుస్తకాలు, ఆధార్ జిరాక్స్ ప్రతులను వరుసలో ఉంచుతున్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో మాత్రమే యూరియాను విక్రయిస్తున్నారు. గురువారం సంఘానికి ఒక లోడ్ యూరియా రావడంతో విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల రైతులు అక్కడికి చేరుకున్నారు. ఎండలో నిల్చోలేక చెప్పులను వరుసలో పెట్టారు. తలా రెండు బస్తాల చొప్పున కేవలం 200 మందికి పంపిణీ చేయగా మిగతావారు నిరాశతో వెళ్లిపోయారు. నల్గొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో యూరియా కోసం క్యూలో గంటల తరబడి నిలబడ లేక పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ ప్రతులను వరుసలో పెట్టి పడిగాపులు కాశారు.

–న్యూస్‌టుడే, పెగడపల్లి, ఈనాడు, నల్గొండ



నల్గొండ జిల్లాలో...

# గోదావరితో శ్రీశైలం నింపుతాం

- నదుల అనుసంధానానికి ఏపీతో చర్చలు జరుపుతున్నాం
- నీచంగా ఆలోచించి చంద్రబాబు సాధించింది సున్నా
- మహారాష్ట్రతో గొడవపడి బాబ్లీ నుంచి తెచ్చిందేమీ లేదు
- ముఖ్యమంత్రి కేసీఆర్

నాగర్‌కర్నూల్-ఈనాడు డిజిటల్

'శ్రీశైలం జలాశయాన్ని గోదావరి జలాలతో నింపుతాం.. కృష్ణా - గోదావరి నదుల అనుసంధానంతో దక్షిణ తెలంగాణ సస్యశ్యామలం అవుతుంది. సమైక్య పాలనలో తెలివి తక్కువ నాయకులు అధికారంలోకి రావడంతో తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డాం. సంకుచిత స్వభావంతో నీచంగా ఆలోచించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మహారాష్ట్ర ప్రభుత్వంతో గొడవపడి సాధించింది గుండు సున్నా' అంటూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు.



నార్లాపూర్ సమీపంలోని కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు ఇది. గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ నార్లాపూర్ వచ్చిన సందర్భంగా ఆయనను కలిసిన రైతులు అనంతరం ఈ ప్రాజెక్టును సందర్శించారు. కృష్ణమ్మ అందాలను చూసి ముగ్ధులయ్యారు

నీళ్ల గురించి, రాష్ట్ర భౌగోళిక పరిస్థితుల గురించి తెలియకనే నాటి పాలకులు నీటిఎద్దడిని పరిష్కరించడంలో విఫలమయ్యారంటూ అప్పటి కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలను విమర్శించారు. గురువారం ఆయన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను నార్లాపూర్ వద్ద పరిశీలించారు. అనంతరం వనపర్తి జిల్లా ఏదుల జలాశయానికి చేరుకున్నారు. అక్కడికి సమీపంలో రిజర్వాయరు పనులు చేపడుతున్న ఏజెన్సీలు, ఇంజినీరింగు విభాగం, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నీటిసమస్యను శాశ్వతంగా పరిష్కరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, వాళ్ల అధికారుల బృందం, తాను, ఇక్కడి అధికారులు కలిసి గోదావరి - కృష్ణా నదుల అనుసంధానం గురించి చర్చిస్తున్నామన్నారు. శ్రీశైలం జలాశయాన్ని గోదావరి జలాలతో నింపేందుకు చర్యలు తీసుకోవాలన్న అవగాహనకు వచ్చామన్నారు. ఇది త్వరలోనే కార్యరూపం దాల్చనుందని ధీమా వ్యక్తం చేశారు. నదుల అనుసంధానం విజయవంతమైతే తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో నీటి సమస్యే ఉండదని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు కృష్ణా, గోదావరి నదుల నీళ్లను వినియోగించుకునే ప్రక్రియ ఒప్పందాల ప్రకారమే కొనసాగుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ తేల్చి చెప్పారు. 'శాంతియుతంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యలకు బస్తీ మే సవాల్ అంటూ కొట్లాటలు, కోర్టులకు వెళ్లిన సంఘటనలు మనం చూశాం. అలాకాకుండా ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరిస్తే అన్నీ సవ్యంగా జరుగుతాయి' అన్నారు. ఇలా చేయడం వల్లనే మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసుకున్నామన్నారు. దీంతో గోదావరి నుంచి 579 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం కలుగుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

"కొంతమంది సన్నాసుల విమర్శలు చూస్తే నవ్వాలో.. జాలి పడాలో తెలియడం లేదు. కరెంటు బిల్లులు ఇంతనా.. అంతనా.. అంటున్నారు. నూటికి నూరుశాతం రైతుల ఆత్మహత్యలు నివారించడమే మా ప్రభుత్వ లక్ష్యం. రైతులందరూ స్వయం సమృద్ధి సాధించేవరకు.. దాదాపు అయిదారేళ్లయినా ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తాం. రూ.5,000 కోట్లే కాదు.. రూ. 15,000 కోట్ల విద్యుత్తు బిల్లులను సైతం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే నీటి పన్నులను రద్దు చేశాం. రాష్ట్రంలోని అన్ని చెరువులను నింపేందుకు ప్రభుత్వం రూ. 4,000 కోట్లు మంజూరు చేసింది. వాటిని వివిధ ప్రాజెక్టుల ద్వారా నింపే ప్రక్రియ కొనసాగుతోంది."

– ముఖ్యమంత్రి కేసీఆర్

## హైదరాబాద్‌లో సహజానంద్ స్టెంట్ల తయారీ

- ఆసియాలోనే అతిపెద్ద పరిశ్రమకు సెప్టెంబర్1న శంకుస్థాపన

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ శివారు సుల్తాన్‌పూర్‌లోని వైద్య పరికరాల ఉత్పత్తి పార్కులో సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ సంస్థ ఆసియాలోనే అతిపెద్ద స్టెంట్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. రూ.250 కోట్ల పెట్టుబడితో మూడు వేల మందికి ఉపాధి కల్పించేందుకు సంస్థ ముందుకొచ్చింది. దీనికి ఆదివారం(సెప్టెంబర్1) ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రెండేళ్ల క్రితం వైద్య పరికరాల ఉత్పత్తి పార్కు ఏర్పాటయింది. అందులో 11 పరిశ్రమల నిర్మాణం జరుగుతోంది. తాజాగా సహజానంద్ వైద్య సాంకేతిక సంస్థ ముందుకొచ్చింది. గుండె శస్త్రచికిత్సలకు సంబంధించిన స్టెంట్లకు భారీగా డిమాండ్ ఉంది. కొత్త పరిశ్రమ ఏర్పాటుతో స్టెంట్ల ఉత్పత్తికి తెలంగాణ కేంద్రస్థానం కానుంది.

# దశ మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టు పూర్తయితే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని, హైదరాబాదు తాగునీటి ఎద్దడి తీరుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు పనులను సాగునీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం పరిశీలించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూరు మండలం కర్వెన వద్ద నుంచి ఎత్తిపోతల పథకం పనులను ముందుగా విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అనంతరం జలాశయం వద్ద పాలమూరు పథకానికి సంబంధించిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కర్వెన జలాశయం పనులను ఎన్ని రోజుల్లో పూర్తిచేస్తారని అధికారులను, ఏజెన్సీలను ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఏడాదిలోపు చేస్తామని అధికారులు బదులిచ్చారు. 'అంత ఆలస్యం ఎందుకు?.. నాలుగున్నర నెలల్లో పూర్తి చేయాలి' అని ఆదేశించారు. 24 గంటలూ పనులు జరిగేలా చూడాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు అలాగే పూర్తయ్యాయన్నారు. ఉదయం ప్రతిపాదనలు పంపితే సాయంత్రానికల్లా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పెండింగు బిల్లులను సైతం విడుదల చేస్తానన్నారు. కర్వెన, ఉదండాపూర్ జలాశయాల నుంచి కోయిలసాగర్‌కు నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పరిహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు.

### ఆరు నెలల్లో వట్టెం జలాశయం పూర్తిచేయాలి

ఆరు నెలల్లో వట్టెం జలాశయం పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగు అధికారులకు కాల వ్యవధి నిర్దేశించారు. భూసేకరణకు సంబంధించిన నిధులను విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. మిగులు భూసేకరణ ఉంటే దాన్ని కూడా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా వట్టెం భూ నిర్వాసితులు తమకు మల్లన్నసాగర్ తరహాలో పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించారు. తగిన న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

### పరిహారం కోసం నిరసన

ముఖ్యమంత్రి రాక సందర్భంగా ముందు జాగ్రత్తగా కర్వెన జలాశయం నిర్వాసిత రైతు సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మల్లన్నసాగర్ తరహా పరిహారం కోరుతున్న వీరు సీఎం పర్యటనలో ఆందోళనకు దిగుతారన్న సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. దీంతో బాధిత రైతులు కొంతమంది జడ్చర్ల సిగ్నల్‌గడ్డలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. పరిహారం విషయంలో న్యాయం చేయాలని డిమాండు చేశారు.

# అక్టోబరులో గ్రామాభివృద్ధి ప్రణాళిక

ఈనాడు - హైదరాబాద్

గ్రామాల పచ్చదనం, పరిశుభ్రత, సమగ్రాభివృద్ధికి నిర్దేశించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అక్టోబరు 5 లేదా 6వ తేదీ నుంచి ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. ఈ లోపు మరోసారి జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించి, మరింత స్పష్టత ఇస్తామన్నారు. కార్యాచరణ అమలు ప్రారంభానికి ముందే కేంద్ర ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి ప్రతి నెలా రూ.339 కోట్ల వంతున ఎనిమిది నెలల పాటు గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై గురువారం రాత్రి ఆయన ప్రగతిభవన్‌లో సమీక్ష జరిపారు. మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థిక, పంచాయతీరాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, వికాస్ రాజ్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు. ప్రణాళికపై శుక్రవారం మరో మారు సమీక్ష జరిపి పూర్తిస్థాయి అవగాహనతో తుది నిర్ణయం ప్రకటిస్తామని ఆయన అన్నారు. ప్రణాళిక అమలులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ వార్షిక, పంచవర్ష ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వాటికి, గ్రామంలో ఖర్చుపెట్టే ప్రతి పైసాకు గ్రామ సభ ఆమోదం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రణాళికపై శుక్రవారం జరిగే సమావేశానికి కామారెడ్డి, సిద్దిపేట, వరంగల్ కలెక్టర్లను పిలవాలని సీఎం సూచించారు.



మంత్రులు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, అధికారులతో సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్

### సీఎం ముఖ్య భద్రతాధికారులకు పదోన్నతి

ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య భద్రతాధికారులు ఎస్. వీరారెడ్డి, టి. నరేందర్‌సింగ్‌లకు డీఎస్పీ నుంచి అదనపు ఎస్పీలుగా పదోన్నతులు లభించాయి. వారు ప్రగతిభవన్‌లో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

### అత్యధిక విద్యుత్తు వినియోగం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ చరిత్రలోనే అత్యధిక విద్యుత్తు వినియోగ దినంగా గురువారం రికార్డులకెక్కింది. బుధవారం 10,960 మెగావాట్ల వినియోగం ఉండగా గురువారం నాటికి 646 మెగావాట్లు పెరిగి 11,606 మెగావాట్లు నమోదైంది.



## పాదయాత్ర కాదు.. ఆకలియాత్ర!

ఇదేదో పాదయాత్ర కాదు. ఆకలి యాత్ర. పొట్టకూటి కోసం రోజూ రాష్ట్ర సరిహద్దు దాటివస్తున్న వీరిది మహారాష్ట్ర. ఇలా చద్దిమూటలు చేతపట్టుకుని వందలాదిమంది తెలంగాణలోని ఆదిలాబాద్‌కు వస్తుంటారు. నాందేడ్ జిల్లా ముత్కేడ్, కిన్వట్, హిమాయత్‌నగర్, నాందేడ్, సహస్రకుండ్ తదితర ప్రాంతాల నుంచి ఉదయాన్నే రైలులో గంటన్నరపాటు ప్రయాణించి ఇక్కడికి చేరుకుంటారు. పనులు పూర్తిచేసుకుని తిరిగి సాయంత్రం రైలుకు ఇంటిముఖం పడతారు. స్థానికంగా కూలీలకొరత ఉండటంతో మహారాష్ట్ర కూలీలను పిలిపించుకోవలసి వస్తుందని గుత్తేదారులు అంటున్నారు. ఏమైనా ఆకలిపోరాటంలో రోజూ వంద కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సిరావడం బాధాకరమే కదా! – ఈనాడు, ఆదిలాబాద్

## నిరాహార సాధనం!

ఉపవాసం, నిరాహారమన్నది
అనాది ఆచారం. ఆత్మశుద్ధి కోసం
పునరుద్ధరించుకున్న ఆ సాధనాన్ని
మరింత విస్తరించి కొన్ని మహోన్నతమైన,
కొండొకచో అల్పమైన లక్ష్యాల కోసం కూడా
వాడుకుంటున్నాం!
నిజమైన ఉపవాసమంటే అహాన్ని
సమూలంగా విసర్జించటం.
అదో పరిశుద్ధ ప్రార్థనా స్థితి!

– మహాత్మా గాంధీ

# మరో సామాజిక దారుణం

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ గ్రామానికి చెందిన అతడు నాగోల్‌లోని ఓ కార్ల వర్క్‌షాపులో పని చేస్తున్నాడు. బాలిక చిరునామా తెలుసుకున్న అతను గతంలో రెండుసార్లు జడ్చర్లకు వచ్చి ఆమెతో మాట్లాడాడు. ఈనెల 27న సాయంత్రం 5 గంటలకు జడ్చర్లకు కారులో వచ్చి బయటకు వెళ్దాం రమ్మన్నాడు. బాలిక అంగీకరించకపోవడంతో గతంలో రెండుసార్లు తనను కలిసిన విషయం ఆమె తల్లిదండ్రులకు చెబుతానని బెదిరించాడు. భయపడిన బాలిక అతడి వెంట వెళ్లింది. మహబూబ్‌నగర్ రోడ్డులోని శంకరాయపల్లి తండా సమీపంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారయత్నానికి పాల్పడగా ఆమె ప్రతిఘటించడంతో తలపై బండరాయితో మోది హత్య చేసి పరారయ్యాడు. కుమార్తె ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన బాలిక తండ్రి అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ శంషుద్దీన్ సకాలంలో స్పందించి విచారణ చేపట్టారు. ఆమె ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దాని నంబరు ఆధారంగా నిందితుడు నవీన్‌రెడ్డిని అతని స్వగ్రామంలో అదుపులోకి తీసుకుని విచారణ జరపగా హత్య చేసినట్టు అంగీకరించాడని డీఎస్పీ భాస్కర్ వెల్లడించారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు. బాలిక హత్యను నిరసిస్తూ.. నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చూడాలని మహిళ, ప్రజా, విద్యార్థి సంఘాలు జడ్చర్లలో ఆందోళన చేపట్టాయి. మహబూబ్‌నగర్ అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానంలో సత్వర విచారణ జరిపిస్తామని వారికి హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడలో నివాసం ఉండే నవీన్‌రెడ్డి తల్లిదండ్రులిద్దరూ కూలీలే. పదోతరగతి ఫెయిలైన అతడు సోదరుడితో కలిసి కార్ల వర్క్‌షాపులో పనిచేస్తుంటాడని స్థానికులు తెలిపారు. బుధవారం నుంచి వారి ఇంటికి తాళాలేసి ఉన్నాయని.. కుటుంబ సభ్యులు పత్తాలేరని వారు వివరించారు. వారు ఎవరితోనూ కలిసేవారు కారని.. అందుకే పెద్దగా వివరాలు తెలియవని చెప్పారు.

# అంగుళమూ ఆక్రమణకు గురికాకుండా!

- పక్కాగా అటవీ ప్రాంతాల రక్షణ
- సీఎం ఆదేశాలతో కార్యాచరణపై ఆ శాఖ ప్రత్యేక దృష్టి

ఈనాడు - హైదరాబాద్

అడవులు.. ఓ వైపు ఆక్రమణలు, మరోవైపు ఆ భూముల హక్కులపై వివాదాలు.. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తూనే పక్కాగా లెక్కలున్న భూముల్ని పూర్తిస్థాయిలో సంరక్షించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. భవిష్యత్తులో అంగుళం భూమి కూడా ఆక్రమణలకు గురికావొద్దన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణపై అటవీ శాఖ దృష్టి సారిస్తోంది. తొలుత రెవెన్యూ రికార్డులతో సరిపోలి పక్కాగా అటవీప్రాంతాలుగా గుర్తించిన వాటి చుట్టూ కందకాలు తవ్వి.. కంచె వేసేందుకు సన్నద్ధమవుతోంది.

తెలంగాణ భౌగోళిక విస్తీర్ణంలో దాదాపు 24 శాతం అటవీప్రాంతంగా రికార్డులు చెబుతున్నా క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పెద్దఎత్తున ఈ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అడవుల పునరుద్ధరణకు ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని సీఎం కేసీఆర్ ఇటీవల గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కోమటిబండలో జరిగిన కార్యక్రమంలో అధికారుల్ని ఆదేశించారు. ఆక్రమణల అడ్డుకట్ట విషయంలోనూ కీలక సూచనలు చేశారు. ఇప్పటివరకు జరిగిన వాటిపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని.. ఇక ముందు అంగుళం కూడా జరక్కుండా చూడాలని అటవీ అధికారులకు స్పష్టంచేశారు.

**ఇవీ లెక్కలు..**

- రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం: 1.12 కోట్ల చ.కి.మీ.
- అటవీ ప్రాంతం: 26.96 లక్షల చ.కి.మీ.
- ఆక్రమణలకు గురైన అటవీ ప్రాంతం: 3 లక్షల హెక్టార్లు

### విస్తీర్ణాన్ని బట్టి..

దట్టమైన అడవులు ఉన్న, కలప స్మగ్లింగ్ జరిగే కొన్ని ప్రాంతాల్లో అటవీ శాఖ ఇప్పటికే కందకాలు తవ్వుతోంది. సీఎం సూచనల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని విస్తరించాలని నిర్ణయించింది. ఎక్కువ విస్తీర్ణం ఉన్న అటవీప్రాంతం చుట్టూ కందకాలు.. తక్కువ విస్తీర్ణం ఉన్నచోట చైన్‌లింక్ ఫెన్సింగ్ వేయాలన్నది ప్రణాళికగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భూప్రక్షాళనలో భాగంగా అటవీ భూముల దస్త్రాల్ని అటవీ, రెవెన్యూ రికార్డులతో పరిశీలించారు. "పక్కా అటవీభూమిగా తేలింది 47 లక్షల ఎకరాలు. వివాదంలో ఉన్నది 6 లక్షల ఎకరాలు. ఇంకా దస్త్రాలు పరిశీలించాల్సింది 12 లక్షల ఎకరాలు. ఇందులో 10 లక్షల ఎకరాలు ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మహబూబాబాద్, నాగర్‌కర్నూలు జిల్లాల్లోనే ఉంది. దీన్ని పరిశీలించడానికి సర్వే టీంలు ఇచ్చారు. స్పష్టత వచ్చిన అటవీ భూముల్లో 50 శాతానికిపైగా రెవెన్యూ పహాణీల్లో చేర్పించాం" అని అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

## గ్రహం అనుగ్రహం

30-8-2019 శుక్రవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
అమావాస్య: సా.4-35 తదుపరి శుక్లపక్ష పాడ్యమి
మఘ నక్షత్రం: సా.6-42 తదుపరి పుబ్బ
అమృత ఘడియలు: సా.4-27 నుంచి 5-57 వరకు
వర్జ్యం: ఉ.7-29 నుంచి 8-59 వరకు తిరిగి రా.2-08 నుంచి 3-38 వరకు
దుర్ముహూర్తం: ఉ.8-17 నుంచి 9-06 వరకు తిరిగి మ.12-25 నుంచి 1-15 వరకు
రాహుకాలం: ఉ.10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-48; సూర్యాస్తమయం: సా.6.14

# కాళేశ్వరానికి భారీ రుణం

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం నుంచి రెండు టీఎంసీల నీటిని తీసుకునే పనులు జరుగుతుండగా, అదనంగా మరో టీఎంసీని మళ్లించే పనులకోసం ఆర్ఈసీ నుంచి రుణం తీసుకోనుంది. ఈ రుణానికి 10.9 శాతం వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. తాజాగా తీసుకునే రుణంలో మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు అదనంగా ఒక టీఎంసీ నీటిని మళ్లించడానికి రూ. 4,657.95 కోట్లు ఖర్చు చేస్తారు. మధ్యమానేరు నుంచి మల్లన్నసాగర్ రిజర్వాయర్ వరకు అదనంగా మరో టీఎంసీ నీటిని మళ్లించేందుకు రూ. 14,093.43 కోట్లు రుణంగా తీసుకుంటారు. మొత్తం రుణం రూ.18,751.38 కోట్లకు ప్రభుత్వం పూచీకత్తు ఇస్తుంది. రుణం తిరిగి చెల్లించడం, వడ్డీ, సర్వీసు ఛార్జీలు, అదనపు వడ్డీ, పన్నులు.. ఇలా అన్నింటి బాధ్యత ప్రభుత్వానిదే. ఈ నిధులతో చేపట్టిన పనులను మూడు నెలల్లో ఆర్ఈసీ పేరుతో బదలాయించాల్సి ఉంటుంది. తీసుకునే మొత్తానికి 10.9 శాతంతో నెలవారీగా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. రుణాన్ని 2021 ఏప్రిల్ నుంచి 12 సంవత్సరాల్లో(144 కంతులు) చెల్లించాలి. ఈ ఏడాది డిసెంబరు 31 లోగా ఒప్పందం పూర్తి చేయాల్సి ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్ఈసీ ఒక డైరెక్టర్‌ను కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్‌లో నియమించుకోవచ్చు. ఈ ప్రాజెక్టుకోసం ఇప్పటికే సుమారు రూ.40వేల కోట్ల రుణాన్ని ప్రభుత్వం తీసుకుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.పదివేల కోట్ల రుణం తీసుకునేందుకు ఇటీవలే ప్రభుత్వం అనుమతించింది.

# ఇక మరక అంటుకోదు!

- బూడిదతో నీటి నిరోధక పదార్థాల తయారీ

ఈనాడు, సంగారెడ్డి: దుస్తులు, ఇంటి గోడలు, కార్ల అద్దాలపై పడుతున్న మరకలను తొలగించడానికి ప్రస్తుతం పడుతున్న శ్రమ ఇకపై ఉండబోదు. వాటిని నీటి నిరోధకాలు (వాటర్ ప్రూఫ్)గా మార్చే ప్రక్రియను మరింత చౌకగా చేయడానికి ఐఐటీ హైదరాబాద్‌లో చేస్తున్న పరిశోధనలు కొలిక్కి వచ్చాయి. బొగ్గు ఆధారిత పరిశ్రమల నుంచి వచ్చే బూడిద (ఫ్లైయాష్)ను ఉపయోగించి ఐఐటీ పరిశోధకులు నీటి నిరోధక (హైడ్రోఫోబిక్) నిర్మాణాలను సృష్టించారు. హైడ్రోఫోబిక్ గుణాన్ని ప్రదర్శించే వీటి తయారీ కోసం ప్రస్తుతం వెచ్చిస్తున్న దానితో పోల్చితే తక్కువ ఖర్చుతోనే రూపొందించడానికి వీలవుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తామర ఆకులు, గులాబీ రెమ్మలను స్ఫూర్తిగా తీసుకొని బూడిద రేణువులు అలాంటి లక్షణాలనే ప్రదర్శించేలా పరిశోధకులు స్టీరిక్ ఆమ్లాన్ని వాడి ఫలితాన్ని రాబట్టారు. ఐఐటీలోని మెటీరియల్స్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ ముద్రికా ఖండేల్‌వాల్, డాక్టర్ అతుల్ సురేష్ దేశ్‌పాండేలతో పాటు పరిశోధక విద్యార్థిని ఊర్వశీ మహంతా ఈ పరిశోధనలో పాలుపంచుకున్నారు. ఈ ఫలితాలు ఇటీవలే కెమిస్ట్రీ సెలక్ట్ జర్నల్‌లోనూ ప్రచురితమయ్యాయి.

# కోయంబత్తూరులో ఎన్ఐఏ సోదాలు

- అనుమానితుల నుంచి వస్తువులు స్వాధీనం

ఈనాడు డిజిటల్, చెన్నై: తమిళనాడులోని కోయంబత్తూరులో గురువారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలు నిర్వహించింది. రాష్ట్రంలో ఉగ్రవాదులు చొరబడ్డారన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యం... ముఖ్యంగా కోయంబత్తూరును స్థావరంగా చేసుకున్నారన్న సమాచారంతో ఎన్ఐఏ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి ఏక కాలంలో ఐదు ప్రాంతాల్లో ఐదు గంటలపాటు సోదాలు చేపట్టారు. రేస్‌కోర్స్ ప్రాంతంలో ముబిన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం విడిచిపెట్టారు. అనుమానితుల నుంచి సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, సిమ్‌కార్డులు, పెన్‌డ్రైవ్‌లు, డిజిటల్ పరికరాలు, మెమొరీ కార్డులు, పెద్ద సంఖ్యలో దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో అరబిక్ భాషలో ముద్రించిన ఏడు పుస్తకాలు, కరపత్రాలు ఉన్నాయి. వీటన్నింటిని ఫోరెన్సిక్ పరిశోధనకు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు. ఉగ్రవాద భావజాలమున్న యువకులను ఆకర్షించి.. తమిళనాడు, కేరళల్లో దాడులు చేయాలని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయిస్తున్నారన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు సమాచారం. కొచ్చిలోని ఎన్ఐఏ కార్యాలయంలో శుక్రవారం హాజరు కావాలంటూ అనుమానితులైన అయిదుగురికి సమన్లు జారీ చేసినట్లు తెలిసింది.

# మందుపాతర పేల్చిన మావోయిస్టులు

చర్ల, న్యూస్‌టుడే: భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తిప్పాపురం రహదారిలో మావోయిస్టులు గురువారం సాయంత్రం మందుపాతర పేల్చారు. తిప్పాపురం నుంచి పామేడు(ఛత్తీస్‌గఢ్)కు వెళ్లే మార్గం కూడలిలో కల్వర్టు వద్ద మందుపాతర పేల్చడంతో రహదారి ధ్వంసమైంది. ఈ ఘటనతో సమీప గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. తిప్పాపురం సమీపంలో సీఆర్పీఎఫ్ క్యాంపులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఆర్పీఎఫ్ క్యాంపునకు వెళ్లే రహదారి కూడలిలో మావోయిస్టులు ఈ చర్యకు పాల్పడ్డారు. ఈ ఘటన అనంతరం పోలీసులు అప్రమత్తమయ్యారు. ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.

## వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| గుంటూరు | 37.9 | 27.8 |
| తిరుపతి | 37.2 | 27.9 |
| విజయవాడ | 36.2 | 26.4 |
| హన్మకొండ | 35.1 | 27.5 |
| ఖమ్మం | 35.0 | 29.0 |
| సూర్యాపేట | 35.0 | 29.0 |
| విశాఖపట్నం | 34.4 | 27.4 |
| నల్గొండ | 34.0 | 24.8 |
| నిజామాబాద్ | 33.3 | 25.1 |
| ఆదిలాబాద్ | 33.3 | 24.2 |
| కరీంనగర్ | 33.0 | 26.0 |
| మహబూబ్‌నగర్ | 32.9 | 24.7 |
| రామగుండం | 32.8 | 26.0 |
| హైదరాబాద్ | 32.8 | 25.0 |
| మెదక్ | 32.5 | 23.0 |




బీటలు పడని కాంక్రీట్ కోసం! అత్యధిక శక్తి గల సిమెంట్!




రామ్‌కో
సూపర్‌క్రీట్
సిమెంట్

Engineered for crack-resistant Concrete

FH 7138-2019

# ఈనాడు

## ఎండమావి సంస్కరణలు

సామాజిక భద్రతకు మూడక్షరాల సమానార్థకంగా వెలుగొందుతూ విధ్యుక్తధర్మం నిర్వర్తించాల్సినవాడు- పోలీసు. రక్షకభట వ్యవస్థ సమర్థంగా రాణిస్తేనే- నేరాలు, ఘోరాల పాలబడిన బాధితులు ఎంతో కొంత సాంత్వన దక్కి ఊరడిల్లుతారు. క్షేత్రస్థాయి స్థితిగతులు అందుకు విరుద్ధంగా ఉండి కలవరపరుస్తున్నాయన్న యథార్థానికి- పోలీసు పరిశోధన అభివృద్ధి విభాగం(బీపీఆర్‌డీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగపాఠం అద్దం పట్టింది. క్రిమినల్ కేసులలో దోషనిర్ధారణ రేటు స్వల్పంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తపరచారు. ఒక్క క్రిమినల్ కేసులనే ముంది- భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ)కింద నమోదైన నేరాల్లో దోషులకు శిక్షపడుతున్న సందర్భాలు 40శాతానికి మించడంలేదు. లైంగిక హింసకు సంబంధించిన కేసుల్లో ఆ రేటు 19శాతంలోపు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, కర్ణాటక, గుజరాత్, పశ్చిమ్‌బంగ వంటిచోట్ల 90శాతానికిపైగా నిందితులు నిర్దోషులుగా బయటపడుతున్నారు. ఫోరెన్సిక్ ఆధారాలతో అభియోగపత్రాన్ని రూపొందిస్తే దోషనిర్ధారణ రేటు మెరుగుపడుతుందంటున్న అమిత్ షా- జాతీయ స్థాయిలో పోలీసు ఫోరెన్సిక్ విశ్వవిద్యాలయాన్ని, రాష్ట్రాల్లో అనుబంధ కళాశాలల్ని అవతరింపజేస్తామనడం వినసొంపుగా ఉంది. అనుమానితులపై దండనీతి ప్రయోగం, ఫోన్‌ట్యాపింగ్ లాంటి పురాతన పద్ధతుల్ని విడనాడి దర్యాప్తులో పోలీసు యంత్రాంగం శాస్త్రీయ నైపుణ్యాలు ఉపయోగించాలని ఆయన పిలుపిస్తున్నారు. రక్షకభట వ్యవస్థలో కంతలు పూడ్చి దాన్ని విశేష ప్రభావాన్వితమయ్యేలా తీర్చిదిద్దడానికి సమగ్ర పోలీసు సంస్కరణల్ని వడివడిగా పట్టాలకు ఎక్కించాలనడంపై భిన్నాభిప్రాయానికి తావన్నదే లేదు.

ఆంగ్లేయుల జమానాలోని పోలీసు యంత్రాంగం పనిపోకడలతో పోలిస్తే అనంతర కాలంలో మౌలికంగా భారీ పరివర్తన చోటు చేసుకుందని అమిత్ షా ప్రత్యేకంగా ప్రస్తావించారు. అప్పట్లో పాలకుల కొమ్ము కాయడమే పోలీసు విధి; దరిమిలా ప్రజల సంరక్షణే వారి ప్రాథమిక కర్తవ్యమైందని ఆయన అంటున్నా- అందులో నిజమెంత? పౌరులకు, చట్టానికి, వ్యవస్థకు రక్షకభటులు జవాబుదారీ కావాలని దశాబ్దాల క్రితమే జాతీయ పోలీసు సంఘం చేసిన నిర్దేశాలు ఆచరణలో కొల్లబోతున్నాయి. పౌరుల సంతృప్త స్థాయి ఆధారంగా పోలీసుల పనితీరును మదింపు వేయాలన్న జస్టిస్ వర్మ కమిటీ సిఫార్సును చెవికెక్కించుకున్న నాథుడు లేడు. కస్టడీలో చావుకేకలది అంతులేని కథ. రాజకీయంగా పుచ్చి, నైతికంగా చచ్చిన సిబ్బంది 'సంఘటిత నేరగాళ్ల వర్గం'గా సాక్షాత్తు సర్వోన్నత న్యాయస్థానం చేత తలంటించుకొంది. బాధితుల ఫిర్యాదుల్ని నమోదు చేయాల్సిన పోలీసులు నేరగాళ్లతో కుమ్మక్కై ఎన్నో కేసుల్ని ఉద్దేశపూరితంగా తొక్కిపడుతున్నారని, దర కుదిరితే దర్యాప్తును నీరుకారుస్తున్నారన్న ఆరోపణలకు కొదవ లేదు. రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ చెప్పినట్లు, సాధారణ పౌరుడికి ప్రభుత్వమంటే పోలీసు కానిస్టేబులే. ఆ దశలోనే అభాగ్యులెందరికో అన్యాయం పదేపదే పునరావృతమవుతోందని గుర్తించిన రాజ్‌నాథ్ సింగ్ లోగడ కేంద్ర హోంమంత్రిగా దేశంలో ఠాణాలకు సంస్కరణల చికిత్సను ప్రతిపాదించారు. తనవంతుగా నేడు సామాజిక పోలీసింగ్, ఇన్ఫార్మర్ల వ్యవస్థ, పటిష్ఠ బీటు పద్ధతికి గట్టిగా ఓటేస్తున్న అమిత్ షా- పోలీసు యంత్రాంగంలోను, పోలీసింగ్ ప్రక్రియలోను సంస్కరణల్ని అభిలషిస్తున్నారు. అందుకోసం కొత్తగా కమిటీలు వేసి నివేదికల్ని రాబట్టనక్కర్లేదు. కొన్నేళ్లుగా పోగుపడిన సిఫార్సుల దస్త్రాల దుమ్ము దులిపితే చాలు!

నేర శిక్షా స్మృతి (సీఆర్‌పీసీ), భారతీయ శిక్షా స్మృతి (ఐపీసీ)లోని పలు నిబంధనల్ని ప్రక్షాళించే కసరత్తు త్వరలో ఆరంభించనున్నామన్న అమిత్ షా ప్రకటన- గతంలో అటువంటి ప్రకటనే చేసిన ఎందరినో స్మృతిపథాన నిలుపుతోంది. మాట దక్కించుకోలేకపోయిన మునుపటి నేతలకు, తనకు మధ్య కచ్చితమైన అంతరముందని ఆయన ఎలా చాటుకుంటారో చూడాలి! కాలంచెల్లిన నేర న్యాయ వ్యవస్థను, అసంబద్ధ చట్టాల్ని పట్టుకుని ఇంకా వేలాడుతున్నామని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఎన్.కృపాల్ ఏనాడో ఆక్షేపించారు. 1973లో నేర శిక్షా స్మృతిని సవరించినా అనేక లొసుగులు తొలగలేదు. నేర చట్టాల ప్రక్షాళనతోనే సంస్కరణ పరిపూర్ణం కాదు. పోలీసు యంత్రాంగం విధివిధానాల్ని ఎక్కడ ఎలా ఎంతవరకు సరిదిద్దగల ఆవశ్యకత ఉందో న్యాయ సంఘం, రెబీరో కమిటీ, జస్టిస్ మలీమత్ కమిటీ, పద్మనాభయ్య సంఘం తదితరాలు సోదాహరణంగా తెలియజెప్పాయి. ఎన్నో విలువైన సూచనల్ని నివేదించాయి. దుర్రాజకీయ కబంధ హస్తాలనుంచి పోలీసు వ్యవస్థను బంధవిముక్తం చేసే లక్ష్యంతో 2006లోనే సర్వోన్నత న్యాయస్థానం విస్పష్ట ఆదేశాలు జారీ చేసింది. నిరుడు నూతన మార్గదర్శకాల్నీ క్రోడీకరించింది. పోలీసు సంస్కరణల పట్ల రాష్ట్ర ప్రభుత్వాల భిన్న ధోరణుల్ని జస్టిస్ థామస్ కమిటీ 2010లోనే వెల్లడించినా- దిద్దుబాటు చర్యలపై ఏకీభావ సాధన ఇప్పటికీ ఎండమావినే తలపిస్తోంది! ప్రతి లక్ష జనాభాకు 222 మంది పోలీసులు ఉండాలన్నది ఐక్యరాజ్య సమితి నిర్దేశం. దేశంలో ఆ నిష్పత్తి 192కే పరిమితమైనట్లు గణాంకాలు సూచిస్తుండగా; రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 5.42 లక్షల పోలీసు కొలువులు భర్తీ కావాల్సి ఉందని కేంద్ర హోంశాఖే చెబుతోంది. సిబ్బంది కొరత కారణంగా- ఉన్నవారిపై విపరీతమైన పని ఒత్తిడి, వారాంతపు సెలవులకు ముఖం వాచే దుస్థితి ఒకవంక; అవినీతి, అడుగడుగునా విధేయస్వామ్యం మరోపక్క దిగ్భ్రాంతపరుస్తున్నాయి. అవసరానుగుణంగా నియామకాలు చేపట్టి బాధ్యత, జవాబుదారీతనం, సాంకేతికతలకు మారుపేరుగా వృత్తి నైపుణ్యాల కలబోతగా ఆధునిక పోలీసు వ్యవస్థను ఆవిష్కరించేలా సంస్కరణలు సమగ్రంగా పట్టాలకు ఎక్కేదెప్పుడు?

అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, బ్రిటన్ సహా 22 అభివృద్ధి చెందిన దేశాలను ఇప్పుడు ఉద్యోగాల వరద ముంచెత్తుతోంది. 36 దేశాల ఆర్థిక సహకార-అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ)లో సభ్యత్వం గల ఈ దేశాలు గడచిన అయిదేళ్లలో 4.3 కోట్ల ఉద్యోగాలు సృష్టించాయి. ఇటలీ, స్పెయిన్, గ్రీస్ తప్ప ఇతర సభ్యదేశాలన్నింటిలో నిరుద్యోగం నామమాత్రంగానే ఉంది. ధనిక దేశాల్లో గత యాభై ఏళ్లలో ఎన్నడూ లేనంత కనీస స్థాయికి నిరుద్యోగ రేటు పడిపోయి, పనిచేసేవారికి గిరాకీ పెరిగింది. ఇంతటి ఆర్థిక వెల్లువలోనూ కార్మికులు, ఉద్యోగుల జీతాలు పెరగడం లేదని, ఉబర్ డ్రైవర్లు, పిజ్జా డెలివరీ సిబ్బంది వంటి పరిమిత కాల ఉద్యోగాలనూ కలిపేసి అద్భుత గణాంకాలను విడుదల చేస్తున్నారన్న విమర్శ ఉంది. ఇందులో నిజం లేకపోలేదు. ఇప్పుడు కొత్తగా పుట్టుకొస్తున్న ఉద్యోగాలు ఉన్నత నైపుణ్యాలు కలిగిన వారినే వరిస్తున్నాయి. అలాగని తక్కువ నైపుణ్యం గలవారు రోడ్డున పడుతున్నారని కాదు. ప్రస్తుతానికి రెండు రకాల ఉద్యోగులకు గిరాకీ ఉండటంతో సంస్థలు క్రమంగా వేతనాలు పెంచుతున్నాయి.

# ప్రతిభావంతులకు పట్టం

ధనిక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతూ యువతీయువకుల సంఖ్య తగ్గిపోతున్నందు వల్ల ఉద్యోగుల కొరత ఏర్పడింది. మరోవైపు డిజిటల్ సాంకేతికత విస్తరించి నైపుణ్య సిబ్బందికి గిరాకీ అంతకంతకూ పెరిగిపోతోంది. స్థానిక విద్యాలయాల నుంచి వచ్చే సాంకేతిక నిపుణుల సంఖ్య గిరాకీని తీర్చే స్థాయిలో లేదు. ఫలితంగా సాఫ్ట్‌వేర్ మొదలుకొని ఇతర ఇంజినీరింగ్ విభాగాలు, డిజైనింగ్, విక్రయాల వరకు అంతటా నిపుణుల కొరత ఏర్పడుతోంది. ఎనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆరోగ్య సంరక్షణ సేవల వరకూ ఇదే తీరు. ఇప్పుడే ఇలా ఉంటే రేపు కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, త్రీడీ ముద్రణ రంగాలు పూర్తిస్థాయిలో విజృంభించాక పరిస్థితి ఎలా ఉంటుందోనని అమెరికా, కెనడా తదితర దేశాలు కలవరపడుతున్నాయి. ఈ ఉద్యోగాలకు సాంకేతిక నైపుణ్యాలతోపాటు సంభాషణా సామర్థ్యం, నిరంతర అధ్యయనాసక్తి వంటి మెలకువలు సైతం అవసరం. అమెరికాలోని కళాశాల పట్టభద్రుల్లో సాంకేతిక అర్హతలు, ఇతరత్రా మెలకువలు కలిగినవారు కేవలం 35 శాతమేనని ఓ అంచనా. అందుబాటులో ఉన్న ఈ కొద్దిమందికి విపరీతమైన గిరాకీ ఏర్పడినందు వల్ల వారు ఒకే సంస్థలో కుదురుగా ఉండటంలేదు. అధిక వేతనాలు, సౌకర్యాలను ఇచ్చే సంస్థలకు త్వరత్వరగా మారిపోతున్నారు. దీనితో సమర్థులను తయారు చేసుకోవడానికి ఆయా సంస్థలు నైపుణ్య బోధన-అభివృద్ధి సంస్థలను, అభ్యసన సాధనాలను ఆశ్రయించడం ప్రారంభమైంది.

### ఉపాధికి కొత్త చిగుళ్లు

కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్ వల్ల కోల్పోతున్న ఉద్యోగాలకన్నా కొత్తగా పుట్టుకొస్తున్న ఉద్యోగాలే ఎక్కువ. ఇప్పుడు అమెరికాలో ఏఐ, రోబోటిక్స్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లను సృష్టించగల డిజైనర్లకు, వాటికి పనులు నేర్పించేవారికి ఎంతో గిరాకీ ఉంది. ఏఐ సిస్టమ్స్, రోబోల విక్రయం, మరమ్మతు సేవల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. వాటి సాయంతో సమాచారాన్ని విశ్లేషించి, విక్రయాలు పెంచగల డిజిటల్ మార్కెటింగ్ నిపుణుల కోసం సంస్థలు పోటీపడుతున్నాయి. పాశ్చాత్య దేశాల్లో పారిశ్రామిక స్వయంచలిత యంత్రాల (ఆటోమేషన్) వాడకం పెరిగిపోతోంది. సంబంధిత సాంకేతికత పరిజ్ఞానం ఎప్పటికప్పుడు మారిపోతోంది. ఈ మార్పులను వెనువెంటనే అందిపుచ్చుకోవడానికి సంస్థలు పరుగు తీయక తప్పడంలేదు. ఈ పోటీలో నెగ్గడానికి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లను అమర్చుకోగానే సరిపోదు. వాటిని సమర్థంగా నడపగలవారి కోసం వెతుక్కోవలసి వస్తోంది. సాధారణ సిబ్బంది ఈ ఉద్యోగాలకు పనికిరారు. అన్ని అర్హతలు ఉన్నవారికి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. నిపుణులు ఉద్యోగాలకు దరఖాస్తులు పెడుతున్నారు. కానీ, అంతలోనే వేరే అవకాశాలు వస్తుండటంతో ముఖాముఖీలకు రావడం లేదు. ఇది ప్రధానంగా సేవారంగంలో కనిపిస్తోంది. సంప్రదాయ కర్మాగారాల్లో వేరే పరిస్థితి నెలకొంది. గతంలో అమెరికా నుంచి చైనాకు పరిశ్రమలు తరలిపోయినా, అవి హైటెక్ పరిశ్రమల రూపంలో తిరిగి అమెరికాకు వస్తున్నాయి. వాటిలో మానవ సిబ్బంది కన్నా స్వయంచాలిత యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. రేపటి 5జీ యుగంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వచ్చి పరిశ్రమల్లో కార్మికుల అవసరం మరింత తగ్గిపోతుంది. ఇప్పుడూ అప్పుడూ సేవారంగం మాత్రం భారీ సంఖ్యలో సిబ్బందిని వినియోగిస్తుంది. అయితే ఆ రంగం అత్యంత ప్రతిభావంతులకే ఎర్రతివాచీ పరుస్తుంది. గడచిన పదేళ్లలో అంతర్జాలం ద్వారా సిబ్బంది నియామకాలు వేగం పుంజుకొన్నా, అర్హులకు కొరత ఏర్పడటంతో ఇప్పుడు నియామకాలు నల్లేరు మీద నడకలా సాగడం లేదు. నేడు అమెరికాలో ఇదివరకటిలా పత్రికల్లోనో, అంతర్జాలంలోనూ 'ఉద్యోగార్థులు కావలెను' అని ప్రకటన ఇచ్చి కూర్చుంటే సరిపోదు. సంస్థలకు కావలసిన అర్హతలుండి దరఖాస్తు చేసేవారి కన్నా చేయని అభ్యర్థులే ఎక్కువైపోతున్నారు. వారి ముంగిట ఎన్నెన్నో అవకాశాలు ఉన్నాయి. అదే సమయంలో సాధారణ పని వారికి అంతర్జాలం వల్ల తేలిగ్గా పని దొరుకుతోంది. గతంలో నీటి కుళాయిల మరమ్మతుకు, ఫ్యాన్లు, ఎలక్ట్రిక్ సామాన్లను బిగించడానికి ఇంటి దగ్గర్లోని ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లను, ఇంటికి చిన్న మరమ్మతులు చేయాల్సి వస్తే పరిచయస్తులైన తాపీమేస్త్రీలను పిలిచేవారు. ఇప్పుడు అంతర్జాలంలో ఒక్కసారి క్లిక్ చేస్తే చాలు, ఎక్కడెక్కడి నుంచో పనివారు ఇంటిముంగిట వాలిపోతున్నారు. పెద్దగా నైపుణ్యాలు లేనివారికీ సులువుగా వేగంగా పని దొరకడంతో ఓఈసీడీ దేశాల్లో చిన్నాచితకా పనులు చేసేవారికి కొరత ఏర్పడింది.



అభివృద్ధి చెందిన దేశాల్లో ఉద్యోగాల వెల్లువ

### గ్రీన్‌కార్డుల విధానంలో మార్పులు...

నైపుణ్యాలున్న విదేశీయులకు శాశ్వత నివాస హక్కు కల్పించడానికి గ్రీన్ కార్డుల విధానాన్ని అమెరికా మార్చదలచింది. ఇటీవల అమెరికా ప్రజా ప్రతినిధుల సభ హెచ్-1బీ వీసాపై పనిచేస్తున్న లక్షలమంది విదేశీ సాంకేతిక నిపుణులకు త్వరగా గ్రీన్‌కార్డులు ఇవ్వడానికి ఉద్దేశించిన బిల్లును అత్యధిక మెజారిటీతో ఆమోదించింది. ప్రస్తుతం అమెరికా ఏటా 12 లక్షలమంది విదేశీయులకు గ్రీన్‌కార్డులు ఇచ్చి శాశ్వత నివాస హక్కు కల్పిస్తోంది. వాటిలో ఎనిమిది లక్షల గ్రీన్‌కార్డులు కుటుంబ సంబంధాల ఆధారంగా ఇస్తున్నవే. అంటే అమెరికా పౌరులు సిఫార్సు చేసిన రక్తసంబంధీకులకు, జీవిత భాగస్వాములకు అత్యధిక గ్రీన్‌కార్డులు ఇస్తున్నారు. ఉపాధి ఆధారంగా ఇచ్చే ఈబీ వీసాలు 1,40,000 మాత్రమే. ఈబీలో అయిదు విభాగాలున్నాయి. అవి- అద్వితీయ విద్యార్హతలు కలిగిన ఆచార్యులు, పరిశోధకులకు ఇచ్చే ఈబీ-1, వైద్యులు, న్యాయవాదులు, మేనేజర్లకు ఇచ్చే ఈబీ-2, సాంకేతిక ఉద్యోగాలు చేసే పట్టభద్రులకు ఇచ్చే ఈబీ-3, మతపరమైన వలసదారులకు, అటువంటి ప్రత్యేక తరహా వలసదారులకు ఇచ్చే ఈబీ-4, అమెరికాలో పెట్టుబడులు పెట్టేవారికి ఇచ్చే ఈబీ-5... ఇవన్నీ కలిపి ఏడాదికి కేవలం 1,40,000 గ్రీన్ కార్డులు ఇస్తున్నారు. వీటిపై రెండు పరిమితులు విధించారు. ఒకటి- దేశాలవారీగా ఏడు శాతం కోటాలు, రెండు- కుటుంబ ప్రాతిపదికపై గ్రీన్‌కార్డులు మంజూరు చేయడం. ఈ పద్ధతిలో భారతదేశానికి అన్ని ఈబీ విభాగాల్లోనూ కలిపి ఏటా దక్కుతున్నవి-కేవలం 9,800 వీసాలే. వాటిని మళ్లీ కుటుంబ ప్రాతిపదికపై మంజూరు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక భారతీయ హెచ్-1బీ వీసాదారుడికి గ్రీన్‌కార్డు లభించింది అంటే, అతడి భార్య, ఇద్దరు పిల్లలకూ అదే క్రమంలో గ్రీన్ కార్డులు వస్తాయి. ఈ పరిమితుల వల్ల ఇతర భారతీయ హెచ్-1బీ వీసాదారులు గ్రీన్‌కార్డుల కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల అమెరికా ప్రజా ప్రతినిధుల సభ ఆమోదించిన బిల్లు ఈ ఏడు శాతం కోటాను ఎత్తివేసింది. దీనివల్ల భారతీయులు, చైనీయులు లబ్ధి పొందనున్నారు. విదేశీ నిపుణులకు ఇచ్చే గ్రీన్‌కార్డులను 1,40,000 నుంచి 6,65,000కు పెంచాలంటున్నారు ట్రంప్. ఏటా ఇచ్చే 12 లక్షల గ్రీన్‌కార్డుల్లో 57శాతాన్ని ప్రతిభ ఆధారంగా ఇవ్వాలంటున్నారు. ఈ మేరకు ట్రంప్ అల్లుడు, అధ్యక్షుడి సీనియర్ సలహాదారు జారెడ్ కుష్నర్ వలస విధాన ముసాయిదాను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ప్రతిభ ఆధారంగా ఇస్తున్న గ్రీన్‌కార్డులు 12శాతం వలసదారులకే లభిస్తున్నాయని, కెనడాలో ఆ సంఖ్య 53 శాతమని కుష్నర్ వివరించారు. ఇది న్యూజిలాండ్‌లో 59, ఆస్ట్రేలియాలో 63, జపాన్‌లో 52శాతంగా ఉంది. అమెరికా సైతం ఇదే బాణీలో 57శాతం గ్రీన్‌కార్డులను ప్రతిభావంతులకు ఇచ్చే విధంగా వలస విధానాన్ని మార్చాల్సి ఉంది. సంపన్న దేశాల్లో నిపుణుల కొరత భారతీయ ప్రతిభావంతులకు అవకాశాలు కల్పిస్తోంది!

### విదేశీ నిపుణులకు అవకాశాలు




మరోవైపు నవీన ఆర్థిక వ్యవస్థ అవసరాలను తీర్చగల సంఖ్యలో ప్రతిభావంతులు లభ్యం కాక, వారికి గిరాకీ ఎక్కువై అధిక జీతభత్యాలు చెల్లించాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించడానికి పరిశ్రమలు స్వయంచాలిత యంత్రాలను (ఆటోమేషన్) ఆశ్రయించినా, వాటిని నిర్వహించగల ప్రతిభావంతులకు కొరత ఏర్పడుతోంది. సంపన్న దేశాల ప్రజలు తక్కువ పని గంటలు, ఎక్కువ వేతనాలు డిమాండ్ చేస్తున్నారు. అధిక ఆదాయంతోపాటు విద్యావైద్య సౌకర్యాలు, పింఛన్లను ప్రభుత్వమే సమకూర్చాలని ఒత్తిడి పెంచుతున్నారు. వారి కోరికలను తీర్చాలంటే ప్రభుత్వ ఆదాయాలు ఇబ్బడిముబ్బడిగా పెరగాలి. హైటెక్ పరిశ్రమలు, సేవల వల్ల మాత్రమే రాబడి పెరుగుతుంది. వాటిని నడపగల నిపుణులకు ఓఈసీడీ దేశాల్లో కొరత ఏర్పడినందువల్ల విదేశీ నిపుణులకు ద్వారాలు తెరవాల్సి వస్తోంది.

– ఏవీవీ ప్రసాద్

# ప్రగతికి ప్రాతిపదికలేమిటి?

దేశ ప్రగతి ప్రస్థానాన్ని అంచనా వేసేందుకు అనుసరించాల్సిన ప్రాతిపదికలేమిటి అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) వృద్ధిరేటు ఆధారంగా చేసుకొని దేశాభివృద్ధిని అంచనా వేయడం ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతి. వృద్ధిరేటు గణాంకాలు ఎంత బాగుంటే దేశం అంతగా వెలుగులీనుతున్నట్లు ప్రభుత్వాలతోపాటు, విఖ్యాత ఆర్థికవేత్తలూ తీర్మానించేస్తున్నారు. జీడీపీ, వృద్ధిరేటును బట్టి దేశం గతిరీతులను తేల్చేసే విధానంలో కొన్ని లోపాలున్నాయి. దేశాభివృద్ధికి సంబంధించిన క్షేత్రస్థాయి వాస్తవాలను జీడీపీ లెక్కలు ఎంతమేరకు ప్రతిఫలిస్తాయన్న విషయంలో అనుమానాలున్నాయి. దేశ ప్రజల వినియోగం, వస్తు సేవలు, ప్రభుత్వ వ్యయాలు, ప్రైవేటు పెట్టుబడులు, ఎగుమతుల ద్వారా ఆర్జించిన ఆదాయాల ఏడాదికాల మొత్తం ద్రవ్య విలువను స్థూల దేశీయోత్పత్తిగా లెక్కగడుతుంటారు. జీడీపీ ఎంత ఎక్కువగా ఉంటే పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం అంత గరిష్ఠంగా దఖలుపడుతుందని, తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర పెట్టుబడులకోసం ప్రభుత్వం దగ్గర సమృద్ధిగా నిధులు పోగుబడతాయన్నది ఒక విశ్లేషణ. ఆర్థిక వ్యవస్థలోని భిన్న రంగాల పనితీరును జీడీపీ గణాంకాలు ప్రతిఫలిస్తాయి కాబట్టి- వాటి ఆధారంగా ప్రణాళికలు రూపొందించుకోవడం సులభమన్నది ఇంకో వాదన. దేశాభివృద్ధిని, ఆర్థిక వ్యవస్థ పనితీరును జీడీపీ గణాంకాలు నిర్దిష్టంగా ప్రతిఫలించవు. ప్రగతి అంచనాకు జీడీపీని ఏకైక కొలబద్దగా పరిగణించడం సరికాదు. ఏడాది కాలంలో ప్రజల వినియోగ స్థాయి ఎంత అన్న విషయాన్ని జీడీపీ గణాంకాలు వివరిస్తాయేగానీ- ప్రజల వినియోగం తీరుతెన్నుల్లోని అసమానతలకు ఆ గణాంకాలు అద్దం పట్టవు.

స్థూల దేశీయోత్పత్తి సంవత్సర కాల పరిమితిలో వినియోగ పరిమాణాన్ని వెల్లడిస్తుందిగానీ- ఆ క్రమంలో ఏయే వర్గాలు ఎంతెంత మొత్తం ఖర్చుపెడుతున్నాయన్న కీలక వివరాలను అందించదు. దేశంలో సుమారు 20శాతం ప్రజలు అంటే ఇంచుమించుగా 25 కోట్లకుపైగా ప్రజలు దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నారనుకుంటే- రంగరాజన్ కమిటీ లెక్కల మేరకు ఆ జాబితాలోని ప్రతి ఒక్కరు రోజుకు 32 రూపాయలతోనే బతుకు నెట్టుకొస్తున్నారు. ఆ రకంగా దేశంలోని పాతిక శాతం ప్రజల సగటు వ్యయం రూ.11,664 మాత్రమే! ఈ ప్రాతిపదికన పాతిక కోట్ల ప్రజల ఏడాదికాల సంచిత వినియోగం రూ.2,91,600 కోట్లుగా లెక్కతేలుతోంది. 2018-19 కాలానికి జీడీపీ పరిమాణం 140.78 లక్షల కోట్లు. దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న పాతిక శాతం ప్రజల వినియోగం అందులో రెండు శాతానికి మాత్రమే సమానం కావడం గమనార్హం. తలసరి జీడీపీ రూ.105,688 కాగా అందులో దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న 25శాతం ప్రజల వ్యయం తొమ్మిది శాతానికి సమానం. వినియోగస్థాయుల్లో హెచ్చు తగ్గులు దేశ ప్రజల జీవన ప్రమాణాల్లో అసమతౌల్యతకు కారణమవుతాయి. విలాసాలపై అత్యధిక వ్యయం చేస్తున్న వర్గం ఒకవైపు- కనీసావసరాలకూ దిక్కులేక సతమతమవుతున్న ప్రజానీకం మరోవైపు ఉన్న దేశం మనది. ఈ సూక్ష్మ వివరాలను పట్టించుకోకుండా ధనిక, మధ్యతరగతి, పేద వర్గాల వినియోగాన్నంతటినీ ఒకే గాటన కట్టి స్థూలంగా లెక్కలు చూపి- 'ఆహా దేశం ఎంత గొప్పగా పురోగమిస్తోంది' అని జబ్బలు చరచుకోవడం అహేతుకం. దేశం ప్రగతి దారుల్లో సాగుతోందని, ప్రజలంతా అత్యద్భుత జీవన ప్రమాణాలతో విలసిల్లుతున్నారని ప్రపంచానికి చాటుకోవడమే ప్రభుత్వ ఉద్దేశమైతే ఈ తరహా జీడీపీ లెక్కలు బ్రహ్మాండంగా అక్కరకొస్తాయి. కానీ ఇలాంటి లెక్కలు భారతావని ఆర్థిక ఆరోగ్యాన్ని సమగ్రంగా ప్రతిఫలిస్తున్నాయా అని ప్రశ్నించుకుంటే మాత్రం లేదన్నదే సమాధానం.



గణాంకాల గారడి

ఉదాహరణకు దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న దిగువ, మధ్యాదాయ వర్గాలు ఏడాదికాలంలో 40 లక్షల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారనుకుందాం. ఇందులో గణనీయ ఆదాయానికి ప్రాతినిధ్యం వహించే కొద్దిమంది వాటా 35 లక్షల కోట్ల రూపాయలు అయితే- మిగిలిన వర్గమంతా అయిదు లక్షల కోట్ల ఖర్చుకే పరిమితమైనట్లు లెక్క. ఇలాంటి పరిస్థితుల్లో మొత్తం 40 లక్షల కోట్ల రూపాయల వినియోగాన్ని యావత్ మధ్యతరగతికీ సమాన వాటాగా పంచితే జీవన ప్రమాణాలు గొప్పగానే లెక్కతేలతాయి. దేశ ఆర్థిక పురోగతికి ఈ తరహా అంచనాలు సరైన ప్రాతినిధ్యం వహిస్తాయా? ప్రభుత్వ వ్యయాన్నీ జీడీపీ లెక్కల్లో అంతర్భాగంగా గణిస్తారు. సర్కారీ పెట్టుబడులు ఎంతగా ఇనుమడిస్తే అంతగా దేశం పురోగమిస్తుందన్న వాదనలున్నాయి. అత్యవసర రంగాలను ఎంపిక చేసుకొని, నిర్దిష్ట ప్రాథమ్యాల మేరకు ప్రభుత్వం పెట్టుబడులు పెడితే ప్రగతి కొత్త పుంతలు తొక్కుతుందనడంలో సందేహం లేదు. ప్రభుత్వాల ప్రాథమ్యాల విషయంలోనే అనేక అనుమానాలున్నాయి. జీడీపీ వృద్ధిరేట్లు, లక్షల కోట్ల రూపాయలకు ప్రాతినిధ్యం వహించే గణాంకాలే పురోభివృద్ధికి ప్రాతిపదిక అయితే ఇప్పటికీ దేశంలో ఆరోగ్య రంగం ఎందుకు ఇంత దారుణంగా కునారిల్లుతోంది? ప్రపంచ ఆకలి సూచీలో భారత్ ఇన్నేళ్ల స్వాతంత్ర్యానంతరమూ '103'వ స్థానంలో ఎందుకు మగ్గుతోంది? ప్రాథమిక విద్యకు సంబంధించి అనేక దేశాలతో పోలిస్తే పరిస్థితి ఎందుకింత దిగనాసిగా ఉంది? పారిశ్రామిక రంగ సామర్థ్యం ఎందుకు అంతకంతకూ కొడిగడుతోంది? జీడీపీ లెక్కలనే జాతి అభివృద్ధి సంకేతాలుగా ప్రచారం చేస్తున్న ఆర్థికవేత్తలే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా విధాన నిర్ణేతలు క్షేత్రస్థాయి వాస్తవాలను గుర్తించి, వాస్తవిక దృక్పథంతో వ్యవహరిస్తే మంచిది!

– సత్యపాల్ మేనన్

## ఈనాడు లేఖలు

### పండగ పేరుతో పెడధోరణులు

వినాయక చవితి పేరుతో కొన్ని ప్రాంతాల్లో పెడ ధోరణులు ప్రబలుతున్నాయి. ఇది ఆందోళనకర పరిణామం. బలవంతంగా చందాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లౌడ్ స్పీకర్లలో పెద్దశబ్దాలతో పాటలు వేయడం వల్ల సమీప ప్రాంతాల ప్రజలకు ఇబ్బందిగా ఉంటుంది. ఆడంబరంగా ఊరేగింపుల వల్ల అధిక ఖర్చు తప్ప ఉపయోగం లేదు. ఎండాకాలంలో చెరువులు, కుంటల్లో పూడిక తీసి దాన్ని పొలాల్లో ఎరువుగా వాడుకుంటారు. వర్షకాలంలో ఆ నీటివనరుల్లోని మట్టితో వినాయక విగ్రహాలు తయారుచేసి, పండగ చేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారయ్యే విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటివనరులు కాలుష్యానికి గురవుతాయి. ప్రభుత్వం ఈ ధోరణులను అడ్డుకోవాలి. భారీ విగ్రహాలను, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగాన్ని నిషేధించాలి. ఈ మేరకు ప్రజల్లో చైతన్యం, అవగాహన కలిగించాలి.

- వీర పూర్ణచందర్‌రావు, మూసాపేట, హైదరాబాద్

### అకృత్యాలకు అడ్డుకట్ట పడాలి

ముక్కుపచ్చలారని చిన్నారులపై అత్యాచారాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు? ఒకవైపు చట్టాలను కఠినతరం చేస్తున్నా, నిత్యం ఏదో ఒక చోట అత్యాచారాలు, హత్యలు కొనసాగుతూనే ఉండటం దురదృష్టకరం. పేదరికం, నిరక్షరాస్యత గల సమాజంలో పుట్టి, నేరపూరిత వాతావరణంలో పెరిగినవారే అకృత్యాలకు పాల్పడుతున్నారనుకుంటే పొరపాటే. ఉన్నత చదువులు చదివినవారూ వేధింపులకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. కార్యాలయాల్లో పనిచేసే మహిళలపై అధికారులు; పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులపై ఉపాధ్యాయులు, అధ్యాపకులు... ఇలా ఎందరో పంజా విసురుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆదర్శంగా నిలవాల్సిన వారే అనైతికంగా ప్రవర్తించడం ఆందోళన కలిగిస్తోంది. ఆడపిల్లలపై సమాజ దృక్పథం మారాలి. నైతిక విలువల గురించి తల్లిదండ్రులు నేటి తరానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- ఎ.అనిల్, నందిపేట, నిజామాబాద్

## శ్రవణం

వినసొంపుగా చెప్పేవాళ్లుంటే సరిపోదు, శ్రద్ధగా వినేవాళ్లూ ఉండాలి. సావధానంగా చెవులు రిక్కించి వినేవాళ్లుంటే కుదరదు... విషయాన్ని ఓపిగ్గా విడమరచి చెప్పేవాళ్లుండాలి. గురు శిష్య పరంపర కొనసాగుతుండటానికి ముఖ్యకారణం- 'గురువు చెప్పడం, శిష్యుడు వినడమే'. ఆధ్యాత్మిక జీవన వికాసంలో ప్రస్తావించే శ్రవణం, మననం, నిదిధ్యాసనం, సాక్షాత్కారాలకు చాలా ప్రాముఖ్యం ఉంది. మోక్షం అనే భగవద్ సాక్షాత్కారం పొందడానికి శ్రవణమే నాంది అన్నది మనం గమనించాల్సిన ముఖ్యమైన అంశం. శ్రీమద్భాగవతాంతర్గతంగా చెప్పిన నవ విధ భక్తిమార్గాల్లోనూ శ్రవణానిది మొదటి స్థానమని గుర్తించాలి. మనిషి జీవన ప్రయాణంలో సమయానికి నాలుగు మంచి ముక్కలు చెప్పగలిగేవాళ్లు దొరకడం పూర్వజన్మ సుకృతం. చెవులకు రెప్పలు లేవు కాబట్టి, సమస్త మాటల ప్రవాహం మనసులోకి అలవోకగా ప్రవహిస్తుంది. హృదయాన్ని జల్లెడ చేసుకుని మంచిని గ్రహించి, చెడును విసర్జిస్తే లోకాస్సమస్తా సుఖినో భవంతు అన్న భావానికి అంకురారోపణ జరుగుతుంది.

వేదాలను రుషులు భగవంతుడి ద్వారా విని గానం చేశారు. అందుకే వీటిని శ్రుతులు అంటారు. ఆనాటి రుషులు అంతటి ఏకాసంథాగ్రాహులు కావడం వల్లే ఒక్క అక్షరం పొల్లుపోకుండా ఆ జ్ఞాన సంపద మన వరకు చేరింది. అది సంప్రదాయ రీతులు ఏర్పరచి మనుషులు కట్టు తప్పకుండా చూసుకుంటోంది.

వినడం అన్నది అంత తేలికైన విషయం కాదు. మనసును పరిపరి విధాల ఆలోచనలపైకి జారుకోనీయకుండా పట్టుకుని, వినబోయే విషయం మీద పెడితే అప్పుడు ఎదుటి మనసులోది మన వశమవుతుంది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పిల్లలందరికీ ఒక్కసారే విపులంగా పాఠం చెప్పినా, ఒక్కొక్కరూ ఒక్కో రకంగా అర్థం చేసుకుని, వారికి తోచిన విధంగా పరీక్షల్లో రాయడమే మార్కుల తారతమ్యానికి కారణం.



అంతర్యామి

గురువు వందలమందికి ప్రవచనం చెప్పినా, కొంతమంది కేవలం అక్కడ కూర్చుంటారు, వాళ్ల మనసు అన్ని వైపులకు పరుగులు తీస్తుంటుంది. మరి కొంతమంది వింటారు కాని అర్థం చేసుకునే ప్రయత్నం చేయరు. ఇంకొంతమంది ఆ కార్యక్రమానంతరం చేయవలసినదాని గురించి మనసులో ప్రణాళికలు రచిస్తుంటారు. ఒకరో ఇద్దరో మాత్రమే శ్రద్ధగా విని, ఆకళింపు చేసుకుని, ఇంకా అర్థంకానిది ఏమైనా ఉంటే గురువు గారిని అడిగి సందేహాలు తీర్చుకుంటారు. సంతృప్తిగా ఇళ్లకు చేరుకుంటారు.

వినదగునెవ్వరు చెప్పిన అన్నది ఒక పద్యకారుడు చెప్పిన అతి విలువైన పదాల పొందిక. చెప్పేవన్నీ ఉచిత సలహాలు అని తేలిగ్గా తీసేయడం తగదు. ఎవరు చెప్పే మాటలు మనకు దిశానిర్దేశం చేస్తాయో, కష్టనష్టాల నుంచి బయటపడేస్తాయో ఎవరికీ తెలియదు. అందరు చెప్పేదీ వినాలి, తార్కికంగా ఆలోచించి ఆచరించాలి. నాకంతా తెలుసు ఇక వినవలసింది ఏమీ లేదు అనుకోవడం- పతనావస్థకు చేర్చే దారిపట్టడమే.

చెప్పేవాళ్లు లేక చెడిపోయాడు అన్నది నానుడి. ఈ లోకంలో మన గురించి ఆలోచించి, సుభాషితాలు చెప్పి, సరైన బాటలో నడిపించేవాళ్లు లభించడం అరుదు. మాటలు శ్రవణపేయంగా ఉండవలసిన అవసరం లేదు. అవి కఠినంగా ఉన్నా బతుకును తీర్చిదిద్దేవిగా ఉండాలి. విశ్వామిత్రుడు, యాగ సంరక్షణార్థం శ్రీరాముణ్ని తనతో అడవికి పంపమని దశరథుణ్ని కోరినప్పుడు, ఆయన పసివాణ్ని పంపడానికి ఇష్టపడడు. విశ్వామిత్రుడు కోపోద్రిక్తుడై కఠినంగా, పంపితీరాల్సిందేనంటాడు. అందులోని యథార్థాన్ని గ్రహించింది ఒక్క వసిష్ఠుడే. ఆయన దశరథుడికి నచ్చజెప్పి విశ్వామిత్రుడితో శ్రీరామచంద్రుణ్ని కానలకు పంపి ఉండకపోతే- రామయ్య ఉత్తమత్వం లోకానికి ప్రకటితమయ్యేది కాదు. రాముడి బాట మనకు రాచబాట అయ్యేదీ కాదు!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు




కొన్ని నెలల క్రితం వర్ష..అలా ★ ప్రాణాలు తోడేస్తున్న వ్యాధితో ఇప్పుడు ఇలా..

## నిత్య వేదన.. నరక యాతన

### కబళిస్తున్న క్యాన్సర్‌తో.. పదేళ్ల బాలిక జీవన్మరణ పోరు

ఎముకల వ్యాధి రూపంలో విధి విరుచుకుపడి, వికృతంగా నర్తించి, పసిబతుకును ఛిద్రం చేస్తోంది. మనసు కరిగి కళ్లు చెమర్చి, ఆదుకునే చేతులన్నీ ఒక్కటి కావడమే మానవత. బాలిక బతుకు, భవితకు ఇదే భరోసా.

పై చిత్రంలోని అమ్మాయిది సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట. రెక్కలు ముక్కలు చేసుకుంటే తప్ప పూట గడవని నిరుపేద కుటుంబం. అమ్మ లక్ష్మి ఇంట్లోనే ఉంటూ బీడీలు చుడుతూ పదో పరకో వచ్చేలా తాపత్రయపడుతుంటుంది. నాన్న కిష్టయ్యకు కూలిపని దొరికితేనే కడుపు నిండేది. ఆరో తరగతి చదువుతున్న బిడ్డ ఒకరోజున ఆడుకుంటూ జారిపడినప్పటి నుంచి..అన్ని రకాల కష్టనష్టాలూ వాళ్లను అనకొండలా చుట్టుకున్నాయి. చక్కగా చదువుతూ చలాకీగా ఆడుతూ పెరగాల్సిన కూతురు తమ కళ్లముందే నిత్యం నరక యాతన పడుతోందని తల్లిదండ్రులు తల్లడిల్లని క్షణమంటూ లేదు. తల భాగం ఆరు నెలల్లోనే విపరీతంగా ఉబ్బింది. దిగువకు విస్తరించి, చివరికి ఒక కన్ను పూర్తిగా మూసుకుపోయింది. ఇదీ పదేళ్ల 'వర్ష' హృదయ విదారక విషాద గాథ. సిద్దిపేటకు చేరిన వారు పాడుబడిన పెంకుటింట్లో కిరాయికి ఉంటున్నారు. వాపు..కాయ రూపంలోకి మారి, కంతిగా రూపాంతరం చెంది, ఎముకల క్యాన్సర్‌గా దాపురించిందని..వైద్యపరీక్షల్లో బయటపడింది. ప్రాణాంతక వ్యాధి ఈ పసిదాన్ని క్రమేణా కబళిస్తోంది. వైద్యానికి ఆరు నెలల్లో రూ.4 లక్షలు ఖర్చుచేయాల్సిన స్థితి పేద బతుకుల్ని మరింతగా కష్టాల కడలిలో ముంచెత్తింది. చుట్టుముట్టిన వ్యాధి, చేయించాల్సిన వైద్యం వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. క్షణం ఓ యుగంలా గడుస్తోంది!

– న్యూస్‌టుడే, నంగునూరు

## కాడెద్దుకు తోడుగా కాటి వరకు సాగగా..



ఎద్దు కళేబరం పక్కనే అంతిమయాత్రలో రైతు కుటుంబ సభ్యులు

భూమాతను కన్నతల్లిగా.. కాడెడ్లనే కన్న కొడుకులుగా భావించే అన్నదాతలు ఎందరో! సొంత మనుషులు చనిపోతేనే తూతూమంత్రంగా అంత్యక్రియలు కానిచ్చేసే నేటిరోజుల్లో.. చనిపోయిన కాడెద్దుకు ఓ రైతు ఘనంగా అంతిమయాత్ర నిర్వహించి సొంత పొలంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం జాడీ మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు బల్లెపు రాచన్నకు రెండు ఎద్దులు ఉన్నాయి. వాటికి పేర్లు కూడా పెట్టుకుని అపురూపంగా చూసుకునేవాడు. వాటిలో లస్మా అనే ఎద్దు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. వ్యవసాయ పనుల్లో ఎప్పుడూ ఇబ్బంది పెట్టకుండా పనిచేసిన ఆ మూగజీవి కన్నుమూయడంతో కుటుంబ సభ్యులంతా ఉదయం వరకు విలపిస్తూనే ఉన్నారు. గురువారం ట్రాక్టర్ ట్రాలీలో ఎద్దు మృతదేహాన్ని ఉంచి తెల్లటి వస్త్రం కప్పి.. డప్పు వాయిద్యాలతో గులాబీ రేకులు, పేలాలు చల్లుతూ, పటాకులు కాలుస్తూ ఘనంగా అంతిమయాత్ర నిర్వహించారు. రైతు రాచన్న ఆయన భార్య వెంకమ్మ, కుమారులు ఎద్దు కళేబరం పక్కనే ట్రాక్టర్లో కూర్చుని ఈ యాత్రలో పాల్గొన్నారు. సొంత పొలంలోనే తమ ఆత్మబంధువుకు ఖననం పూర్తిచేసి బరువెక్కిన హృదయాలతో వెనుదిరిగారు.

– న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

## చంద్రయాన్-2 ల్యాండింగ్‌ను బెంగళూరు నుంచి వీక్షించనున్న మోదీ

**ఈనాడు డిజిటల్, బెంగళూరు:** ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబరు 7న బెంగళూరుకు రానున్నారు. ఇస్రో ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-2 ఉపగ్రహం చంద్రునిపై అడుగు పెట్టే సందర్భాన్ని ఆయన బెంగళూరులోని భూ నియంత్రిక కేంద్రం నుంచే వీక్షిస్తారు. ఈ నెల 21న చంద్రయాన్-2 చంద్రుడి కక్ష్యలో ప్రవేశించిన సందర్భంగా ఇస్రో అధ్యక్షుడు కె.శివన్ ప్రధాని రాకను ప్రస్తావించారు. చంద్రయాన్-2 విజయవంతమైతే ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని బెంగళూరు నుంచే ప్రసంగిస్తారు.

## నీటిపారుదల శాఖలో ఎస్ఈల బదిలీలు

**ఈనాడు, హైదరాబాద్:** నీటిపారుదల శాఖలో పలువురు పర్యవేక్షక ఇంజినీర్లు (ఎస్ఈలు), కార్యనిర్వాహక ఇంజినీర్లను (ఈఈ) బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెలాఖరున అయిదుగురు ఎస్ఈలు, ఒక ఈఈ పదవీ విరమణ చేయనుండటంతో ఏర్పడనున్న ఖాళీలను భర్తీ చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పదవీ విరమణ చేస్తున్న ఎ.శ్రవణ్‌కుమార్ (హైడ్రాలజీ- కరీంనగర్) స్థానంలో కె.మహేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. టి.రాజశేఖర్ (సీడీవో- హైదరాబాద్) స్థానానికి ఐఎస్‌డబ్ల్యూఆర్‌లో ఎస్ఈగా ఉన్న వి.మోహన్‌కుమార్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో జి.డి.నరహరి బాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కె.శివకుమార్ (హైడ్రాలజీ- హైదరాబాద్) స్థానంలో మహబూబ్‌నగర్ ఎస్ఈగా ఉన్న ఆర్.జయపాల్‌రావును బదిలీ చేశారు. ఆయన స్థానంలో డి.నర్సింగరావును నియమించారు. జి.హరిహరాచారి (కాళేశ్వరం- కరీంనగర్) స్థానంలో బి.విష్ణు ప్రసాద్‌ను నియమించారు. బి.దేవసహాయం (కాళేశ్వరం - హైదరాబాద్) స్థానంలో ఎ.సత్యనారాయణ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. సీహెచ్ మధుసూదన్‌రావు (ఈఈ, ఎస్సారెస్పీ- పెద్దపల్లి) స్థానంలో పి.నాగభూషన్‌రావును నియమించారు. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్‌లో ఉప కార్యనిర్వాహక ఇంజినీరుగా ఉన్న అయేషా తస్నీంకు డిప్యూటీ చీఫ్ ఇంజినీర్-3 (ఈఎన్‌సీ కార్యాలయం)గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## నిబంధనల ఉల్లంఘనపై ఏం చర్యలు తీసుకున్నారు?

### ప్లాస్టిక్ తయారీపై నివేదిక సమర్పించాలంటూ పీసీబీకి హైకోర్టు ఆదేశం

**ఈనాడు, హైదరాబాద్:** ప్లాస్టిక్ తయారీలో నిబంధనలు ఉల్లంఘించిన తయారీదారులపై ఏం చర్యలు తీసుకున్నారో వివరాలతో 24 గంటల్లో నివేదిక సమర్పించాలంటూ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)కి గురువారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో విక్రయిస్తున్న అతి పెద్ద వినాయక విగ్రహాలను కప్పి ఉంచడానికి ప్లాస్టిక్ కవర్‌లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నా అధికారులు స్పందించకపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన వై.వి.మురళీకృష్ణ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను తయారు చేస్తున్న కంపెనీలపై ఎన్ని కేసులు నమోదు చేశారు? ఏం చర్యలు తీసుకున్నారు? తదితర వివరాలను సమర్పించాలని పీసీబీని ఆదేశిస్తూ ధర్మాసనం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

# సాయంత్రం ఓపీ సేవలు షురూ

- నిజామాబాద్, ఖమ్మం ఆసుపత్రుల్లో బారులుతీరిన రోగులు
- నిలోఫర్, ఫీవర్, ఎంజీఎం, రిమ్స్.. ఆసుపత్రుల్లో ప్రారంభంకాని సేవలు
- నిర్వహించాల్సిందేనని స్పష్టం చేసిన ప్రభుత్వం



నిజామాబాద్ ఆసుపత్రిలో గురువారం సాయంత్రం ఓపీకి బారులు తీరిన రోగులు

ఈనాడు- హైదరాబాద్: రాష్ట్రంలోని సర్కారు దవాఖానాల్లో సాయంత్రం ఓపీ సేవలు ప్రారంభమయ్యాయి. విష జ్వరాల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం అధిక శాతం ఆసుపత్రులు ఉదయం వైద్యసేవలకు అదనంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ ఓపీ సేవలు అందించాయి. కొన్ని ఆసుపత్రుల్లో రోగుల తాకిడితో రాత్రి 8 గంటల వరకూ ఓపీలో వైద్యసేవలు, నిర్ధారణ పరీక్షలు కొనసాగాయి. సాయంత్రం ఓపీలో గురువారం అత్యధికంగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 300 మంది, ఖమ్మం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సుమారు 70 మంది సేవలు పొందారు. నల్గొండ, కరీంనగర్ జిల్లా ఆసుపత్రులకూ సాయంత్రం ఓపీకి ఎక్కువమంది రోగులు వచ్చారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో ఈ సేవలు ప్రారంభించినా.. ఎక్కువమందికి ఈ విషయం తెలియక చికిత్సకు రాలేదని తెలుస్తోంది. పలు ఆసుపత్రులు సాయంత్రం ఓపీ ప్రారంభించకపోవడంపై ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి తీవ్రంగా స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని ఆసుపత్రులు ఈ సేవలు ప్రారంభించాలని, లేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**బస్తీ దవాఖానాల్లో..**

హైదరాబాద్‌లోని సుమారు 100 బస్తీ దవాఖానాల్లో సాయంత్రం వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ సేవలను విస్తరించారు.

**సేవలు ప్రారంభించని ఆసుపత్రులు**

ఫీవర్ ఆసుపత్రిలో శుక్రవారం నుంచి సాయంత్రం ఓపీ సేవలు ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ తెలిపారు.

- వరంగల్ ఎంజీఎంలో సాయంత్రం ఓపీ గదుల తాళాలే తీయలేదు. ఉన్నతాధికారుల నుంచి సమాచారం రానందున ప్రారంభించలేదని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.
- మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ రిమ్స్, నిలోఫర్ ఆసుపత్రుల్లోనూ సాయంత్రం ఓపీ సేవలపై అధికారులు దృష్టి పెట్టలేదు.

## వైద్యుల గైర్హాజరుపై మంత్రి ఎర్రబెల్లి అసంతృప్తి

### ఎంజీఎంలో ఆకస్మిక తనిఖీ • విధులకు రాని వైద్యులపై చర్యలకు ఆదేశాలు



వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో కలెక్టర్ ప్రశాంత్ పాటిల్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఓపీ విభాగాల్ని పరిశీలించారు. విధుల్లో లేని వైద్యులకు ఫోన్ చేసి ఆసుపత్రికి రాకపోవడంపై ప్రశ్నించారు. ఐదుగురు వైద్యులు విధుల్లో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక వైద్యుడు కారులో ఉన్నానని, మరొకరు వైద్య కళాశాలలో ఉన్నానని ఇలా వేర్వేరు కారణాలు చెప్పారు. వారి సమాధానాలపై అసహనం వ్యక్తం చేసిన మంత్రి విధుల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. క్యాజువాలిటీలో రిజిస్టర్‌లో సంతకం చేసిన వైద్యుడు అక్కడ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "మొదటిసారి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నా. మరోసారి ఇలా జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయి" అని మంత్రి హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన సమయంలో ప్రైవేట్ క్లినిక్‌లలో వైద్యం చేస్తామంటే సహించేది లేదని దయాకర్‌రావు స్పష్టం చేశారు.

# సర్వేయర్ నివేదికే అంతిమం కాదు

- ప్రమాదం జరిగిన వాహన విషయంలో బీమా చెల్లింపుపై రాష్ట్ర వినియోగదారుల కమిషన్ వ్యాఖ్య
- మిగిలిన సొమ్ము రూ.1.20 లక్షలు చెల్లించాలంటూ రిలయన్స్‌కు ఆదేశం



ఈనాడు, హైదరాబాద్: వాహనం ప్రమాదానికి గురైనప్పుడు నష్టాన్ని అంచనా వేస్తూ ఇచ్చిన సర్వేయర్ నివేదికే అంతిమం కాదని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ స్పష్టం చేసింది. అధీకృత డీలరు మరమ్మతులకైన మొత్తాన్ని బిల్లుల రూపంలో సమర్పించినందున ఆ మొత్తం చెల్లించాల్సిన బాధ్యత బీమా కంపెనీపై ఉందని తెలిపింది. ఐడీవీ కింద బీమా పాలసీ తీసుకున్న పాలసీదారుకు మిగిలిన మొత్తం రూ.1.20 లక్షలు 7.5 శాతం వడ్డీతో చెల్లించాలంటూ రిలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లను ఆదేశించింది. వరంగల్‌కు చెందిన కె.దైవదాస్ టవేరా వాహనానికి 2014 ఫిబ్రవరి 7 నుంచి సంవత్సరం పాటు వర్తించేలా ఐడీవీ కింద రూ.2.50 లక్షలకు బీమా పాలసీ తీసుకున్నారు. అదే నెల ఫిబ్రవరి 23న హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణిస్తుండగా ఆలేరు వద్ద ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొనడంతో వాహనం దెబ్బతింది. వాహనాన్ని షోరూమ్‌కు తీసుకెళ్లి, అనంతరం రిలయన్స్ బీమా కంపెనీకి సమాచారం ఇచ్చారు. వాహనం మరమ్మతుల ఖర్చు రూ.3.04 లక్షలు అవుతుందని షోరూం అంచనా వేసింది. ఐడీవీ కింద రూ.2.50 లక్షలు చెల్లించకుండా రూ.1.30 లక్షలే చెల్లించడంతో దైవదాస్ జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. సర్వేయర్‌ను పంపి అంచనా వేసి ఆ మొత్తాన్ని చెల్లించామని, ఎలాంటి వ్యతిరేకత వ్యక్తం చేయకుండా ఫిర్యాదుదారు తీసుకున్నారని బీమా కంపెనీ తెలిపింది. రికార్డులను పరిశీలించిన జిల్లా ఫోరం ఐడీవీ కింద డిపాజిట్ చేసిన మొత్తాన్ని చెల్లించాలని, ఇప్పటికే రూ.1.30 లక్షలు చెల్లించినందున మిగిలిన మొత్తాన్ని 7.5 శాతం వడ్డీతోపాటు పరిహారం కింద రూ.10 వేలు చెల్లించాలని రిలయన్స్‌ను ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రిలయన్స్ కంపెనీలు రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీలు చేశాయి. వీటిపై విచారించిన కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్ తీర్పు వెలువరిస్తూ జిల్లా ఫోరం ఉత్తర్వులను సవరించారు. సర్వేయరు నివేదిక అంతిమం కాదంటూ దీనికి ఇద్దరూ కట్టుబడి ఉండవచ్చని, లేదంటే నిరాకరించవచ్చని, ఈ మేరకు న్యూఇండియా అస్యూరెన్స్ వర్సెస్ ప్రదీప్ కుమార్ కేసులో తీర్పు వెలువరించిందన్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారు బిల్లులను సమర్పించినందున ఐడీవీ కింద మిగిలిన మొత్తాన్ని చెల్లించాలంటూ జిల్లా ఫోరం ఇచ్చిన తీర్పు సబబేనని, దీనికి 7.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నందున పరిహారం రూ.10 వేలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.



బంగారు రథం నమూనా చిత్రం

## వరసిద్ధి వినాయకునికి రూ.6 కోట్లతో బంగారు రథం

విజయవాడ, న్యూస్‌టుడే, ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లాలోని కాణిపాకం వరసిద్ధి వినాయకునికి రూ.6 కోట్లతో బంగారు రథం తయారీకి అనుమతి ఇచ్చినట్లు ఏపీ దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తితిదే ఆధ్వర్యంలో పారదర్శకంగా నాణ్యమైన బంగారు రథం తయారు చేస్తున్నట్లు తెలిపారు. దాని తయారీకి అవసరమైన రూ.1 కోటి విలువ చేసే బంగారం, వెండిని తితిదేకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

# మాతృభాష, మాతృభూమిపై మమకారం ఉండాలి

- నాణ్యతతోనే ప్రత్యేక గుర్తింపు
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు




క్వాలిటీ సర్కిల్ ఫోరం సదస్సులో తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావుకు ఆయన చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఫోరం ఛైర్మన్ బాలకృష్ణారావు. చిత్రంలో ఏరియస్ టెక్నాలజీస్ సంస్థ ఛైర్మన్ రమణకుమార్

అమీర్‌పేట, న్యూస్‌టుడే: మాతృభాష, మాతృమూర్తి, మాతృదేశం, పుట్టిన ఊరు, జ్ఞానం నేర్పిన గురువులపై ప్రతి ఒక్కరికీ మమకారం, గౌరవం ఉండాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మాతృభాష కళ్ల వంటిదని, పరాయి భాషలు కళ్లద్దాలవంటివని వ్యాఖ్యానించారు. కశ్మీర్‌లో ఏదో జరిగింది, మనకెందుకులే అనుకోవడం తప్పని.. దేశంలోని ప్రతి ప్రాంతం శరీరంలోని భాగాలుగా భావించాలన్నారు. 'క్వాలిటీ కాన్సెప్ట్స్' అనే అంశంపై క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా 33వ వార్షిక సదస్సును గురువారం హైదరాబాద్‌లోని గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. నాణ్యతను పాటించే సంస్థలను గుర్తించి, అవార్డులిచ్చి గౌరవిస్తున్న క్వాలిటీ సర్కిల్ ఫోరం సేవలు అభినందనీయమన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించిన బెల్, ఎన్ఎండీసీ, టీఎస్ఆర్టీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, రామ్‌కో సిమెంట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఉషా తదితర సంస్థలకు ఉపరాష్ట్రపతి అవార్డులు అందజేశారు. సదస్సుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన 800 మంది ప్రతినిధులు హాజరయ్యారు. తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు, ఏరియస్ టెక్నాలజీస్ సంస్థ ఛైర్మన్ రమణకుమార్ తదితరులు ప్రసంగించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ఛైర్మన్ సీహెచ్ బాలకృష్ణారావు, కార్యదర్శి ఎ.దయానంద్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

## మూడు నుంచి బీఆర్‌కే భవన్‌లోనే కార్యకలాపాలు

- సచివాలయ ఉద్యోగులకు సమాచారం

ఈనాడు, హైదరాబాద్: వచ్చే నెల మూడో తేదీ నుంచి సచివాలయ కార్యాకలాపాలు బూర్గుల రామకృష్ణారావుభవన్‌లో సాగనున్నాయి. అక్కడే ఉద్యోగులకు హాజరు నమోదు చేయాలని ప్రభుత్వం గురువారం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు సచివాలయంలో పెద్దఎత్తున పదోన్నతులు కల్పించేందుకు పూనుకుంది. కొత్త సచివాలయ నిర్మాణం దృష్ట్యా ప్రస్తుత సచివాలయాన్ని తరలించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. బీఆర్కే భవన్ తాత్కాలిక సచివాలయంగా ఎంపిక కాగా.. .అక్కడికి శాఖలు తరలివెళ్లాయి. దస్త్రాలు, ఫర్నీచర్‌ను తీసుకెళ్లారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దాదాపు పదిహేను మంది మంత్రుల కార్యదర్శులు తమ కార్యాలయాల్లో చేరారు. ఉద్యోగులు క్రమేపీ ఇక్కడికి వస్తున్నారు. సచివాలయ తరలింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలుగా మొత్తం ఉద్యోగులను ఈ నెల మూడో తేదీ నుంచి బీఆర్కేభవనకే వెళ్లాలని ప్రభుత్వం తాజాగా ఆదేశించింది.

# ఉజ్వల ప్రస్థానం, బంగారు బాట పుస్తకాల ఆవిష్కరణ




తెలంగాణ రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ఉద్యమాలు, స్వరాష్ట్రంలో పరిపాలనా విధానం, ప్రగతి, ఇతర పరిణామాలపై ముఖ్యమంత్రి పౌరసంబంధాల అధికారి గటిక విజయ్ కుమార్ రాసిన 'ఉజ్వల ప్రస్థానం' పుస్తకం, వ్యాసాల సంపుటి 'బంగారుబాట' అవిష్కరణ గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో సినీనటుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి, జెన్‌కో- ట్రాన్స్‌కోల సీఎండీ ప్రభాకరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్ రెడ్డి, పుస్తకాల రచయిత విజయ్‌కుమార్, రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్, సీఎం ముఖ్య పౌరసంబంధాల అధికారి వనం జ్వాలానరసింహారావు, రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ ఛైర్మన్ ఘంటా చక్రపాణి, బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్ పాల్గొన్నారు.

– ఈనాడు, హైదరాబాద్

## వివాహిత హత్య

**పెద్దపల్లి, న్యూస్‌టుడే:** పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి సమీపంలోని గుంటూరుపల్లెలో గురువారం రాత్రి సునీత(35) అనే వివాహిత హత్యకు గురైంది. హత్యకు కారణాలు తెలియలేదు. ఇంటి ఆవరణలోనే హత్య జరగడంతో కుటుంబకలహాలతోనే జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.



గాలి బుడగలో హీలియం వాయువును నింపుతున్న శాస్త్రవేత్తలు

# ఓజోన్ పొర ఎలా ఉందో?

### ఆకాశంలోకి సెన్సర్ అమర్చిన బెలూన్ • మోజెర్ల ఉద్యాన కళాశాల నుంచి ప్రయోగం

మోజెర్ల (కొత్తకోట), న్యూస్‌టుడే: ఓజోన్ పొర తీరు, దాని ప్రభావంపై పరిశోధనకు సెన్సర్ అమర్చిన హీలియం బుడగను వనపర్తి జిల్లా మోజెర్ల ఉద్యాన కళాశాల నుంచి గురువారం మధ్యాహ్నం ఆకాశంలోకి ప్రయోగించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ- షాద్‌నగర్), అమెరికాకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ సంయుక్తంగా ఈ ప్రయోగాన్ని నిర్వహించాయి. ఈ గాలిబుడగ 35 కి.మీ. ఎత్తుకు వెళుతుంది. వదిలిన అర గంటలోపే 3.5 కి.మీ. ఎత్తుకు ప్రయాణించి అక్కడి ఉష్ణోగ్రత 30 నుంచి 10 సెంటీగ్రేడ్‌కు తగ్గినట్లు గుర్తిస్తూ సెన్సర్ సంకేతాలు పంపిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఓజోన్ పొర తీరు, గాలిలో ఉష్ణోగ్రతలు, ఓజోన్ గ్యాస్ ప్రభావం వంటి అంశాలను గుర్తించేందుకు దేశంలో నాలుగు చోట్ల నుంచి ఇస్రో సమాచారం సేకరిస్తోంది. తిరువనంతపురం, నాగ్‌పూర్, జోధ్‌పూర్, తెలంగాణలో షాద్‌నగర్ (ఎన్ఆర్ఎస్‌సీ)ను ఇందుకు ఎంపిక చేశారు. షాద్‌నగర్ సమీపంలో శంషాబాద్ విమానాశ్రయం ఉండడంతో ఇబ్బంది అవుతుందని.. ప్రయోగాన్ని మోజెర్ల ఉద్యాన కళాశాలకు మార్చారు. నాలుగేళ్లపాటు నెలకోసారి ఈ ప్రయోగం నిర్వహిస్తారని కళాశాల ప్రతినిధి డా.చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఇస్రో, ఎన్ఆర్ఎస్‌సీ శాస్త్రవేత్తలు, అమెరికా సంస్థ ప్రతినిధులు, మోజెర్ల కళాశాల డీన్ గిర్వాణి, అసోసియేట్ డీన్ డా.శ్రీనివాస నటరాజన్, డా.సతీష్ పాల్గొన్నారు.

# ఈనాడు సినిమా

## రెండు పాటలు... ఒక ఫైటూ..!


బాలకృష్ణ

'ఎన్టీఆర్ - మహానాయకుడు' తరవాత కొంత విరామం తీసుకుని తన 105వ చిత్రాన్ని పట్టాలెక్కించారు నందమూరి బాలకృష్ణ. అయితే షూటింగ్ మాత్రం చక చకా సాగిపోతోంది. అలా మొదలెట్టారో లేదో, ఇలా తొలి షెడ్యూల్ పూర్తి చేసేశారు. థాయ్‌లాండ్‌లో రెండు పాటలు, కొన్ని సన్నివేశాలతో పాటు ఓ పోరాట ఘట్టాన్ని తెరకెక్కించారు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. సి.కల్యాణ్ నిర్మాత. సోనాల్ చౌహాన్, వేదిక కథానాయికలు. వచ్చే వారం హైదరాబాద్‌లో మరో దఫా చిత్రీకరణ మొదలవుతుంది. 'రూలర్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. "20 రోజుల పాటు థాయ్‌లాండ్‌లో చిత్రీకరణ జరిపాం. బాలయ్య లుక్‌కి మంచి స్పందన వస్తోంది. ఆయన అభిమానులు కోరుకునే అంశాలన్నీ ఈ చిత్రంలో ఉన్నాయ"న్నారు నిర్మాత. ప్రకాష్ రాజ్, జయసుధ, భూమిక కీలక పాత్రధారులు. సంగీతం: చిరంతన్‌భట్.

## ఒక ప్రశ్న ఒక జవాబు

**తొలిసారి ఆడిషన్‌కి వెళ్లిన అనుభవాలు గుర్తున్నాయా?**


అనుపమ పరమేశ్వరన్

**అనుపమ పరమేశ్వరన్:** నేను వెళ్లిందే ఒక ఆడిషన్‌కి. అదే నా తొలి, చివరి ఆడిషన్. నిజంగా అదో కలలా అనిపిస్తుంటుంది. మా ఇంట్లో సినీ పరిశ్రమకు చెందిన వాళ్లెవ్వరూ లేరు. నాకేమో చిన్నప్పటి నుంచీ సినిమాలన్నా, నాటకాలన్నా ఇష్టం. మా ఇంటి పక్కన ఓ చిన్న థియేటర్ ఉండేది. అందులో అవార్డు సినిమాల్ని ప్రదర్శించేవారు. నాటకాలూ వేసేవారు. అప్పుడప్పుడూ నేనూ నటిస్తుండేదాన్ని. అలా నటనపై ఇష్టం ఏర్పడింది. మా స్నేహితురాలు ఓసారి నా ఫొటోల్ని నాకే తెలియకుండా ఆడిషన్‌కి పంపింది. వాళ్లేమో ఆఫీసుకు రమ్మని కబురు చేశారు. ఈ విషయం తెలిసి అమ్మానాన్న కోపడ్డారు. 'కనీసం ఫేస్‌బుక్‌లో ప్రొఫైల్ ఫొటో పెట్టేదానివే కాదు.. అలాంటిది ఎవరికో నీ ఫొటోలు పంపుతావా' అని తిట్టారు. ఆ గొడవ రెండు రోజులు జరిగింది. ఆ తరవాత వాళ్లే కాస్త మెత్తబడి, 'సరే.. నీతో పాటు మేమూ వస్తాం' అంటూ వాళ్లూ బయల్దేరారు. కెమెరా ముందు నిలబడి నటించడం అదే కొత్త. నాటకాల అనుభవం ఉంది కాబట్టి.. భయం లేకుండా నటించేశాను. కానీ నా డైలాగ్ డెలివరీ వాళ్లకు నచ్చలేదు. 'ఇంటికి వెళ్లిపోండి.. వారం తరవాత కబురు చేస్తాం' అన్నారు. నా ఆశలన్నీ ఆవిరైపోయాయి. కానీ ఇంట్లో అద్దం ముందు నిలబడి డైలాగులు చెప్పడం ప్రాక్టీస్ చేస్తూ ఉండేదాన్ని. రెండు వారాలకు మళ్లీ కబురొచ్చింది. ఈసారి ఆడిషన్‌లో డైలాగులూ బాగానే చెప్పాను. చుట్టూ ఉన్నవాళ్లంతా చప్పట్లు కొట్టేశారు. అలా.. నాకు 'ప్రేమమ్' సినిమాలో అవకాశం వచ్చింది. నా జీవితాన్ని ఆ సినిమానే మలుపు తిప్పింది.


రవితేజ

## కాస్కో రాజా

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డిస్కోరాజా'. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. పాయల్ రాజ్‌పుత్, నభా నటేషా కథానాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. డిసెంబరు 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. సెప్టెంబరు 2 నుంచి గోవాలో కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తారు. మరోవైపు డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. "ఇప్పటి వరకూ హైదరాబాద్, దిల్లీల్లో చిత్రీకరణ జరిపాం. వినాయక చవితి రోజున ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామ"న్నారు నిర్మాత. సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: కార్తిక్ ఘట్టమనేని.

## గీతోపదేశం

తాతల తండ్రుల ఆర్జన తింటూ
జలసాగా నువ్వు తిరగకురా
కండలు కరగగ కష్టం చేసి
తల వంచక జీవించుమురా
పూలరంగడిగ వెలుగుమురా

**గీతం: నీతికి నిలబడి నిజాయతీగా...**
**చిత్రం: పూలరంగడు(1967)**
**రచన: కొసరాజు రాఘవయ్య చౌదరి**

– పంపినవారు: డి.లాల్‌భాష, వంగనూరు

## 'మంచు' ముత్యమా!


మంచు విష్ణు



మంచు కుటుంబంలో చిన్నపిల్లల సందడి ఎక్కువగా కనిపిస్తుంటుంది. లక్ష్మీ పిల్లలు, విష్ణు పిల్లలు చేసే అల్లరి చూస్తూ తాతయ్య మోహన్ బాబు మురిసిపోతుంటారు. ఈమధ్యే ఆ ఇంట్లో మరో కేరింత వినిపించింది. ఇటీవల విష్ణు - వెరోనిక దంపతులకు పాప పుట్టింది. తనకు ఐరా విద్య అని నామకరణం చేశారు. ఐరాని అభిమానులకు పరిచయం చేస్తూ విష్ణు తన ట్విటర్‌లో ఈ ఫొటో పెట్టారు. 'నా ఐరా విద్యకు మీ ఆశీస్సులు కావాలి' అంటూ పోస్ట్ చేశారు. ఐరా.. విష్ణు దంపతుల నాలుగో సంతానం.


శ్రద్ధా శ్రీనాథ్, ఆది

## 'జోడీ' కుదిరింది

ఆది, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'జోడీ'. విశ్వనాథ్ అరిగెల దర్శకుడు. పద్మజ, సాయి వెంకటేష్ గుర్రం నిర్మాతలు. గురువారం ప్రచార చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగే వినోదాత్మక ప్రేమకథ ఇది. నరేష్, గొల్లపూడి మారుతీరావు, సితార కీలక పాత్రధారులు. వాళ్ల నటన, ఆ పాత్రల్ని తీర్చిదిద్దిన విధానం మెప్పిస్తుంది. ఆది, శ్రద్ధాల జోడీ చూడముచ్చటగా ఉంటుంది. వెన్నెల కిషోర్, సత్య బాగా నవ్విస్తారు. సెప్టెంబర్ 6న విడుదల అవుతుంది" అన్నారు. సంగీతం: 'నీవే' ఫణికల్యాణ్.

## ప్రభాస్ ఇంటి గుత్తొంకాయ కూర... అదుర్స్


మురళీ శర్మ

**విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు మురళీ శర్మ. తండ్రిగా, పోలీస్‌గా, ప్రతినాయకుడిగా.. ఇలా ఏ పాత్ర ఇచ్చినా అందులో చక్కగా ఇమిడిపోతారు. 'సాహో'లోనూ ఓ మంచి పాత్ర దక్కింది. ప్రభాస్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. సుజిత్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మించింది. శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడారు మురళీ శర్మ.**

"బాహుబలి'తో ప్రభాస్ చాలా ఎత్తుకు ఎదిగిపోయాడు. అందరిలానే నేను కూడా 'సాహో' విడుదల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. అలాంటిది తన సినిమాలో నాకో మంచి పాత్ర దక్కింది. ట్రైలర్‌లో నేను చెప్పిన సంభాషణకు మంచి స్పందన లభిస్తోంది".

- "భాగమతి' చిత్రీకరణ సమయంలో సుజిత్ నన్ను కలిసి ఈ కథ చెప్పాడు. కథలో మలుపులు ఆసక్తిని రేకెత్తిస్తాయి. తను ఈ చిత్రాన్ని తెరకెక్కించిన విధానం అందరికీ నచ్చుతుంది. యూవీ క్రియేషన్స్ అంటే నా మాతృ సంస్థ లాంటిది. అంతర్జాతీయ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. ఒకేసారి నాలుగు భాషల్లో నటించడం, అన్నిట్లోనూ నా గొంతే వినిపించడం మంచి అనుభవం".

- "ప్రభాస్‌ని అందరూ డార్లింగ్ అని ఎందుకు పిలుస్తారో ఈ సినిమాతో నాకు తెలిసింది. ఓరోజు ప్రభాస్ టీ షర్టు వేసుకొచ్చాడు. 'ఈ టీ షర్టు భలే ఉంది' అన్నాను. సాయంత్రానికల్లా అలాంటిదే మరో టీషర్టు నాకు బహుమతిగా పంపాడు. 'ఇంటి భోజనం అంటే నాకు చాలా ఇష్టం' అని చెప్పాను. అప్పటి నుంచీ ఈ సినిమా అయిపోయేంత వరకూ ప్రభాస్ ఇంటి నుంచే నాకు భోజనం వచ్చేది. పదిమందికి సరిపడేంత పెద్ద క్యారియర్ నాకు పంపేవారు. ప్రభాస్ ఇంటి గుత్తొంకాయ కూర అదుర్స్. ఆ రుచి ఇంకెక్కడా రాదు".

- "భలే భలే మగాడివోయ్' నుంచి నా కెరీర్ మారిపోయింది. మంచి తండ్రి పాత్రలు వస్తున్నాయి. నటుడిగా అన్ని రకాల పాత్రలూ చేయాలని ఉంది. సెట్‌లో ఎలాంటి తడబాటూ లేకుండా నటించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే ఉంటాను. ఇది వరకు నాకు తెలుగు వచ్చేది కాదు. క్రమంగా తెలుగు నేర్చుకుని, తెలుగులోనే మాట్లాడడం మొదలెట్టా. తమిళం, హిందీ వచ్చు. మలయాళం కూడా నేర్చుకుంటున్నా. ఓ స్నేహితుడి వల్ల పంజాబీ కొంచెం కొంచెం నేర్చుకున్నా".

- "ప్రస్తుతం మహేష్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో నటిస్తున్నా. త్రివిక్రమ్ 'అల.. వైకుంఠపురములో' కూడా చేస్తున్నా. తెలుగు ప్రేక్షకులు, ఇక్కడి దర్శక నిర్మాతలు నన్ను ఆదరిస్తున్న తీరు ఎప్పటికీ మర్చిపోలేను. ఇప్పటి వరకూ కెరీర్ సంతృప్తికరంగా గడిచింది. ఇక మీదటా ఇలాంటి మంచి పాత్రలతో అలరించాలనుంది".

## సైకిల్ షాపులో నాగార్జున


మహేష్ ఆచంట

మహేష్ ఆచంట హీరోగా నటించిన చిత్రం 'నేను నా నాగార్జున'. ఆర్.బి గోపాల్ దర్శకుడు. గుండపు నాగేశ్వరరావు నిర్మాత. గురువారం నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. మహేష్ మాట్లాడుతూ "రంగస్థలం', 'మహానటి' చిత్రాలు నటుడిగా నాకు మంచి పేరు తీసుకొచ్చాయి. తొలిసారి హీరోగా నటిస్తున్నాను. సైకిల్ షాపులో పనిచేసే ఓ కుర్రాడి కథ ఇది" అన్నారు. "ప్రచార చిత్రం బాగుంది. చిన్న సినిమా అయినా కథా బలం ఉంటే ఆదరిస్తార"న్నారు సి.కల్యాణ్. అవగాహనతో సినిమాలు తీస్తే చక్కటి ఫలితాలుంటాయన్నారు దామోదర ప్రసాద్. కార్యక్రమంలో మళ్ల విజయ ప్రసాద్, రామసత్యనారాయణ, బసిరెడ్డి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎగిరిపోతే ఎంత బాగుంటుంది!

జాన్వీ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్'. యుద్ధంలో పాల్గొన్న భారతీయ తొలి మహిళా పైలట్‌గా చరిత్రకెక్కిన గుంజన్ సక్సేనా జీవిత కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. కార్గిల్ యుద్ధంలో గుంజన్ ప్రదర్శించిన ధైర్య సాహసాలకు భారత ప్రభుత్వం ఆమెను శౌర్య చక్ర పురస్కారంతో సత్కరించింది. కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌లను చిత్రబృందం విడుదల చేసింది. జాన్వీ చేతిలో కాగితపు విమానం పట్టుకుని ఆనందంగా నవ్వుతున్న లుక్ ఆకట్టుకుంటోంది. ఇంకో పోస్టర్‌లో పైలట్ యూనిఫామ్‌లో నడుచుకుంటూ వస్తున్న జాన్వీకి ఎయిర్ ఫోర్స్ అధికారులు కరతాళ ధ్వనులతో స్వాగతం పలుకుతున్న దృశ్యం కనిపిస్తోంది. వీటిని ట్విటర్‌లో పంచుకుంటూ 'ఆమెకు మహిళలు పైలెట్ కాలేరని చెప్పారు. కానీ ఆమె గట్టి సంకల్పంతో ఎగరాలన్న తన కలను సాకారం చేసుకుంద'ని ట్వీట్ చేశారు కరణ్ జోహార్. వచ్చే ఏడాది మార్చి 13న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.


జాన్వీ కపూర్

## ముసలాళ్లే కానీ మహా ఘటికులు

తాప్సి, భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సాండ్ కీ ఆంఖ్'. ప్రపంచంలోనే వయోవృద్ధులైన షూటర్లుగా పేరుతెచ్చుకున్న ప్రకాషి తోమర్, చంద్రో తోమర్ అనే మహిళల జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. 82 ఏళ్ల ప్రకాషి తోమర్‌గా తాప్సి, 87 ఏళ్ల చంద్రో తోమర్‌గా భూమి పెడ్నేకర్ కనిపించనున్నారు. తుషార్ హీరానందని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మరో ప్రముఖ దర్శకుడు ప్రకాష్ ఝా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా కోసం తుపాకీ పేల్చడంలో శిక్షణ తీసుకున్నారు తాప్సి, భూమి. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 'సాండ్ కీ ఆంఖ్'కు సంబంధించి తాజా పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో వయోవృద్ధులుగా సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న తాప్సి, భూమి.. చేతిలో షూటింగ్ టార్గెట్ బోర్డ్ పట్టుకుని విజయ గర్వంతో నవ్వులు చిందిస్తున్న దృశ్యం ఆకట్టుకుంటోంది.


భూమి పెడ్నేకర్, తాప్సి

## భారత క్రికెట్ జట్టు పాలిట అదృష్ట దేవత


దుల్కర్ సల్మాన్, సోనమ్ కపూర్

సోనమ్ కపూర్, దుల్కర్ సల్మాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ది జోయా ఫ్యాక్టర్'. అభిషేక్ శర్మ తెరకెక్కిస్తున్నారు. జోయా అనే అమ్మాయిగా సోనమ్ నటిస్తుండగా, దుల్కర్ భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా కనిపించనున్నారు. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ఆకట్టుకుంటోంది. 1983లో భారత్ ప్రపంచ కప్ గెలిచిన రోజే సోనమ్ పుడుతుంది. దీంతో ఆమెను అదృష్ట దేవతగా ఆమె తండ్రి భావిస్తుంటాడు. కానీ పెద్దయ్యాక ఆమెకు అన్నీ దురదృష్టాలే. ఉద్యోగం పోతుంది. బాయ్‌ఫ్రెండ్ వదిలేస్తాడు. ఇలా ఉండగా అనుకోకుండా ఆమెకు దుల్కర్‌తో పరిచయం అవుతుంది. అప్పట్నుంచి దుల్కర్‌కు అదృష్టం కలిసొస్తుంది. అప్పటి వరకూ 99 పరుగుల వద్ద అవుట్ అయ్యే అతడు ఇప్పుడు సెంచరీలు బాదేస్తుంటాడు. జోయా స్టేడియంలో ఉంటే భారత జట్టు విజయం ఖాయం అన్నంత పేరొస్తుంది. దీంతో క్రికెటర్ల కన్నా ఆమె ఆటోగ్రాఫ్‌ల కోసమే అభిమానులు ఎగబడుతుంటారు. ఆమెను దేవతలా ఆరాధిస్తుంటారు. అయితే ఓరోజు సోనమ్‌కు, దుల్కర్‌కు గొడవ జరిగి విడిపోయే పరిస్థితి వస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందన్న విషయాలతో ఈ చిత్రం తెరకెక్కింది.

# వసుంధర

# బ్లాక్ ప్రింట్లతో భలే చీరలు...!

సౌకర్యం, హుందాతనం... కలబోసిన కాటన్‌చీరలపై ఆధునిక, సంప్రదాయ సొగసుల్ని మేళవించి చేసిన బ్లాక్ ప్రింట్ల పనితనం ఆకట్టుకోకుండా ఉంటుందా! రండి అలాంటి చీరల్ని చూసేద్దాం. నచ్చింది ఎంచుకుందాం.

ఫ్యాషన్ ఫ్యాషన్

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld

ఈ చీరలు కళాంజలి అన్ని షోరూమ్‌ల్లోనూ లభిస్తాయి.



పెద్ద పెద్ద పూల డిజైన్లు, బ్లాక్‌ప్రింట్ సోయగాలు...నేత పనితనంతో ఆకట్టుకునే అంచూ ఈ పసుపు రంగు కాటన్ చీరకు అదనపు ఆకర్షణ.



బ్లాక్ ప్రింట్ సీకో చీరపై వైవిధ్యంగా అలరిస్తోన్న పూల డిజైన్లు, అంచు.



జామెట్రికల్ గీతలు, పూల బుటీ డిజైన్లు ఈ కాటన్ చీరకు కళ తెచ్చాయి. ఆకుపచ్చ చీరకు ఎరుపు రంగు కొంగు ఎంతందంగా ఉందో!



లినెన్ చీరంతా పరచుకున్న బ్లాక్ ప్రింట్ పూలు...నేత పనితనంతో మెప్పిస్తోన్న జరీ అంచు చూపు తిప్పుకోనివ్వడం లేదు కదూ!



సంప్రదాయాన్ని గుర్తుతెచ్చే బ్లాక్ ప్రింట్ డిజైన్లు, చీరకు భిన్నమైన రంగులో అంచు... అదరహో అనిపిస్తోంది !

**మోడల్స్:** – కృతికా సింగ్ రాథోడ్, ప్రియామూర్తి, శ్రేయ
**ఫొటోలు:** – పాతూరి పద్మావతి

# ముఖంపై మచ్చలు ఇక తగ్గవా?

**డియర్ వసుంధర**



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

**?** నేనో ఉద్యోగిని. గతేడాది నాకు పొంగు చూపింది. ఆ సమయంలో ముఖమంతా నీటి పొక్కుల్లా వచ్చాయి. తగ్గాక ఆ ప్రదేశంలో కొన్ని చోట్ల మచ్చలు, గుంతలు ఏర్పడ్డాయి. ఇంట్లో వాళ్లంతా అవి ఇక తగ్గవని అంటున్నారు. నిజమేనా? పరిష్కారం సూచించగలరు.

– ఓ సోదరి

టీకాలు అందుబాటులోకి వచ్చాక పొంగు, దానివల్ల వచ్చే సమస్యల ప్రభావం ఇప్పుడు బాగా తగ్గింది. వాస్తవానికి పిల్లల్లో కంటే పెద్దల్లో పొంగు తీవ్రంగా కనిపిస్తుంది. మచ్చలు పడటానికి అవకాశమూ ఎక్కువే. ఇది అంటు వ్యాధి. దద్దుర్లు, పొక్కులను గిల్లడం, గోకడం వంటివి చేస్తే అక్కడ మచ్చలు, గుంతలు పడే అవకాశం ఉంది. తీవ్రతను బట్టి ఒక్కోసారి పుండులానూ మారొచ్చు. ఒకసారి మచ్చపడితే అది వందశాతం తగ్గే అవకాశం ఉండదు. అందుకే అసలు అవి ఏర్పడకుండా జాగ్రత్త పడాలి. పొంగు ఉన్నన్ని రోజులూ చాలామంది స్నానమే చేయరు. దీనివల్ల ఆ సమయంలో చర్మం మరింత రాపిడికి గురవుతుంది. ఇలాంటప్పుడు మాయిశ్చరైజర్, కొబ్బరి నూనె, కోకోబటర్ వంటివి రాసుకోవడం వల్ల దురద అదుపులో ఉంటుంది. డాక్టర్ సలహాతో ఓరల్ యాంటీ హిస్టమిన్‌లూ వేసుకోవచ్చు. పొంగు రాకుండా పిల్లలకి, పెద్దలకి టీకాలు వేయించాలి.

రెటినాయిడ్ క్రీమ్‌లను రాత్రిపూట రాసుకుని... ఉదయం మాయిశ్చరైజర్ వాడటం, నిపుణుల దగ్గర కెమికల్ పీల్స్ చేయించుకోవడం వల్ల కొంతమేర మెరుగైన ఫలితం ఉంటుంది. ఫిల్లర్స్, మైక్రో నీడిలింగ్ టెక్నాలజీ, మైక్రో డెర్మాబ్రేషన్, డెర్మాబ్రేషన్, లేజర్ వంటి చికిత్సా పద్ధతుల్లో వీటిని తగ్గించుకోవచ్చు. ఎక్కువ గీతలు ఉన్నప్పుడు వైద్యులు స్కిన్ గ్రాఫ్టింగ్ చేస్తారు. ముందు డాక్టర్‌ని సంప్రదించి నిర్ణయం తీసుకోండి.

## బంగారం-వెండి

29న ముగింపు-క్రితం

| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 40,250 | 40,100 | 40,150 | 40,190 |
| ఆర్నమెంట్ | 37,570 | 37,440 | 37,180 | 37,220 |
| వెండి (కిలో) | 48,750 | 48,160 | 48,900 | 48,500 |
| | ప్రొద్దుటూరు | | రాజమండ్రి | |
| బంగారం(24క్యా) | 38,900 | 38,500 | 40,140 | 40,240 |
| ఆర్నమెంట్ | 35,970 | 35,590 | 37,060 | 37,130 |
| వెండి (కిలో) | 47,500 | 46,800 | 48,800 | 48,500 |
| | విశాఖపట్నం | | తమిళనాడు | |
| బంగారం(24క్యా) | 39,980 | 39,540 | ------- | ------- |
| ఆర్నమెంట్ | 37,180 | 36,780 | 3,712 | 3,713 గ్రా |
| వెండి (కిలో) | 49,000 | 47,500 | 52.30 | 51.90 గ్రా |



పెళ్లి అనే బంధంతో ఒకరికొకరై నడుస్తారు. ఏళ్లు గడిచే కొద్దీ హద్దుల్లేని ప్రేమతో, అసూయలు, అపార్థాలకు తావులేని స్నేహంతో అడుగులేయాలి. అలా కాకుండా ఎవరికి వారే యమునా తీరే అంటుంటే! సరిదిద్దుకోండి. అదెలా అంటే....

# మీ మధ్య రహస్యాలెందుకు?




● **ప్రాధాన్యం ఇవ్వండి:** భార్యాభర్తల మధ్య వచ్చే వివాదాల్లో ప్రాధాన్యం అనే అంశం కీలకంగా ఉంటుంది. ఒకరి అభిప్రాయాలకు మరొకరు విలువ ఇచ్చినప్పుడే మీ మధ్య అనుబంధం పెరుగుతుంది. లేదంటే అలకలు, అపోహలు, అపార్థాలు.. .ఒకదానివెంట మరొకటి మీతోపాటు పరుగులు పెడుతుంటాయి. మీ ఇద్దరి మధ్య రహస్యాలు ఉండకుండా చూసుకోండి. ఇంట్లో ఎందరు ఉన్నా...ఎవరికి ఇవ్వాల్సిన ప్రాధాన్యం వారికి ఇచ్చినప్పుడు సంతోషంగా సాగిపోవచ్చు.

● **పోల్చకండి:** చాలామంది తమ భాగస్వామిని ఇతరులతో పోల్చి చూస్తుంటారు. పదే పదే ఎత్తి చూపుతుంటారు. దీనివల్ల అవతలివారిలో ఎటువంటి మార్పు రాకపోగా ఇబ్బందులు పెరిగిపోతాయి. అలాకాకుండా మీరు వారినుంచి ఏం కోరుకుంటున్నారో స్పష్టంగా చెప్పగలిగితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇద్దరి మధ్య అబద్ధాలకు, దాపరికాలకు తావివ్వొద్దు. అవి ఉన్నప్పుడు అనుమానాలు, అపార్థాలు ఎదురవుతాయని గుర్తించండి.

● **ప్రేమను పంచండి:** భాగస్వామిపై ప్రేమను నలుగురిలో చూపించకపోవడం ఒకరి లోపం కావొచ్చు. అతి ప్రేమతో ప్రతి చిన్న విషయానికీ ఆధారపడే మనస్తత్వం మరొకరిది కావొచ్చు. మీ సమస్య ఏదైనా ఎదుటివారికి స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పండి. అప్పుడే కదా! సమస్య పరిష్కారమయ్యేది.

**నిటారుగా పెరిగే వెదురు...ఆమె చేతిలో పడితే ఔరా అనిపించే కళాఖండంగా మారిపోతుంది. అంతేనా! కుంగుబాటు నుంచి బయటపడేందుకు నేర్చుకున్న ఈ కళ ద్వారా ఎందరో గిరిజన మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. ఆమే మహారాష్ట్రలోని చంద్రపూర్‌కి చెందిన మీనాక్షీ వాల్కే. ఆమె ప్రస్థానం ఇలా...!**

# వెదురుతో వైవిధ్యంగా...!

స్వయం ఉపాధి









ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఎప్పుడో ఒకసారి కష్టకాలాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. అలాంటి పరిస్థితి నాకూ ఓ సారి ఎదురయ్యింది. దాన్నుంచి బయటపడేందుకు ఈ వెదురు కళే తోడయ్యింది. చంద్రపూర్‌లోని బెంగాల్ క్యాంపు మురికివాడలో మా నివాసం. నేను, అమ్మానాన్న, ఇద్దరన్నదమ్ములు, ఇదే మా కుటుంబం. ఉన్న రెండు ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ బతికేవాళ్లం. పంటలు సరిగా పండక పస్తులున్న రోజులెన్నో. అయినా సరే! వ్యవసాయం మానలేదు. కొన్నాళ్లకు స్థానికంగా ఉండే ముఖేష్‌తో నా పెళ్లయ్యింది. అత్తింటివారి ఆర్థిక పరిస్థితీ అంతంత మాత్రమే. చాలీచాలని కుటుంబ ఆదాయంతో మా వారు నెట్టుకొచ్చేవారు. దాంతో నేనూ కొంతైనా సంపాదించాలనుకున్నా. మేముండే ప్రాంతం చుట్టూ అడవులు విస్తరించి ఉంటాయి. దాంతో వెదురు సులువుగా లభ్యమయ్యేది. వాటితో కుంకుమ భరిణెలు, ఆకు,వక్క పెట్టుకునే బాక్సులు, నగలు తయారు చేయడం చూసి సరదాగా నేర్చుకున్నా. ఈలోగా గర్భం దాల్చా. అనారోగ్యకారణాల వల్ల బిడ్డ గర్భంలోనే చనిపోయింది. దాంతో తీవ్రమైన ఆందోళన, నిరుత్సాహానికి గురయ్యా. అప్పుడు నా భర్త, సన్నిహితులు ఆ బాధ నుంచి నేను బయటపడేందుకు నాకు నచ్చే వ్యాపకాలను అలవాటు చేసుకోమని ప్రోత్సహించారు. నాకు వెదురు వస్తువుల తయారీపై ఉన్న ఆసక్తిని గమనించి బీచ్‌పల్లిలో ఉన్న బాంబూ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇప్పించారు. అక్కడ డెబ్భై రోజుల శిక్షణ తీసుకున్నా.

– చొక్కాల రమేశ్, ఈనాడు డిజిటల్, ఆసిఫాబాద్.

### కళాకృతులెన్నో...

శిక్షణ పూర్తయ్యాక స్థానికంగా ముడిసరకు కొని వీటి తయారీ మొదలుపెట్టా. కేవలం వెదురుతోనే కాదు...కొబ్బరిచిప్పలు, కాగితం వంటివాటినీ ఉపయోగించి వివిధ వస్తువుల్ని రూపొందించడం ప్రారంభించా. వాటిల్లో రాఖీలు, గడియారాలు, బుట్టలు, పండ్ల రూపాలు, దీపాలు, దేవతలను పోలి ఉండే ఆకృతులెన్నో ఉన్నాయి. వాటిని స్థానిక దుకాణాలకు సరఫరా చేయడం ప్రారంభించా. నేను కాస్త నిలదొక్కుకున్నాక మా ఇంటి దగ్గర్లో ఉండే ఆదివాసీ మహిళలకు వీటి తయారీలో శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టా. నాతో పాటూ వారూ నెలకు ఐదువేల రూపాయల వరకూ ఆదాయాన్ని అందుకుంటున్నారు. మా పనితీరు, నాణ్యత గమనించి పెద్ద ఎత్తున సరఫరా చేయమని అడిగే దుకాణాలూ ఉన్నాయి. ఫేస్‌బుక్ ద్వారానూ ఆర్డర్లు అందుకుంటున్నా. ఇజ్రాయిల్, జెరూసలెం దేశంలోని మహిళలు, పిల్లలకు వెదురు వస్తువుల తయారీలో శిక్షణ ఇచ్చే అవకాశం లభించింది. త్వరలోనే అక్కడికి వెళ్లనున్నా.



### కొండంత తొండమయ్య

బొజ్జగణపయ్య భారీకాయుడు. చవితి సంబరాల్లో వాడవాడలా లంబోదరుడి భారీ విగ్రహాలు కొలువుదీరుతాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచలోనూ ఓ వినాయక విగ్రహం ఉంది. శతాబ్దాలుగా అక్కడే ఉంది. కొండగా కొలువుదీరినట్టున్న భారీ విగ్రహమది. పచ్చటి పొలాల మధ్య ఉన్న ఏకదంతుడి విగ్రహాన్ని చూడడానికి రెండు కళ్లూ సరిపోవు. ఈ భారీ దైవాన్ని.. ఐశ్వర్య గణపతిగా భక్తులు ఆరాధిస్తారు. విగ్రహం ఎత్తు సుమారు 25 అడుగులు, వెడల్పు 15 అడుగులు. దీనిని ఎవరు, ఎప్పుడు చెక్కారు అని చెప్పడానికి సరైన ఆధారాలు లేవు. 11వ శతాబ్దం నాటిదని పరిశోధకుల అభిప్రాయం. లేపాక్షి బసవన్న విగ్రహం కన్నా ఇది పెద్దగా ఉంటుంది. ఈ భారీ వినాయకుడిని దర్శించుకోవడానికి పొరుగు రాష్ట్రాల నుంచీ భక్తులు వస్తుంటారు.

**చేరుకునేదిలా:** హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్లే దారిలోని జడ్చర్ల చేరుకోవాలి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఆవంచ (12 కి.మీ.) వెళ్లొచ్చు.

– దాచేపల్లి నరసింహస్వామి, తిమ్మాజిపేట

# బొజ్జ గణపయ్యా.. వస్తున్నామయ్యా!

**వినాయక చవితి వచ్చింది. వారాంతంతో ముడిపడి వచ్చిన బొజ్జ గణపయ్య పండగ.. పర్యాటక ప్రియులకు మరింత ఆనందాన్ని తెచ్చింది. మన ప్రాంతంలో పార్వతీ తనయుడి విలక్షణ క్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. వాటిని సందర్శిస్తే.. విహారంలో వినోదంతో పాటు ఆధ్యాత్మిక ఆనందమూ లభిస్తుంది.**

### కుడివైపు తొండం!

ఒక్క మాట ఆ గణపతి చెవిన వేస్తే చాలు... తమ బాధలన్నీ తీరిపోతాయి, కష్టాలన్నీ కరిగిపోతాయని భావించే చోటు బిక్కవోలు. తూర్పు గోదావరి జిల్లాలోని ఈ గ్రామం వినాయక క్షేత్రాల్లో ప్రఖ్యాతమైంది. ప్రత్యేకమైంది. తూర్పు చాళుక్యుల రాజధానిగా ఎంతో ప్రాధాన్యమున్న బిక్కవోలు పలు పురాతన ఆలయాలకు నిలయం. గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు ఆనాటి నిర్మాణ నైపుణ్యానికి, శైలికి అద్దం పడతాయి. అక్కడే లక్ష్మీ గణపతి స్వయంభువుగా వెలిశాడని చెబుతారు. అయితే గుణగ విక్రమాదిత్యుని కాలం నుంచే ఈ వినాయక విగ్రహం ఉన్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. సుమారు ఆరడుగుల ఎత్తుండే ఈ గణపతి రూపం ప్రత్యేకంగా ఉంటుంది. ఈ ఏకశిలామూర్తి తొండం కుడివైపు తిరిగి ఉండడం విశేషం. అంతేకాకుండా ఆయన పెద్ద చెవులు ఇట్టే కట్టిపడేస్తాయి. ఆయన చెవిలో ఏదైనా చెబితే వెంటనే నెరవేరుస్తాడని భక్తులు నమ్ముతారు. అందుకే ఇక్కడకు వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

**చేరుకునేదిలా:** కాకినాడ నుంచి 35, రాజమండ్రి నుంచి 40 కిలోమీటర్ల దూరంలో బిక్కవోలు ఉంది. ఈ రెండు నగరాల నుంచి బస్సు, రైలు సౌకర్యాలున్నాయి.



# మన గౌరవం మన చేతల్లోనే..

ఇటీవల ఓ భారతీయ కుటుంబం బాలి పర్యటనకు వెళ్లింది. నాలుగు రోజులు సరదాగా గడిచిపోయాయి. వస్తూ వస్తూ బస చేసిన హోటల్ గదిలోని వస్తువులను తమ బ్యాగుల్లో సర్దేసి తిరుగు ప్రయాణమైంది. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయింది. ట్రావెలోకంలో భారతీయ పర్యాటకులపై రకరకాల వ్యాఖ్యానాలు మొదలయ్యాయి. 'ఏ దేశమేగినా.. మనజాతి గౌరవం నిలపాల'ని పెద్దల సందేశం. విదేశీ పర్యటనలకు వెళ్లే భారతీయుల కోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కొన్ని సూచనలు చేసింది. అవేంటంటే..



- పర్యటించే దేశం సంప్రదాయాలను ముందుగానే తెలుసుకోవాలి.
- ఆయా దేశాలకు చెందిన సమాచారం, పర్యాటక విశేషాల గురించి అవగాహన ఉండాలి.
- ఆ దేశాల్లో నిషేధిత వస్తువులు ఏమిటో తెలిసుండాలి.
- వస్త్రధారణ విషయంలో స్థానిక విశ్వాసాలను గౌరవించాలి.
- మన దేశంలో మంచి అర్థాన్ని ఇచ్చే సంజ్ఞలు విదేశాల్లో చెడుగా అనిపించొచ్చు. గమనించుకోవాలి.
- దొంగతనానికి పాల్పడటం, మాదక ద్రవ్యాలు తీసుకోవడం, అనవసరమైన చర్చల్లో పాల్గొనడం చేయకూడదు.
- స్థానిక చట్టాలను తెలుసుకోవడం మంచిది.
- బస చేసిన హోటల్ సిబ్బంది, కారు డ్రైవర్లతో మర్యాదగా మాట్లాడాలి.
- మన దుష్ప్రవర్తన మన సంస్కృతికి చెడ్డపేరు తెస్తుందని మరచిపోవద్దు.



# సర్దార్ చెంత.. సరదాల సంత..

గుజరాత్‌లోని సర్దార్ పటేల్ ఐక్యతా విగ్రహం.. మరిన్ని హంగులు అద్దుకుంటోంది. 2019లో అత్యున్నత పర్యాటక కేంద్రాలలో ఒకటిగా టైమ్స్ మ్యాగజైన్ జాబితాలో చోటు దక్కించుకున్న ఈ సరికొత్త విహార కేంద్రం మరిన్ని సందళ్లకు వేదిక కానుంది. పటేల్ విగ్రహానికి కూతవేటు దూరంలోని ఖల్వానీ రివర్ రాఫ్టింగ్ అడ్డాగా మారింది. ఇటీవల ప్రారంభమైన రాఫ్టింగ్‌లో పాల్గొనడానికి సాహస యాత్రికులు ఆసక్తి చూపుతున్నారు. ఐక్యతా విగ్రహం పరిసరాల్లోనే 1,300 ఎకరాల్లో జంతు ప్రదర్శనశాల ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి జూపార్క్‌ను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. పులులు, సింహాలు, చిరుతలు, రైనోలు, 12 రకాల జింకలు, ఎలుగుబంట్లు, రకరకాల జంతువులకు ఆవాసంగా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే దేశవిదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్న ఐక్యతా విగ్రహం రానున్న రోజుల్లో కొత్త హంగులతో సమగ్ర విహార కేంద్రంగా రూపుదిద్దుకోనుంది.



**"సెప్టెంబరు మాసం.. పాత బాధలు తలెత్తనీయం" అన్నారో కవి! అదెలాగో చెప్పలేదాయన! ఇప్పుడెలా అంటారా? ఈ సెప్టెంబరు మంచి రిమెంబర్ కావాలంటే.. కర్ణాటకలోని సండూరుకు వెళ్లండి. పాత బాధలన్నీ మాయం. కొత్త సంతోషాలు ఖాయం.**



# లోకం చూడని లోహ గిరులు

అది 1934 సెప్టెంబరు.. దేశ పర్యటనలో భాగంగా మహాత్మా గాంధీ కర్ణాటక సందర్శించారు. ఒక్కో ఊరినీ ఉత్సాహపరుస్తూ సాగిపోతున్నారు. ఒక్కో పల్లెనూ తట్టిలేపుతూ వెళుతున్నారు.

ఓ చోటు.. బాపూజీ మనసునే ఉత్సాహపరిచింది. ఆయనలోని పర్యాటకుడిని తట్టిలేపింది. కొండ, కోన, వాగు, వంక అన్నీ గాంధీజీని విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఆ ఊరు పేరే సండూరు. అక్కడి ప్రకృతి రమణీయతకు ముగ్ధులైన బాపూ.. 'సీ సండూరు ఇన్ సెప్టెంబర్' (సండూరును సెప్టెంబరులో చూడండి) అన్నారట. అదే సండూరు పర్యాటక నినాదం అయింది. ప్రకృతి ప్రేమికులకు ఓ విధానంగా మారింది.




అంతులేని ఖనిజ సంపదకు నెలవైన బళ్లారి జిల్లాలో ఉంటుంది సండూరు. గనుల మధ్య చెక్కు చెదరని అందాలతో తన ప్రత్యేకతను చాటుకుంటోందీ ప్రాంతం. చుట్టూ దట్టమైన అడవి, ఎత్తయిన పర్వతాలు, అందమైన లోయలు, చిక్కగా పచ్చదనం, అరుదైన ఔషధ మొక్కలు, సెలయేళ్లు, అబ్బురపరిచే వన్యప్రాణులు, పురాతన ఆలయాలతో అడుగడుగునా అద్భుతాలతో పర్యాటక ప్రియులను అలరిస్తోంది సండూరు. 'బళ్లారిలో ఉండేది రెండే కాలాలు! ఒకటి ఎండాకాలం.. మరొకటి తీవ్రమైన ఎండాకాలం' అని ఓ కన్నడ కవి అక్కడి పరిస్థితిని వివరించారు. ఈ సూత్రీకరణ సండూరుకు వర్తించదు. ఇక్కడ ఏడాది పొడవునా ఒకే కాలం ఉంటుంది. అది చల్లనికాలం. ప్రతి మదీ మెచ్చే కాలం. అందులోనూ సెప్టెంబరు వచ్చిందంటే చాలు.. వానలు వెలిసి, పుడమి మురిసి, పసరిక పరిచి మరో లోకాన్ని ఆవిష్కరిస్తాయి సండూరు పరిసరాలు. జనవరి మాసాంతం వరకూ ఈ అద్భుతాలు అలరిస్తూనే ఉంటాయి. సండూరును ఉత్తర కర్ణాటక మాలెనాడుగా, స్కాట్లాండ్ ఆఫ్ కర్ణాటకగా పిలుచుకుంటారు.

### మయూర వనం

సండూరు సమీపంలో స్వామిమలై కొండలుంటాయి. ఈ గిరుల సానువుల్లో వేలాది హెక్టార్లలో దట్టమైన అభయారణ్యం ఉంటుంది. అరుదైన ఔషధ మొక్కలు, ప్రత్యేకమైన వృక్షాలను చూడొచ్చు. అడుగడుగునా తటాకాలు పలకరిస్తాయి. పుష్కరానికోసారి విరిసి మురిపించే నీలకురంజి లాంటి అరుదైన పుష్పజాతులు ఎన్నో ఉన్నాయిక్కడ. ఈ అద్భుత వనాన్ని రకరకాల పక్షులు ఆవాసంగా చేసుకున్నాయి. దక్షిణ భారతంలో నెమళ్లు ఎక్కువగా కనిపించే ప్రాంతాల్లో ఇదీ ఒకటి. ఈ ప్రాంతాన్ని నెమళ్ల అభయారణ్యంగా ప్రకటించారు. సమీపంలోని కొండపై నవిలు తీర్థ (నెమలి తీర్థం) ఉంది. ఈ తీర్థంలో నెమలి వాహనుడైన కుమారస్వామి కొలువై ఉండటం విశేషం. ఆయన నవిలు స్వామిగా పూజలు అందుకుంటున్నాడు. ఆలయానికి వెళ్లే మార్గంలో నందిహళ్లి దగ్గర ఔషధ మొక్కల కేంద్రం ఉంది.

### తరగని సౌందర్యం

సండూరు చుట్టుపక్కల గనులు చాలా ఉంటాయి. ఖనిజం కోసం ఓవైపు నిరంతరం తవ్వకాలు సాగుతూనే ఉంటాయి. మరోవైపు తరగని ప్రకృతి సౌందర్యం పర్యాటకులకు సాదర స్వాగతం పలుకుతుంటుంది. ఈ పరిసరాల్లో లోహపు కొండలు ఎన్నో ఉంటాయి. పచ్చని చెట్ల మధ్య ఎర్రని కొండలు ఆశ్చర్యం కలిగిస్తాయి. స్వామిమలై, దోణిమలై, రామ్‌గఢ్ ఇలా పదుల సంఖ్యలో ఉన్న లోహగిరులు సాహస యాత్రికులకు ట్రెక్కింగ్, రాక్‌క్లైంబింగ్ కేంద్రాలుగా అలరిస్తున్నాయి. వంపులు తిరుగుతూ సాగే కొండ దారిలో ప్రయాణం ఎప్పటికీ మరచిపోలేం. ఇక్కడి పర్యాటక ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.





### మరిన్ని విశేషాలు

- కరకుశల కేంద్ర ( హస్తకళల కేంద్రం)
- శివవిలాస్ ప్యాలెస్ (రాజ వంశస్థుల వారసత్వ భవనం)
- తోరణగల్లులోని జిందాల్ ఉక్కు పరిశ్రమ టౌన్‌షిప్ విద్యానగర్‌లో లేజర్‌షో
- దారోజి ఎలుగుబంట్ల సంరక్షణ కేంద్రం (సుమారు 30 కి.మీ.)



### బ్రహ్మచారి స్వామి..

సండూరుకు 12 కి.మీ. దూరంలో.. స్వామిమలై కొండల్లో ఉంటుంది కుమారస్వామి ఆలయం. దీనిని క్రీ.శ.7వ శతాబ్దంలో నిర్మించినట్టు చెబుతారు. చాళుక్యులు, రాష్ట్రకూటుల హయాంలో ఆలయ అభివృద్ధి జరిగింది. అద్భుతమైన శిల్పసంపదతో అలరారే ఆలయం.. ఆధ్యాత్మిక కేంద్రంగా ఆకట్టుకుంటోంది. స్వామిని బ్రహ్మచారిగా భావించి పూజలు చేస్తారు. ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల ఉపాలయాలు ఉన్నాయి.

### నంది నుంచి ఏకధారగా..

కుమారస్వామి ఆలయానికి దగ్గర్లో హరిహర ఆలయం ఉంటుంది. ఇక్కడి నంది విగ్రహం నుంచి ధారగా నీరు వస్తుంటుంది. ఏడాది పొడవునా ఏకధాటిగా ప్రవహించే నీటితో కొలను ఏర్పడింది. సమీప అడవులు, గనుల మీదుగా ప్రవహించడం వల్ల ఈ నీటికి అద్భుతమైన ఔషధ గుణాలు ఉంటాయని స్థానికుల నమ్మకం.

### కొండల మధ్య మారెమ్మ

సండూరుకు 25 కి.మీ. దూరంలో మారెమ్మ ఆలయం ఉంటుంది. రెండు కొండల నడుమ ఉన్న గండి మారెమ్మ ఆలయ పరిసరాలు పర్యాటకులను అలరిస్తాయి. ఆలయానికి వెళ్లే మార్గంలో పచ్చదనం కనువిందు చేస్తుంది. అక్కడక్కడా జలపాతాలు పలకరిస్తాయి. గండి నరసింహ, బసవేశ్వర, భీమ తీర్థ తదితర ఆధ్యాత్మిక కేంద్రాలు కూడా పర్యాటకులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు ప్రకృతి సౌందర్యాన్ని కొత్తగా పరిచయం చేస్తాయి.

– ప్రాణేష్ బుదార్పు, తోరణగల్లు

### చేరుకునేదిలా

సండూరు.. ప్రముఖ చారిత్రక నగరం హంపి నుంచి 40 కి.మీ., బళ్లారి నుంచి 52 కి.మీ., హోసపేట నుంచి 30 కి.మీ. దూరంలో ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు నుంచి బళ్లారి, హోసపేటకు రైళ్లున్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సండూరుకు చేరుకోవచ్చు. హంపి పర్యటనకు వెళ్లినప్పుడు ఒక్కరోజు సండూరుకు కేటాయిస్తే.. మీ విహారానికి అదనపు ఆనందం చేకూరుతుంది. హోసపేటలో అన్ని తరగతుల వారికి తగిన వసతి లభిస్తుంది. సండూరు నుంచి 20 కి.మీ. దూరంలో తారానగర్‌లో ప్రైవేట్ రిసార్ట్ ఉంది. ఇక్కడ విలాసవంతమైన బస లభిస్తుంది. జలక్రీడలకు ఈ రిసార్ట్ వేదిక.

**బుక్ నౌ**

### తిరువనంతపురం నుంచి
# మదురై వరకు

సరదా విహారాలతో పర్యాటక ప్రియులను అలరిస్తోన్న ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) తమిళనాడు–కేరళ పర్యటనకు స్వాగతం పలుకుతోంది.

- **ట్రెజర్ ఆఫ్ తమిళనాడు-ట్రావెన్‌కోర్**

తమిళనాడు, కేరళలోని ఆధ్యాత్మిక, విహార కేంద్రాలను సందర్శించవచ్చు. హైదరాబాద్ నుంచి తిరువనంతపురానికి విమానయానం ఉంటుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విహారం కొనసాగుతుంది.



**నిడివి:** 5 రాత్రులు-6 పగళ్లు
**ఎప్పుడు?:** అక్టోబరు 8, డిసెంబరు 24
**చూపించే ప్రదేశాలు:** తిరువనంతపురం, కన్యాకుమారి, రామేశ్వరం, కొడైకెనాల్, మదురై
**ప్యాకేజీ ధర:** రూ.26,100 నుంచి (పెద్దలకు) రూ.22,750 (5-11 ఏళ్లలోపు పిల్లలకు)
**మరిన్ని వివరాలకు** http://www.irctc-tourism.com/ వెబ్‌సైట్‌ని చూడండి.
**సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు:** 96865 75202, 97013 60701, 040-27702407

**ట్రెండ్ గురూ!**

# నిర్భయంగా.. నిశ్చయంగా..

వినోదం కోసం విహారానికి వెళ్లినవారు కోరుకునేది.. ప్రశాంతత. అంతకు మించిన భద్రత. ఈ విషయాల్లో స్పష్టత ఉంటేనే ఎక్కడికైనా వెళ్లడానికి మొగ్గు చూపుతారు. ఇప్పుడు కొత్త రకం పర్యాటకం మొదలైంది. విధ్వంసం జరిగే చోట వాలిపోతున్నారు కొందరు. బాంబుల మోతలను మోదంగా భావిస్తున్నారు. పైగా యుద్ధ పర్యాటకంగా నామకరణం చేసి విలయ తాండవాన్ని ప్రత్యక్షంగా చూడాలని ఉబలాటపడుతున్నారు. ఈ తరహా విహారం ఇప్పుడు మొదలైంది



కాదు. గల్ఫ్ యుద్ధం సమయంలోనే ఇది పురుడు పోసుకుంది. ఇన్నాళ్లకు ట్రెండుగా మారింది. నిత్యం ప్రమాద ఘంటికలు మోగే మధ్య ప్రాచ్య దేశాలు సిరియా, లెబనాన్, ఇరాక్ సందర్శనకు పర్యాటకులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రజలకు రక్షణ కరవైన ఉక్రెయిన్, కెన్యా, జమైకా తదితర దేశాల సందర్శనకూ ఆసక్తి కనబరుస్తున్నారు. ఆసియా విషయానికి వస్తే అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ పర్యాటకానికీ సాహస యాత్రికులు సై అంటున్నారు. ఇన్ని వ్యయప్రయాసలకోర్చి ఎందుకీ ప్రయాణం అనడిగితే.. థ్రిల్ కోసమే అని చెబుతున్నారు.

## సుప్రీంకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తులు

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34కి పెంచిన నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం కొలీజియం నలుగురు కొత్త న్యాయమూర్తుల పేర్లను సిఫార్సు చేసింది. ఈ జాబితాలో గతంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందించి, ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేస్తున్న జస్టిస్ వి.రామసుబ్రహ్మణియన్‌తోపాటు, పంజాబ్-హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ మురారి, రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రభట్, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హృషికేష్ రాయ్ ఉన్నారు. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితోపాటు 30 మంది న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో సేవలందిస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ సంఖ్యను 34కి పెంచడంతో నలుగురు కొత్తవారిని నియమించడం అనివార్యమైంది.

## భారత్‌కు రూ.86,000 కోట్లు ఇస్తాం

### మోదీకి ఆసియా అభివృద్ధి బ్యాంక్ అధ్యక్షుడి హామీ

దిల్లీ: ఇంటింటికి తాగునీటి సరఫరా, రహదారి భద్రత తదితర కార్యక్రమాల నిమిత్తం భారత్‌కు 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ.86 వేల కోట్ల) సాయం అందిస్తామని ఆసియా అభివృద్ధి బ్యాంకు హామీ ఇచ్చింది. ప్రధాని మోదీతో గురువారమిక్కడ బ్యాంకు అధ్యక్షుడు టకెహికో నకావో భేటీ అయ్యారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, సౌర విద్యుత్ ఆధార వ్యవసాయం తదితర అంశాలపై వారిద్దరూ చర్చించారు. 2020-22 మధ్య భారత్‌కు 12 బిలియన్ డాలర్ల సాయం అందజేస్తామని నకావో పేర్కొన్నారు.

## నిధుల్లేకుండా రాజధాని పనులెలా చేపడతాం

### ఏపీ మంత్రి బొత్స వెల్లడి

ఈనాడు, అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో రూ.35వేల కోట్ల పనులకు గతంలో టెండర్లను పిలిచారని, వాటిలో నిధుల సమీకరణకు బ్యాంకులతో ఒప్పందాలు చేసుకోని పనులన్నింటినీ రద్దు చేశామని ఏపీ పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. 'నిధులను సమీకరించుకోకుండా పనులు చేస్తే బిల్లులెవరు చెల్లిస్తారు? ఇప్పటికే జరిగిన పనులకు రూ.2,800 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి' అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు 64వేల స్థలాలను తిరిగిచ్చామని, వాటిలో 43వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్లే ఇంత వరకు జరిగాయని, మిగతా స్థలాల రిజిస్ట్రేషన్లను త్వరలో పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. రాజధానిపై గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సమీక్ష జరిపారు. అనంతరం మంత్రి బొత్స విలేకరులతో మాట్లాడారు.

## కానిస్టేబుల్ సాహసం.. నిలిచిందొక ప్రాణం

నాంపల్లి, న్యూస్‌టుడే: కదిలే రైల్లోంచి దిగడానికి దుస్సాహసం చేశాడో ప్రయాణికుడు.. ఊహించనివిధంగా జారిపడి రైలు బోగి, ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుపోయాడు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అతడి ప్రాణాలు గాలిలో కలిసిపోయేవే! అంతలోనే ఓ కానిస్టేబుల్ సాహసించి అతడిని కాపాడాడు. వళ్లు జలదరించే ఈ సంఘటన గురువారం ఉదయం నాంపల్లి రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. సికింద్రాబాద్‌కు చెందిన టి.వెంకట్‌రెడ్డి(45) గురువారం ఉదయం చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చే చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ స్టేషన్లో ఎక్కాడు. నాంపల్లి స్టేషన్లోకి ప్రవేశిస్తుండగానే దిగడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో అతడు రైలుకు, ప్లాట్‌ఫాంకు మధ్యలోకి జారిపోయాడు. కదిలే రైలుబోగీని గట్టిగా పట్టుకుని వేలాడుతూ అలాగే కొద్ది దూరం ముందుకెళ్లాడు. స్టేషన్లో ఎంతోమంది ప్రయాణికులు ఉన్నా నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు. వెంకట్‌రెడ్డి ఏ మాత్రం రైలును వదిలిపెట్టినా చక్రాల కిందకు వెళ్లిపోయి ప్రాణాలు కోల్పోయేవాడే! అక్కడే ఉన్న ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ వికుల్‌కుమార్ ఇది చూశాడు. ఎంతో సాహసం చేసి ఆ రైలుతో పాటే పరుగెత్తి.. బోగీని పట్టుకు వేలాడుతున్న వెంకట్‌రెడ్డిని చాకచక్యంగా లాగి పక్కకు తప్పించాడు. అతడికి ప్రాణాపాయం తప్పింది. అతడికి స్వల్ప గాయాలే అయ్యాయని, బంధువులను పిలిపించి అప్పగించామని ఆర్‌పీఎఫ్ నాంపల్లి సీఐ జనార్దన్‌చౌదరి పేర్కొన్నారు.

## క్యారమ్స్ వెటరన్స్‌తో క్రికెట్ మాస్టర్!



క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ ఈ బామ్మలకు క్యారమ్స్ కోచ్‌గా మారాడా ఏంటి అని ఆలోచిస్తున్నారా? అదేం లేదండీ! జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముంబయిలోని సెయింట్ ఆంథోనీ వృద్ధాశ్రమాన్ని సచిన్ గురువారం సందర్శించారు. హుషారుగా క్యారమ్స్ ఆడేలా అక్కడి బామ్మలను ప్రోత్సహించారు. ఆటలు ఆడుతూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

## గుమ్మడిస్తే గరుడ పక్షి!



చూడగానే ఆకర్షించేలా ఉన్న ఈ 'గద్ద' జర్మనీలోని మెకెర్‌నిక్‌లో గురువారం కనిపించింది. రంగు రంగుల గుమ్మడి కాయలతో ఈ బొమ్మ గద్దను రూపొందించారు.

# దృఢమేవ జయతే

- శారీరక శ్రమతో సత్ఫలితాలు: మోదీ

> శారీరక దృఢత్వం అనేది కేవలం ఒక పదం కాదు. ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితానికి అది అనివార్యం. - మోదీ

దిల్లీ: శారీరక దృఢత్వాన్ని సాధించేందుకు ఏ మాత్రం ఖర్చు అక్కర్లేదని, దాని నుంచి అందే ప్రతిఫలం మాత్రం అనంతమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శారీరక దృఢత్వ సాధన ఒక ఉద్యమంలా మారాలని పిలుపునిచ్చారు. ప్రజలందరి సహకారంతో ఈ ఉద్యమాన్ని భారీ స్థాయిలో విజయవంతం చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా చేపట్టిన 'ఫిట్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రధాని మోదీ గురువారం దిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం శారీరక శ్రమలేని జీవనశైలికి కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక దృఢత్వ సాధన మన సంస్కృతిలో భాగమే అయినా, ప్రస్తుతం ఆ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. కొన్ని దశాబ్దాల క్రితం.. ఒక సాధారణ వ్యక్తి సైతం రోజూ 8 నుంచి 10 కి.మీ. దాకా నడిచేవారని, సైకిల్ తొక్కడమో, పరుగెత్తడమో చేసేవారని గుర్తుచేశారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతితో శారీరక శ్రమ తగ్గిపోయిందన్నారు. ఇప్పుడు మనం చాలా తక్కువగా నడుస్తున్నామని, తగినంతగా నడవడం లేదన్న సంగతిని మనం ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం సైతం చెబుతోందన్నారు. రోజువారీ జీవితంలో శారీరక శ్రమను, క్రీడలను భాగం చేసే దిశగా ప్రజల్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఫిట్ ఇండియా కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. నేటి యువతరం జీవనశైలి వ్యాధుల బారిన పడుతోందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. మధుమేహం, అధిక రక్తపోటు తదితర జీవన శైలి వ్యాధుల కేసుల తీవ్రత పెరుగుతోందన్నారు. పన్నెండు, పదిహేనేళ్ల చిన్నారులు సైతం మధుమేహం బారిన పడినట్లు, 30 ఏళ్ల వ్యక్తికే గుండెపోటు వచ్చినట్లు మనం తరచూ వింటుంటామన్నారు. మన దినచర్యను మార్చుకోవడం ద్వారా జీవనశైలి రుగ్మతలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఫిట్‌ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడా పురస్కార విజేతలకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. క్రీడారంగంలో భారత్ విజయాలను ప్రశంసించారు. బాక్సింగ్, బ్యాడ్మింటన్, టెన్నిస్.. వంటి ఏ క్రీడలోనైనా భారత క్రీడాకారులు మన ఆకాంక్షలకు కొత్త రెక్కలు తొడుగుతున్నారని, వారు సాధించిన పతకాలు కేవలం వారి కఠోర పరిశ్రమకు ఫలితాలే కాకుండా, నవ భారత ఆత్మవిశ్వాసానికి ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి కిరణ్‌రిజిజుతో పాటు ఈ ఏడాది జాతీయ క్రీడా పురస్కార విజేతలు కూడా పాల్గొన్నారు. దేశీయ యుద్ధక్రీడా రూపాలను, నృత్యాలను, క్రీడల్ని ప్రదర్శించారు.

### ఫిట్ ఇండియా అమలుకు కమిటీ

ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు కేంద్రమంత్రి రిజిజు నేతృత్వంలో ప్రభుత్వ అధికారులు, భారత ఒలింపిక్ సంఘం, జాతీయ క్రీడల సమాఖ్యలు, ప్రైవేటు సంస్థలు, ఫిట్‌నెస్ ప్రోత్సాహకులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో క్రీడలు, మాధ్యమిక విద్య, ఆయుష్, యువజన వ్యవహారాలు తదితర శాఖల కార్యదర్శులు కూడా ఉన్నారు.

## నీకు నేనున్నా దోస్త్..



కౌనార్.. ఎనిమిదేళ్ల బాలుడు. అందరిలాంటి వాడు కాదు. ఆటిజం బాధితుడు. తొలిసారి బడికి వెళ్తున్నాడు. గేటు దాకా వచ్చాడు. రోజూ తోడుగా ఉండే తల్లి తన వెంట లోపలికి రావట్లేదు. లోపలికి వెళ్లాలంటే ధైర్యం చాలట్లేదు. కళ్ల నిండా నీళ్లు. ఏడుపు మొదలైంది. అంతలోనే అక్కడికి వచ్చాడు క్రిస్టియన్. తన వయసూ ఎనిమిదేళ్లే. అయితేనేం కానార్ చెయ్యందుకున్నాడు. ఏడవొద్దంటూ అతణ్ని ఓదార్చాడు. తోడుగా నేనుంటాననే ధైర్యాన్నిచ్చాడు. కానార్‌ను బడిలోకి తీసుకెళ్లాడు. అమెరికాలోని విచిటా నగరంలో మిన్నెహా ప్రాథమిక పాఠశాల వద్ద తాజాగా చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను క్రిస్టియన్ తల్లి సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. తన కుమారుడిని చూసి గర్వపడుతున్నానని.. స్నేహానికి జాతి, మతం వంటి భేదభావాలేవీ ఉండవని అతడు నిరూపించాడని ఆనందం వ్యక్తం చేసింది.

## న్యాయ వ్యవస్థపై హైకోర్టు జడ్జి ఆరోపణలు

### ఆయన పరిధిలోని కేసులను వెనక్కి తీసుకున్న విస్తృత ధర్మాసనం

పట్నా: న్యాయ వ్యవస్థలో అవినీతి, కులతత్వం ఉందంటూ పట్నా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రాకేశ్ కుమార్ ఓ కేసు విచారణ సందర్భంగా ఆరోపించడం సంచలనం కలిగించింది. దీనిని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు ఆయన విచారణ పరిధిలో ఉన్న కేసులన్నింటినీ వెనక్కి తీసుకోవడమే కాకుండా, ఆయన ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి.శాహీ ఆధ్వర్యంలోని 11 మంది న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం ఈ అసాధారణ నిర్ణయం తీసుకొంది. ఈ వ్యవహారం పూర్వపరాలను పరిశీలిస్తే...రిటైర్డు ఐఏఎస్ అధికారి అయిన కె.పి.రామయ్య బిహార్ మహా దళిత్ వికాస్ మిషన్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఆయన పెట్టుకున్న బెయిల్ పిటిషన్ గతంలో జస్టిస్ రాకేశ్ కుమార్ ధర్మాసనం ముందుకు రాగా తిరస్కరణకు గురవడం గమనార్హం. గత్యంతరం లేక ఆయన విజిలెన్స్ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి ముందు లొంగిపోయారు. ఆ వెంటనే ఆయనకు బెయిల్ మంజూరయింది. దిగువ కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని జస్టిస్ రాకేశ్ కుమార్ తనకు తానుగా వ్యాజ్యంగా స్వీకరించారు. లొంగిపోయిన రోజునే బెయిల్ మంజూరు చేయడాన్ని తప్పుపట్టారు. సంబంధిత జడ్జిపై విచారణ జరిపి నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని పట్నా జిల్లా జడ్జిని ఆదేశించారు. ఈ సందర్భంగానే ఆయన న్యాయవ్యవస్థపై వ్యాఖ్యలు చేశారు.

## నకిలీ వీడియోలతో భారత సైన్యంపై దుష్ప్రచారం

### పాక్ కుయుక్తులు

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌లో పరిస్థితులపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేయడానికి పాకిస్థాన్ సైన్యం దుష్ట పన్నాగాలు పన్నుతోంది. భారత సైన్యం అకృత్యాలకు పాల్పడుతోందని చూపేందుకు నకిలీ వీడియోలను తయారుచేస్తోంది. మన సైనికుల తరహా యూనిఫామ్‌ను ధరించిన వ్యక్తులను ఏర్పాటు చేసుకుని వారు ఆగడాలకు పాల్పడుతున్నట్లు చూపే దృశ్యాలను చిత్రీకరించి, సామాజిక మాధ్యమాల్లో ఉంచుతోంది. ఇందుకోసం ఏకంగా ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ కేంద్రంగా ఈ వ్యవహారం సాగుతోంది. తద్వారా ఈ 'అకృత్యాలు' జమ్మూ-కశ్మీర్‌లో చోటుచేసుకుంటున్నట్లు నమ్మించేందుకు ప్రయత్నిస్తోంది.

## చిదంబరం అరెస్టు సంతోషకరం: ఇంద్రాణి

దిల్లీ: చిదంబరాన్ని అరెస్టు చేయడం సంతోషకరమైన వార్త అని ఐఎన్‌ఎక్స్ మీడియా వ్యవస్థాపకురాలు ఇంద్రాణి ముఖర్జియా అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ చిదంబరం అన్ని వైపుల నుంచీ ఇరుక్కున్నారని అన్నారు. ఆయన కుమారుడు కార్తీని కూడా అరెస్టు చేయాలని అభిప్రాయపడ్డారు.

# పాక్ 'కమాండోల' చొరబాటు!

- సముద్ర మార్గంలో ప్రవేశించారు
- నిఘా సంస్థల హెచ్చరిక
- గుజరాత్‌లో రేవుల వద్ద భద్రత కట్టుదిట్టం

భుజ్: పాకిస్థాన్ కమాండోలు సముద్ర మార్గం గుండా భారత్‌లోకి చొరబడ్డారన్న సమాచారంతో గుజరాత్‌లో భద్రతా యంత్రాంగం అప్రమత్తమైంది. ఇక్కడ మత ఘర్షణలను రెచ్చగొట్టడం లేదా దాడులకు దిగడం వీరి ఉద్దేశమని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని కాండ్లా, ముంద్రా రేవులు సహా కీలక ప్రదేశాల వద్ద నిఘాను అధికారులు పెంచారు. అనుమానిత వ్యక్తులు, పడవల కదలికలపై కన్నేసి ఉంచారు.

పాక్‌లో శిక్షణ పొందిన ఈ కమాండోలు హరామీ నాలా క్రీక్ ప్రాంతం గుండా గల్ఫ్ ఆఫ్ కచ్‌లోకి ప్రవేశించి ఉండొచ్చని ఈ హెచ్చరిక పేర్కొంది. ఈ కమాండోలు నీటి అడుగున దాడులు చేపట్టడంలో తర్ఫీదు పొంది ఉంటారని అనుమానిస్తున్నట్లు వివరించింది. నౌకలు, రేవులు అత్యంత జాగ్రత్త వహించాలని స్పష్టంచేసింది. అదనపు బలగాలు మోహరించాలని, తీర ప్రాంతంలో గస్తీ తిరగాలని, అనుమానిత పడవలు, నౌకలు తీరం వైపు వస్తుంటే అడ్డుకోవాలని పేర్కొంది.

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు నుంచే ఇక్కడ భద్రతను కట్టుదిట్టం చేసినట్లు సరిహద్దు ప్రాంత ఐజీ డి.బి.వాఘేలా చెప్పారు. గుజరాత్‌లోకి ఉగ్రవాదులు ప్రవేశించారని నిర్ధారించే సమాచారమేదీ తమకు అందలేదని ఆయన పేర్కొన్నారు. అయితే సముద్ర మార్గంలో వారు ప్రవేశించొచ్చన్న సమాచారం ఉందన్నారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైష్ ఎ మహ్మద్ ఉగ్రవాద ముఠాలో సాగర విభాగం ఏర్పడిందని నౌకాదళాధిపతి అడ్మిరల్ కరంబీర్ సింగ్ సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులోని సభ్యులకు సముద్ర మార్గంలో దాడి కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు.

### అక్కసు మానండి

"కశ్మీర్ అసలు మీతో (పాకిస్థాన్‌తో) ఎప్పుడుంది? మీకు అక్కసెందుకు? గిల్గిత్ బాల్టిస్థాన్ సహా పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను (పీఓకే) పాకిస్థాన్ ఆక్రమించింది. పాకిస్థాన్ కూడా భారత్ నుంచి ఏర్పడినదే. కశ్మీర్ మాది. భారత్‌పై ద్వేషాన్ని మాని పాకిస్థాన్‌లో ఉగ్రవాదులను కట్టడి చేయడంపై దృష్టి పెట్టాలి"

– రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

## పాక్ నివేదికలో భాజపా నేతల పేర్లు కూడా..

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌లోని పరిస్థితిపై ఐక్య రాజ్య సమితికి పాకిస్థాన్ సమర్పించిన వినతిపత్రంలో భాజపా నేతలు చేసిన వ్యాఖ్యలను విస్తృతంగా ఉటంకించింది. అక్కడ శాంతి భద్రతలు క్షీణించాయంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యతో పాటు, భాజపా నాయకులు చేసిన వ్యాఖ్యానాలను ప్రస్తావించింది. భాజపా నేత, హరియాణా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఆ పార్టీ ఎమ్మెల్యే విక్రమ్ సైనీల వ్యాఖ్యలను పేర్కొంది. భాజపాకు చెందిన ముస్లిం కార్యకర్తలు కశ్మీరీ మహిళలను పెళ్లి చేసుకోవచ్చని సైనీ అన్నారని, ఖట్టర్ కూడా ఇలాంటి వ్యాఖ్యే చేశారని వివరించింది.

### శ్రీనగర్‌లో సీతారాం ఏచూరి

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు నేపథ్యంలో ఈనెల 5 నుంచి గృహ నిర్బంధంలో ఉన్న తన మిత్రుడు, పార్టీ సహచరుడు మహమ్మద్ యూసుఫ్ తారిగామిని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పరామర్శించారు. సుప్రీంకోర్టు అనుమతితో గురువారం శ్రీనగర్‌కు వచ్చిన ఆయన... తారిగామి నివాసానికి వెళ్లి మూడు గంటలపాటు ఆయనతో సమావేశమయ్యారు.

## కశ్మీర్‌కే మా అగ్ర ప్రాధాన్యం: పాక్

ఇస్లామాబాద్: ఐక్యరాజ్యసమితి తీర్మానాల మేరకు కశ్మీర్ సమస్యకు పరిష్కారం సాధించడానికే తమ విదేశీ విధానంలో అగ్ర ప్రాధాన్యం ఇస్తామని పాకిస్థాన్ స్పష్టం చేసింది. గురువారం విదేశాంగ కార్యాలయం అధికార ప్రతినిధి మొహమ్మద్ ఫైజల్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌తో ద్వైపాక్షిక చర్చలకెప్పుడూ పాకిస్థాన్ మద్దతు ఇస్తుందని, భారతీయ నాయకత్వమే అందుకు సిద్ధంగా లేదన్నారు. అంతకుముందు భారత్ చర్యలకు నిరసనగా దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పిలుపునిచ్చారు.

### అణు సామర్థ్య క్షిపణిని పరీక్షించిన పాక్

ఇస్లామాబాద్: అణ్వస్త్రాన్ని మోసుకెళ్లగల స్వల్ప శ్రేణి 'ఘజనవీ' క్షిపణిని పాకిస్థాన్ విజయవంతంగా పరీక్షించింది. 290 కిలోమీటర్ల పరిధి కలిగిన ఈ అస్త్రం ఉపరితలం నుంచి ఉపరితలం మీదున్న లక్ష్యాలను ఛేదించగలదు. జమ్మూ-కశ్మీర్ అంశంపై భారత్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో పాక్ ఈ పరీక్ష నిర్వహించడం గమనార్హం. ఇటీవల కశ్మీర్‌పై భారత్ తీసుకున్న నిర్ణయంతో అణు యుద్ధం ముప్పు పొంచి ఉందని ఇమ్రాన్ పదేపదే హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే.

## మీ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: భారత్

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఉపసంహరించుకున్న తర్వాత పాకిస్థాన్ నేతలు చేస్తున్న ప్రకటనలు అత్యంత బాధ్యతారాహిత్యమంటూ భారత్ తీవ్రంగా ఖండించింది. క్షేత్రస్థాయి పరిస్థితులకు భిన్నంగా ఆందోళనకర పరిస్థితులున్నాయని ప్రచారం చేసే ఉద్దేశంతో అలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించింది. గురువారం విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ మాట్లాడుతూ.. పాకిస్థాన్ మంత్రి షిరీన్ మజారి ఐరాసకు రాసిన లేఖలో జమ్మూ-కశ్మీర్‌లో భారత్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించడాన్ని తిరస్కరించారు. భారత అంతర్గత వ్యవహారాలపై పాక్ నేతలు చేస్తున్న అత్యంత బాధ్యతారాహిత్య వ్యాఖ్యల్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఇటీవల చేసిన ప్రకటనల్ని దృష్టిలో ఉంచుకొని రవీశ్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ తన దేశ విధానంగా ఉపయోగిస్తోందన్న సంగతి మనందరికీ తెలిసిందేనన్నారు. జమ్మూ-కశ్మీర్‌లో స్థానిక ప్రభుత్వం పరిస్థితిని పరిణతితో, నిగ్రహంతో చక్కబెడుతోందని, ఇప్పటి వరకు ఒక్క ప్రాణం కూడా పోలేదని, ఒక్క బుల్లెట్ కూడా పేల్చలేదన్నారు. సాధ్యమైనంత త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొంటాయని పేర్కొన్నారు.

## అత్యంత భద్రం.. టోక్యో నగరం

### జాబితాలో ముంబయి, దిల్లీలకు 45, 52వ స్థానాలు



దిల్లీ: ప్రపంచంలో అత్యంత భద్రమైన నగరంగా మళ్లీ టోక్యో నిలిచింది. రెండు, మూడు స్థానాలను వరుసగా సింగపూర్, ఒసాకలు దక్కించుకున్నాయి. మన దేశ రాజధాని దిల్లీ 52వ స్థానంతో సరిపెట్టుకోగా, వాణిజ్య రాజధాని ముంబయి మాత్రం 45వ స్థానంలో నిలిచింది. 'ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్' సంస్థ... ఐదు ఖండాలకు చెందిన 60 నగరాల్లోని పరిస్థితులను మదింపు చేసి, ఈ ర్యాంకులను కేటాయించింది. యాంగూన్ (మయన్మార్), కరాచీ (పాకిస్థాన్), ఢాకా (బంగ్లాదేశ్)లు వరుసగా చివరి మూడు స్థానాలతో సరిపెట్టుకున్నాయి. డిజిటల్, మౌలిక వసతులు, ఆరోగ్య, వ్యక్తిగత భద్రత తదితర అంశాల ప్రాతిపదికన ఈ ర్యాంకులను కేటాయించారు.

## పేగుబంధం.. గొలుసు బంధనం!



మాదకద్రవ్యాల వాడకంతో జీవితాలు ఎంతటి దారుణ స్థితికి దిగజారుతాయో తెలియజెప్పేందుకు సజీవ సాక్ష్యం ఈ చిత్రం. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో మాదకద్రవ్యాలకు బానిసైన ఓ యువతిని కన్నతల్లి ఇలా ఇంట్లోనే గొలుసుతో బంధించింది. బిడ్డ అడుగు బయటపెట్టకుండా.. మాదకద్రవ్యాలను తీసుకోకుండా కాపాడుకునేందుకు తనకున్న దారి ఇదొక్కటేనంటూ ఆ తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. వాస్తవానికి మాదకద్రవ్యాల అలవాటును మాన్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రంలో తొలుత యువతిని చేర్పించారు. బయటి ప్రాంతాలతో పోలిస్తే ఆ కేంద్రం వద్దే మాదకద్రవ్య విక్రయదారులు ఎక్కువగా ఉంటుండటం, మహిళలకు ప్రత్యేక కేంద్రం లేకపోవడం వంటి కారణాలతో ఆమెను తల్లి తిరిగి ఇంటికి తీసుకొచ్చి గొలుసుతో బంధించింది. అమృత్‌సర్ ఎంపీ గుర్జీత్‌సింగ్ ఔజ్లా మంగళవారం యువతి ఇంటికి వెళ్లారు. మాదకద్రవ్యాల అలవాటు మాన్పించేలా ఇంట్లోనే ఆమెకు చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు.

కాలం చెల్లిన వాహనాలను తగ్గించేందుకు, కొత్తవాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు కేంద్ర రవాణా, ఆర్థిక మంత్రిత్వ శాఖలు కసరత్తు చేస్తున్నాయి. కాలం చెల్లిన వాహనాలపై అదనపు రుసుములు విధించేలా విధాన రూపకల్పనకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు కొత్త వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు రిజిస్ట్రేషన్ రుసుములను తగ్గించాలని కూడా కేంద్ర రవాణా శాఖ భావిస్తోంది.




### పాత వాహనాలను తగ్గించేందుకు ప్రతిపాదిస్తున్న చర్యలు ఇవి..

- 15ఏళ్ల పైబడిన వాహనాలను నియంత్రించడం.
- పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు రాయితీలు.
- రెన్యువల్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.15వేల వరకు పెంపు.
- ఏడాదికి రెండు సార్లు ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు తప్పనిసరి.

### పాత వాహనాలతో ముప్పు

- 65శాతం వాయు కాలుష్యానికి పాత వాణిజ్య వాహనాలే కారకాలు.
- బీఎస్-4 తో పోలిస్తే బీఎస్-1 కంటే ముందు నాటి వాణిజ్య వాహనాలు 25రెట్లు ఎక్కువగా వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి.

- ఈనాడు, దిల్లీ



### శభాష్.. శ్రీనివాస్!

తమిళనాడు: చెట్లు పెంచడమే కాదు.. వాటి జీవితకాలాన్ని పొడిగించడం కూడా ఎంతో ముఖ్యమని చాటిచెబుతున్నారు రామనాథపురానికి చెందిన సుభాష్ శ్రీనివాసన్. అలాగని ఆయన ఎవరికీ ఎలాంటి సందేశాలివ్వరు. చెట్లకు ఇనుప మేకులుంటే వాటి జీవితకాలం తగ్గిపోతుందని.. రెండేళ్లుగా వాటికున్న మేకులను తొలగిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ఇందుకు సమయాన్ని కేటాయిస్తుంటారు. మేకులు పెకలించే సుత్తి, ఓ ఇనుప కడ్డీ, నిచ్చెన వంటి సామగ్రితో తన మనుమడిని వెంటబెట్టుకుని ఆయన బయల్దేరుతారు. చెట్టుకు మేకులు కనిపించిన చోట వాహనం ఆపేసి ఇలా తొలగించేస్తారు. ఇంతవరకు ఆయన పాతిక కేజీల ఇనుప మేకులను తొలగించారు.

### మహిళ పొట్టలో 1500 రాళ్లు

పంజాబ్: కిడ్నీల్లో రాళ్లుండటం సాధారణంగా వింటుంటాం. లూథియానాలోని ప్రజావైద్యశాలలో మాత్రం ఓ మహిళ కడుపులో నుంచి వైద్యులు ఏకంగా 1500 రాళ్లు తొలగించారు. మణిపూర్ వాసి ప్రేమలత మూడేళ్లుగా నొప్పితో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగింది. చివరకు లూథియానా వైద్యుడు డాక్టర్ మిల్నే వర్మ ఆమెకు ఉచితంగా శస్త్రచికిత్స చేసి రాళ్లు తొలగించారు. రాళ్లు తక్కువ పరిమాణంలో ఉండటంతో ల్యాప్రోస్కోపీ విధానంలో శస్త్రచికిత్స చేశారు. ఆమె ఆరోగ్యం క్రమేపీ కుదుటపడుతోంది.



ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి



### ఈ విగ్రహం నిమజ్జనం చేస్తే మొక్కలు మొలుస్తాయి!

కర్ణాటక: పర్యావరణ హితం కోరుతూ వినాయక చవితికి మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించడం తెలిసిందే. మంగుళూరులో నితిన్ వసు, అతని మిత్రులు మరో అడుగు ముందుకేసి వినూత్న విగ్రహాలను తయారుచేశారు. వీటిని నిమజ్జనం చేసిన తర్వాత వాటి నుంచి మొక్కలు మొలుస్తాయి. కాగితపు గుజ్జు, విత్తనాలు, కూరగాయలు, పళ్లతో వీటిని తయారు చేశారు మరి. పాత పత్రికలు, పుస్తకాల కాగితాలను రుబ్బి తయారుచేసిన గుజ్జును ఈ విగ్రహాల తయారీకి వాడారు. ఒక్కో విగ్రహంలో ఒక్కో రకం విత్తనాలను కలిపారు. నిమజ్జనం చేశాక.. ఈ విగ్రహం నీటిలో కరిగిపోయి మొక్కలు మొలుస్తాయని నితిన్ వసు తెలిపారు.

## ఈనాడు బిజినెస్

| సెన్సెక్స్ ▼ 383 | నిఫ్టీ ▼ 98 |
|---|---|
| 37069 | 10948 |

| డోజోన్స్ ▲ 353 | నాస్‌డాక్ ▲ 124 |
|---|---|
| 26399 | 7981 |

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

| రూపాయి ▼ | ముడిచమురు ▲ |
|---|---|
| 71.80 03పైసలు | 61.09 |
| (ఒక అమెరికా డాలరుకు) | (బ్రెంట్ ధర డాలర్లలో) |

**ఘనం (+)** **గ్రహణం (-)**

| నిఫ్టీ | 29న | మార్పు% | నిఫ్టీ | 29న | మార్పు% |
|---|---|---|---|---|---|
| SUN PHARMA | 434.65 | 5.22 | SBI | 274.50 | -3.65 |
| BHARTI INFRATEL | 258.45 | 3.88 | YES BANK | 57.40 | -3.53 |
| JSW STEEL | 211.95 | 3.01 | HDFC | 2128.45 | -2.68 |
| NTPC | 123.10 | 2.67 | AXIS BANK | 661.15 | -2.51 |
| VEDANTA | 135.75 | 2.57 | KOTAK MAHI BANK | 1450.85 | -2.21 |
| COAL INDIA | 189.00 | 2.13 | M&M | 528.00 | -2.17 |
| ONGC | 123.25 | 1.69 | ICICI BANK | 404.40 | -2.07 |



**29న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) కోడిగుడ్లు** (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 327 | నమక్కల్ | 356 |
| చిల్లరగా (ఒక గుడ్డు) | 3.85 | 30వ తేదీకి | |
| బెంగళూరు | 345 | వరంగల్ | 330 |
| | | విశాఖపట్నం | 361 |
| విజయవాడ | 340 | చెన్నై | 360 |
| గోదావరి | 340 | చిత్తూరు | 353 |

# 100 నోటు తళతళ

- నోట్లపై వార్నిష్ పూత!
- త్వరలో ఫేస్‌బుక్, ట్విటర్‌లోకి ఆర్‌బీఐ
- రూ.500 నోటుకే ఎక్కువ గిరాకీ
- పెరిగిన నగదు చెలామణీ
- మాంద్యంపై ఆందోళన వద్దు
- ప్రైవేటు పెట్టుబడులు పెంచుకోవాలి
- బ్యాంకు మోసాలు రూ.71,543 కోట్లు

**ఆర్‌బీఐ వార్షిక నివేదిక**



ముంబయి: వంద రూపాయల నోట్లు మెరవనున్నాయి. ఈ నోట్ల మన్నికను పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) చర్యలు చేపట్టనుంది. ప్రయోగాత్మకంగా ఈ నోట్లపై వార్నిష్ పూత వేయనున్నట్లు గురువారం తన వార్షిక నివేదిక(2018-19)లో తెలిపింది. వార్నిష్ కారణంగా రూ.100 నోట్లు మెరుపును సంతరించుకుంటాయని వెల్లడించింది.

అలాగే యువతకు చేరువకావాలని ఆర్‌బీఐ భావిస్తోంది. తన పనితీరు, విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఆర్‌బీఐ, గవర్నర్‌ల పేరిట వేర్వేరు ఖాతాలను తెరవనున్నట్లు తెలిపింది. ఇంకా వివిధ అంశాలపై వార్షిక నివేదికలో ఆర్‌బీఐ ఏమంటోందంటే..

**17% పెరిగిన నగదు చెలామణీ:** డిజిటల్ చెల్లింపుల వైపు గట్టి ప్రయత్నాలు జరుగుతున్నా.. మార్చి 2019 నాటికి నగదు చెలామణీ 17 శాతం దాకా పెరగడం గమనార్హం. రూ.500 నోటుకే ఎక్కువ గిరాకీ ఉంది. చెలామణీలో ఉన్న నగదులో అది 51 శాతం వాటా కలిగి ఉంది. జూన్ 2018 చివరకు రూ.500 నోట్ల వాటా 42 శాతంగా ఉండగా.. రూ.2000 నోట్లు కూడా అంతే వాటాను కలిగి ఉన్నాయి. అయితే మార్చి 2019 నాటికి చెలామణీలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ, పరిమాణం వరుసగా 17%, 6.2% చొప్పున పెరిగి రూ.21.10 లక్షల కోట్లు; 10875.9 కోట్ల కు చేరాయి.

**మోసాలు 15 శాతం పెరిగాయ్:** గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు మోసాలు అంతక్రితం ఏడాదితో పోలిస్తే 15 శాతం పెరిగాయి. అదే మోసాలకు సంబంధించిన నగదు మొత్తం మాత్రం 73.8 శాతం పెరిగింది. 2018-19లో 6,801 మోసాలు జరిగాయి. వీటిలో రూ.71,542.93 కోట్ల మేర చిక్కుకుంది. అంతక్రితం ఏడాది రూ.41,167.04 కోట్ల మోసాలు జరిగాయి. 5,916 కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే అధిక మోసాలు జరగ్గా.. ఆ తర్వాతి స్థానాల్లో ప్రైవేటు రంగ, విదేశీ బ్యాంకులున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.64,509.43 కోట్ల విలువైన 3,766 కేసులు నమోదయ్యాయి. అంతక్రితం రూ.38,260.8 కోట్లకు సంబంధించి 2,885 కేసులున్నాయి. విచిత్రం ఏమిటంటే.. మోసం జరిగిన తేదీ.. అది కనిపెట్టిన తేదీకి మధ్య సగటున 22 నెలల గడువు కనిపించింది. కాగా, రూ.100 కోట్లు అంత కంటే ఎక్కువ పైబడిన మొత్తాలున్న మోసాలను కనిపెట్టడానికి 55 నెలల సమయం పట్టింది.

**భారీ మౌలిక వ్యయాలు అవసరం..:** కచ్చితంగా సమస్య ఏమిటన్నది గుర్తించడం 'క్లిష్టమైనదే'. ఒక చక్రీయ గమనంలో వృద్ధి కిందకు వచ్చిందా.. లేదా నిర్మాణాత్మక మందగమనంతో మనం పోరాడుతున్నామా అన్నది కీలక ప్రశ్న. చూస్తుంటే ఇది చక్రీయ గమనంలో ఊగిసలాడే వృద్ధి ఈ సారి కిందకు వచ్చినట్లు అనిపిస్తోంది. కాబట్టి ఇపుడు వినియోగాన్ని, ప్రైవేటు పెట్టుబడులను పెంచడమే అందరికీ 'అత్యంత ప్రాధాన్యం'గా ఉండాలి. బ్యాంకింగ్, బ్యాంకింగేతర రంగాలను బలోపేతం చేయడం ద్వారా ఇది చేయవచ్చు. అదే సమయంలో మౌలిక వ్యయాలు భారీగా చేయాలి. కార్మిక చట్టాలు, పన్ను, ఇతర చట్ట సంస్కరణలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. అంచనా కంటే ఎక్కువగా గిరాకీ బలహీనపడింది. రైతు రుణ మాఫీలు, ఏడో వేతన సంఘ నివేదిక అమలు, వివిధ ఆదాయ మద్దతు పథకాలు కలిసి ద్రవ్య ఉద్దీపనలు ఇచ్చే సామర్థ్యాన్ని తగ్గించాయి. అయితే మెరుగైన రుతుపవనాల వల్ల ద్రవ్యోల్బణం అదుపులో ఉండొచ్చని.. మొత్తం మీద స్థూల ఆర్థిక స్థిరత్వం కనిపిస్తుండడం సానుకూలాంశమేనని అంటున్నారు.

**వాణిజ్య రుణాలు 20% కిందకు:** ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూప్ వల్ల వచ్చిన ప్రతికూలతలతో వాణిజ్య రంగానికి బ్యాంకింగేతర రుణదాతల నుంచి వెళ్లే రుణాలు 20 శాతం మేర తగ్గాయి. 2018-19లో ఎన్‌బీఎఫ్‌సీల నుంచి వాణిజ్య రుణాలు రూ.11.60 లక్షల కోట్ల నుంచి రూ.9.34 లక్షల కోట్లకు తగ్గాయి. ఈ క్షీణత 2019-20 తొలి త్రైమాసికంలోనూ కొనసాగింది.

**అత్యవసర నిధి తగ్గింది:** జూన్ 30 నాటికి రిజర్వ్ బ్యాంక్ ఆగంతుక నిధి రూ.1.96 లక్షల కోట్లకు తగ్గింది. ప్రభుత్వానికి అదనంగా రూ.52,000 కోట్లు ఇవ్వడం ఇందుకు నేపథ్యం.

**స్థూల మొండి బకాయిలు 9.1 శాతానికి:** బ్యాంకుల్లో ఒత్తిడిలో ఉన్న ఆస్తులను ముందస్తుగా గుర్తించడం వల్ల 2018-19 నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 9.1 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇవి 11.2 శాతంగా ఉన్నాయి.

# ప్రైవేటు చేతికే ఎయిరిండియా

కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఎయిరిండియా ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఈ సంస్థను కొనుగోలుచేయడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. ఆయన గురువారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు కూడా కాకముందే ఇందుకు సంబంధించిన ప్రయత్నాలన్నీ కొనసాగిస్తోందని, అతి స్వల్పకాలంలోనే చాలా మంది ఎయిరిండియా కొనుగోలుకు ముందుకొచ్చారని పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియను కేంద్రహోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం పర్యవేక్షిస్తోందని చెప్పారు. పౌరవిమానయానశాఖ రూపొందించిన ప్రతిపాదనపై ఈ మంత్రివర్గ ఉపసంఘం వచ్చే 15 రోజుల్లో సమావేశమై చర్చిస్తుందన్నారు. పౌరవిమానయానరంగంలోకి 100% ఎఫ్‌డీఐలకు తాము సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ సంస్థ నుంచి పూర్తిగా వైదొలగాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.

**రుణం రూ.60వేల కోట్లు:** ఎయిరిండియాపై రుణ భారం రూ.58-60 వేల కోట్లమేర ఉన్నట్లు ఆ సంస్థ సీఎండీ అశ్వనీ లోహానీ తెలిపారు. ఇదే ప్రస్తుతం సంస్థ ముందున్న అతిపెద్ద సవాలని అన్నారు. సంస్థ నిర్వహణ నష్టం ఏప్రిల్-జులై మధ్యకాలంలో రూ.170 కోట్లకు చేరిందని, గత ఏడాది వచ్చిన రూ.802 కోట్ల నష్టంతో పోలిస్తే ఇది చాలా తక్కువని ఆయన అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 2 నుంచి ఎయిరిండియా విమానాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులను పూర్తిస్థాయిలో నిషేధిస్తామన్నారు.

**అన్ని ఎయిర్‌పోర్టుల్లో బాడీస్కానర్లు:** దేశంలోని అన్ని మేజర్ ఎయిర్‌పోర్టుల్లో ఏడాదిలోపు, మిగతా ఎయిర్‌పోర్టుల్లో రెండేళ్లలోపు బాడీస్కానర్ల ఏర్పాటు తప్పనిసరి చేస్తామని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ సంయుక్త డైరెక్టర్ జనరల్ జ్యోతినారాయణ్ తెలిపారు. భౌతిక తనిఖీలు లేకుండా ప్రయాణికులు వీటిగుండా నడిచిపోతే తనిఖీలు పూర్తవుతాయని, ఏదైనా శబ్దం వచ్చిన వ్యక్తులను తప్ప మిగతా ఎవ్వర్నీ సెక్యూరిటీ సిబ్బంది భౌతికంగా తనిఖీలు చేయబోరని స్పష్టంచేశారు.

# రూ.7,500 కోట్ల విక్రయాలు

- 2021కి రామ్‌కో సిమెంట్ లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: సిమెంటు ఉత్పత్తి సంస్థ రామ్‌కో సిమెంట్స్ 2020 చివరి నాటికి 2 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకోవాలని లక్ష్యం విధించుకుంది. ప్రస్తుతం ఈ సంస్థ ఉత్పత్తి సామర్థ్యం 1.25 కోట్ల టన్నులుగా ఉంది. ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు రామ్‌కో మొత్తం రూ.3,430 కోట్లను కేటాయించినట్లు, ఇందులో అధిక భాగం ఇప్పటికే ఖర్చు చేసినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్) బాలాజీ కె మూర్తి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.5,416 కోట్లుగా ఉందని, వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి విక్రయాల విలువ రూ.7,500 కోట్లకు చేరుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలోని కలవటల గ్రామంలో రూ.1,500 కోట్లతో మూడో లైన్ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఇది వచ్చే ఏడాదిలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ కొత్త ప్లాంటులో ఏడాదికి 3.15 టన్నుల సిమెంటు ఉత్పత్తి అవుతుందని, దీంతో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 10 టన్నులకు చేరుతుందని వెల్లడించారు. విశాఖపట్నంలోని గ్రైండింగ్ యూనిట్ సామర్థ్యం పెంపు కోసం రూ.2,500 కోట్లను పెట్టుబడి పెడుతున్నట్లు తెలిపారు.

### తెలుగు రాష్ట్రాల్లోకి సూపర్‌క్రీట్

ప్రీమియం సిమెంట్ విభాగంలో అధిక శక్తిమంతమైన సూపర్‌క్రీట్‌ను గురువారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విపణిలోకి విడుదల చేసింది. కాంక్రీట్‌లో పగుళ్లు ఏర్పడకుండా ఇది నిరోధిస్తుందని బాలాజీ తెలిపారు. సూపర్‌క్రీట్‌తో అన్ని అవసరాలకూ ఉపయోగపడే సిమెంట్ రకాలను అందుబాటులోకి తెచ్చినట్లయ్యిందని వెల్లడించారు. ఈ సిమెంటు అధిక నాణ్యత, మన్నికతో ఉంటుందని పేర్కొన్నారు. సాధారణ 53 గ్రేడు సిమెంటుకన్నా దీని ధర రూ.25-30 వరకూ అధికం.

# గౌతమ్ థాపర్‌పై వేటు

- ఛైర్మన్ పదవి నుంచి తొలగింపు
- సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ నిర్ణయం
- ఆర్థిక మోసం నేపథ్యం
- నేడు కొత్త ఛైర్మన్ ఎంపిక కోసం బోర్డు సమావేశం!



దిల్లీ: కంపెనీని స్థాపించిన వ్యవస్థాపకుడిని.. స్వయంగా ఆ కంపెనీయే తొలగించడం ఎక్కడా జరగదేమో. కానీ సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ విషయంలో అదే జరిగింది. వ్యవస్థాపకుడు గౌతమ్ థాపర్‌ను ఛైర్మన్ హోదా నుంచి బోర్డు తొలగించింది. కంపెనీ బోర్డు నిర్వహించిన దర్యాప్తులో కోట్ల కొద్దీ ఆర్థిక మోసం జరిగిందని బయల్పడడమే ఇందుకు నేపథ్యం. కొత్త ఛైర్మన్‌ను ఎంపిక చేయడానికి బోర్డు శుక్రవారం సమావేశమయ్యే అవకాశం ఉంది. స్వతంత్ర డైరెక్టర్లలో ఒకరిని నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమించవచ్చు.

**నోరు విప్పిన థాపర్:** ఆర్థిక అవకతవకలు జరిగినట్లుగా ఆగస్టు 20న కంపెనీ వెల్లడించినప్పటి నుంచి పెదవి విప్పని థాపర్.. 'ఏ ప్రమోటరు కానీ, ప్రమోటరు సంస్థ కానీ.. ఎటువంటి ప్రయోజనాలు పొందలేదు. అసలు ఎటువంటి మోసం జరగలేద'ని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆగస్టు 19, 2019న జరిగిన బోర్డు సమావేశం అనంతరం వెలువడ్డ వివరాలు నన్ను కలిచివేశాయి. అసలు ఆ నివేదికల్లో ఎటువంటి నిజాలు లేవు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, అందరు వాటాదార్ల ప్రయోజనాల నేపథ్యంలో నేను నోరు విప్పుతున్నాను. బ్యాంకుల నుంచి తీసుకున్న నిధుల్లో కానీ, సీజీ వద్ద ఉన్న నిధుల విషయంలో కానీ ఎటువంటి అవకతవకలు జరగలేదు. అంతర్గత కార్పొరేట్ లావాదేవీలన్నీ బోర్డు అనుమతి తర్వాత జరిగినవే'నని థాపర్ అందులో వివరించారు. 2015 నుంచి బ్యాంకులకు రూ.4,000 కోట్లు చెల్లించిన ప్రమోటర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మోసం చేయరు. 'దర్యాప్తు'లో పాల్గొనడానికి నాకు అవకాశం ఇవ్వలేదు. 'నివేదిక' విషయంలోనూ అదే జరిగింది. ఇదే విషయాన్ని ఆగస్టు 30, 2019(నేడు)న జరిగే బోర్డు సమావేశంలో పునరుద్ఘాటిస్తాన'ని ఆయన అన్నారు.

**పూర్తిగా కొత్త యాజమాన్యం!:** కాగా, కంపెనీని పూర్తిగా కొత్త యాజమాన్యం నిర్వహించాలన్న వాటాదార్లు, రుణదాతల కోరిక మేరకే తాజా పరిణామం చోటు చేసుకుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. తొలి అడుగుగా థాపర్‌ను తొలగించినట్లు వివరిస్తున్నారు. కాగా, థాపర్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతారు.

**8500 షేర్లే..:** కంపెనీలో మొత్తం 62.6 కోట్ల షేర్లుండగా.. థాపర్‌కు కేవలం 8574 షేర్లే ఉన్నాయి. ఈ వాటాతో బోర్డులో స్థానం లభించకపోవచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**ఇదీ జరిగింది..:** కొన్ని లావాదేవీలు మోసపూరితంగా కనిపిస్తున్నాయని.. వాటిపై మరింత దర్యాప్తు చేయాల్సి ఉందని గత వారం సీజీ పవర్ ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో తెలిపింది. 'కంపెనీకి చెందిన ప్రస్తుత, గత ఉద్యోగులు(నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, కీలక యాజమాన్య వ్యక్తులు) కలిసి కంపెనీలోని కొన్ని ఆస్తులను హామీగా పెట్టి రుణాలు తెచ్చుకున్నారు. వీటికి ఎటువంటి అనుమతులు లేవు. ఇలా సమీకరించిన నిధులు కంపెనీ బయటకు వెళ్లాయి. ఇలా రెండేళ్ల నుంచి జరుగుతోంది. మార్చి 31, 2018 నాటికి సంబంధం లేని వారికి కంపెనీ, గ్రూప్ నుంచి వరుసగా రూ.1,990.36 కోట్లు; రూ.2,806.63 కోట్లు వెళ్లాయి. ఏప్రిల్ 1, 2017 నాటికి రూ.1479.34 కోట్లు; రూ.1,331.47 కోట్లు వెళ్లాయి. వీటన్నిటినీ వడ్డీతో పాటు రికవరీ చేయడానికి యత్నాలు సాగిస్తున్నాం. అదే సమయంలో కంపెనీ, గ్రూప్‌నకు ఉన్న మొత్తం రుణాలను మార్చి 31, 2018 నాటికి వరుసగా రూ.1053.54 కోట్లు; రూ.1,608.17 కోట్లు చొప్పున తక్కువ చేసి చూపారు. ఏప్రిల్ 1, 2017 నాటికి రూ.601.83 కోట్లు; రూ.401.83 కోట్లు చొప్పున తక్కువ చేసి చూపార'ని ఆ సమాచారంలో పేర్కొంది.

# నేటి నుంచి హైటెక్స్‌లో ఆక్వా ఆక్వారియా

ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి

హైదరాబాద్ (మాదాపూర్), న్యూస్‌టుడే: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎంపెడా ఆధ్వర్యంలో ఆక్వాఆక్వారియా ఇండియా 2019 పేరిట మూడు రోజుల ప్రదర్శన శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలకు చెందిన పశుసవర్ధక శాఖ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మోపిదేవి వెంకటరమణలు హాజరుకానున్నారని మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ(ఎంపెడా) ఛైర్మన్ కె.ఎస్.శ్రీనివాస్ చెప్పారు. ప్రదర్శనలో భాగంగా వివిధ రకాల చేపలు, రొయ్యలు సైతం ఇక్కడ ఉంచి వాటి పెంపకంలో వచ్చిన ఆధునిక పద్ధతుల గురించి రైతులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఆక్వాకల్చర్‌లో వస్తున్న సరికొత్త పరిజ్ఞానం, సవాళ్లు వంటి అనేక విషయాలపై రైతులు అవగాహన పెంచుకునేందుకు ప్రదర్శన ఎంతో దోహదం చేస్తుందన్నారు. అలాగే రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వాకల్చర్ సొసైటీ "స్వదేశీ పెరల్ "పేరిట సరికొత్త అర్టిమియను తయారు చేసిందని, దీన్ని ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

- ✦ గత ఆర్థిక సంవత్సరానికి ఏజీఎం నిర్వహించేందుకు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి డిసెంబరు 30 వరకు గడువును పొందినట్లు **కాక్స్ అంగ్ కింగ్స్** తెలిపింది.
- ✦ ఎస్సెల్ గ్రీన్ ఎనర్జీ, ఎస్సెస్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్‌కు చెందిన 205 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను రూ.1300 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు **అదానీ గ్రీన్ ఎనర్జీ** వెల్లడించింది.
- ✦ ప్రైవేట్ ప్లేస్‌మెంట్‌లో బాండ్ల జారీద్వారా రూ.10,000 కోట్ల సమీకరణకు వాటాదార్ల అనుమతి పొందినట్లు **పవర్‌గ్రిడ్** తెలిపింది.

# త్వరలో భారత్‌లోనూ ఆన్‌లైన్ అమ్మకాలు: యాపిల్

దిల్లీ: భారత్‌లో ఆన్‌లైన్ అమ్మకాలతో పాటు సంప్రదాయ విక్రయశాలలు కూడా ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేశామని అమెరికా సాంకేతిక దిగ్గజం యాపిల్ వెల్లడించింది. ఏక బ్రాండ్ రిటైల్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) నిబంధనలను ప్రభుత్వం సడలించిన మరుసటి రోజే యాపిల్ ఈ ప్రకటన చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు తొలుత 'యాపిల్ ఆన్‌లైన్ స్టోర్' ద్వారానే దేశీయంగా అమ్మకాలు చేపట్టే అవకాశం ఉంది. తదుపరి విదేశాల్లో ఏర్పాటు చేసిన తరహాలోనే దేశీయంగా సొంత విక్రయశాలలు నెలకొల్పుతుంది.

# భాగస్వామ్య సంస్థలో వాటా విక్రయం: గ్రాన్యూల్స్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఔషధాల తయారీ సంస్థ అయిన గ్రాన్యూల్స్ ఇండియా తన భాగస్వామ్య సంస్థలో వాటా విక్రయించనుంది. కొన్నేళ్ల క్రితం గ్రాన్యూల్స్ ఇండియా, బెల్జియం సంస్థ అయిన ఎస్ఏ అజినోమోటో ఓమ్నికెమ్ ఎన్‌వీ తో కలిసి సమాన వాటా కల సంయుక్త సంస్థను నెలకొల్పిన విషయం విదితమే. ఈ సంయుక్త సంస్థ విశాఖపట్నం కేంద్రంగా ఔషధ తయారీ కార్యకలాపాలు సాగిస్తోంది. దీన్లో తనకు ఉన్న 50 శాతం వాటాను ఈ సంస్థలో మిగిలిన వాటా కలిగి ఉన్న అజినోమోటో ఓమ్నికెమ్ ఎన్‌వీ కే విక్రయించాలని గ్రాన్యూల్స్ ఇండియా తాజాగా నిర్ణయించింది. తమ ప్రధాన వ్యాపారం మీద దృష్టి కేంద్రీకరించాలనే లక్ష్యంతో సంయుక్త కంపెనీలో వాటా విక్రయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు గ్రాన్యూల్స్ ఇండియా పేర్కొంది. ఎంత ప్రతిఫలానికి తన వాటా వదులుకుంటున్నదీ గ్రాన్యూల్స్ ఇండియా వెల్లడించలేదు. వాటా విక్రయం తర్వాత ఈ భాగస్వామ్య సంస్థ పూర్తిగా అజినోమోటో ఓమ్నికెమ్ చేతికి వెళ్లిపోతుంది.

# ప్రమోద్ చంద్ర పదవీకాలం పొడిగింపు



సీబీడీటీ ఛైర్మన్ ప్రమోద్ చంద్ర మోదీ

దిల్లీ: కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఛైర్మన్ ప్రమోద్ చంద్ర మోదీ పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఆగస్టు 31న ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉండగా.. మరో ఏడాది పాటు సీబీడీటీ ఛైర్మన్‌గా కొనసాగే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు ఆయన పునర్నియామకానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని నియామకాలపై ఏర్పాటైన మంత్రివర్గ కమిటీ ఆమోదం తెలిపింది.

# అంకురాలకు పెట్టుబడులు

టి-ఏంజెల్ కార్యక్రమాన్ని ప్రారంభించిన టి-హబ్

హైదరాబాద్ (రాయదుర్గం), న్యూస్‌టుడే: అంకురాలకు పెట్టుబడులు అందించి, ప్రోత్సహించేందుకు టి-హబ్ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ టి-ఏంజెల్ ప్రోగ్రామ్‌లో భాగంగా టి-హబ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కలిసి లెట్స్ వెంచర్ సహకారంతో దీన్ని రూపొందించాయి. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, టి-హబ్ సీఈఓ రవి నారాయణ్ కలిసి దీన్ని ప్రారంభించారు. టి-హబ్‌లో ఉన్న అంకురాలకే కాకుండా దేశంలో ఎక్కడినుంచైనా దీనికోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబరు 30 వరకూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అందులో నుంచి 30 సంస్థలను ఎంపిక చేస్తారు. వీటిలో నుంచి మొదటి పది సంస్థలను లెట్స్ వెంచర్‌లో నమోదు చేస్తారు. అక్కడ్నుంచి పెట్టుబడిదారులు ఆయా సంస్థల్లో పెట్టుబడి పెట్టవచ్చు. ఆరోగ్య సంరక్షణ; స్థిరాస్తి, వినోదం, క్రీడలు, విద్య, ఆర్థిక అంశాల్లో సరికొత్త ఆవిష్కరణలు, ఆలోచనలతో ముందుకు వచ్చిన అంకురాలకు ఈ కార్యక్రమంలో ప్రాధాన్యం లభిస్తుంది.

# నరిషర్ నుంచి రొయ్యల మేత

ఈనాడు, హైదరాబాద్: పశువులు, కోళ్ల దాణాను ఉత్పత్తి చేసే నరిషర్ (అన్‌మోల్ ఫీడ్స్) కొత్తగా చేపలు, రొయ్యల మేత విభాగంలోకి ప్రవేశించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి తాజాగా రెండు కొత్త ఉత్పత్తులను విడుదల చేసింది. చేపల కోసం మత్స్య బంధు, రొయ్యలకు లాటిస్ గోల్డ్ పేర్లతో ఈ అధిక మాంసకృత్తులు ఉన్న మేతను తీసుకొచ్చింది. ప్రస్తుతం రూ.600 కోట్ల విక్రయాలు సాధించిన ఈ సంస్థ మరో రెండేళ్లలో ఈ మొత్తాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ఉంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అన్‌మోల్ ఫీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ సరావ్‌గి మాట్లాడుతూ.. పరిస్థితులు అనుకూలిస్తే తెలుగు రాష్ట్రాల్లో ఒక ప్లాంటును పెట్టేందుకు యోచిస్తున్నట్లు, దీనికోసం రూ.50 కోట్ల వరకూ పెట్టుబడి పెడతామని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణలో మార్కెటింగ్ కోసం 30 మందిని నియమించుకున్నట్లు చెప్పారు.

# బ్యాంకోత్పాతం

- దిగ్గజ బ్యాంకుల షేర్లు డీలా
- బ్యాంక్ నిఫ్టీ 500 పాయింట్లు పతనం
- ఆజ్యం పోసిన ప్రపంచ మార్కెట్లు
- 383 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



**సమీక్ష**

బ్యాంకింగ్ షేర్లు బేర్‌మన్నాయ్. ఆగస్టు కాంట్రాక్టుకు చివరి రోజున తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. యెస్ బ్యాంక్ షేరు యథావిధిగా తన నష్టాలకథ వినిపించగా.. ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాంటి దిగ్గజ షేర్లు దానికి వంతపాడాయి. ఈ ప్రభావంతో బ్యాంక్ నిఫ్టీ సూచీ దిగాలుపడింది. 500 పాయింట్లు పతనమైంది. ఈ సెగ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలకూ తాకింది. సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా రెండో రోజూ నష్టాలను మూటకట్టుకున్నాయి. ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో కదలాడటం, అంతర్జాతీయ మాంద్యం భయాలు, అమెరికా- చైనాల మధ్య వాణిజ్య యుద్ధ ఉద్రిక్తతలు లాంటివి కూడా మదుపర్లను కొనుగోళ్లకు దూరం చేశాయి.

### నష్టారంభం..

ఉదయం సెన్సెక్స్ 37,381.80 పాయింట్ల వద్ద నష్టాలతోనే ఆరంభమైంది. ఆ తర్వాత కూడా అదే ధోరణిని కొనసాగించింది. ఆగస్టు డెరివేటివ్ కాంట్రాక్టుకు గడువు తీరిపోనుండటంతో సూచీలు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. ఈ క్రమంలోనే మధ్యాహ్నం కొంత షార్ట్‌కవరింగ్ రావడంతో సూచీ కాస్త పుంజుకున్నట్లే కనిపించింది. అయినప్పటికీ మళ్లీ అమ్మకాలు వెల్లువెత్తడంతో 36,987.35 స్థాయికి పడిపోయింది. చివరకు 382.91 పాయింట్లు నష్టపోయి 37,068.93 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 97.80 పాయింట్లు కోల్పోయి 10,948.30 వద్ద స్థిరపడింది.

**సెన్సెక్స్‌లో...:** సెన్సెక్స్ 30లో 21 షేర్లు డీలాపడగా.. తొమ్మిది మాత్రమే రాణించగలిగాయి. అత్యధికంగా నష్టపోయిన వాటిల్లో మళ్లీ యెస్‌బ్యాంక్ షేరే ముందు వరుసలో నిలిచింది. 3.61% వరకు పతనమైంది. ఎస్‌బీఐ 3.6%, హెచ్‌డీఎఫ్‌సీ 2.69%, యాక్సిస్ బ్యాంక్ 2.53%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.24%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.17% మేర కుంగాయి. సన్‌ఫార్మా 5.31% మేర దూసుకెళ్లగా.. వేదాంతా, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్ షేర్లు 0.5- 2.72% వరకు పెరిగాయి.

**రంగాల సూచీలు..:** బీఎస్ఈ రంగాల సూచీల్లో బ్యాంకెక్స్, ఆర్థిక, వాహన, ఎఫ్ఎంసీజీ సూచీ 1.92% కుదేలయ్యాయి. ఆరోగ్య సంరక్షణ, లోహ, స్థిరాస్తి, విద్యుత్, చమురు-గ్యాస్, టెలికాం షేర్లు 1.5% మేర రాణించాయి. బీఎస్ఈ మధ్యతరహా కంపెనీల (మిడ్‌క్యాప్) సూచీ, చిన్న తరహా కంపెనీల సూచీ (స్మాల్‌క్యాప్)లు కూడా 0.62% మేర నష్టపోయాయి.

**ప్రపంచ మార్కెట్లు..:** ఆసియా మార్కెట్లలో భారత స్టాక్ మార్కెట్లతో పాటు హాంగ్‌సెంగ్ (హాంకాంగ్), కోస్పి (కొరియా), నిక్కీ (జపాన్) సూచీలు నష్టాలతో ముగిశాయి. చైనా మార్కెట్లు మాత్రం (షాంఘై) లాభాలతో ముగియడం గమనార్హం.

**ఆ షేరు డీలా.. ఈ షేరుకు కళ:** నిఫ్టీ 50 సూచీ నుంచి ఇండియా బుల్స్ హౌసింగ్‌ను తొలగించనున్నారన్న కారణంతో ఆ కంపెనీ షేరు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యింది. ఎన్ఎస్ఈలో షేరు 7.97% పతనమై రూ.420.80 వద్ద ముగిసింది. మరోవైపు ఇండియా బుల్స్ హౌసింగ్ స్థానంలో చేర్చనున్న నెస్లే షేరుకు కొనుగోళ్ల కళ సంతరించుకుంది. ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ షేరు 2.97% వరకు లాభపడి రూ.12,890 వద్ద స్థిరపడింది.

# ఛాంపియన్



దీపా మలిక్

## 'అర్జున' అందుకున్న సాయిప్రణీత్



దిల్లీ

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సరికొత్త చరిత్ర సృష్టించిన తెలుగు షట్లర్ సాయి ప్రణీత్ గురువారం అర్జున పురస్కారం అందుకున్నాడు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అతను పురస్కారాన్ని స్వీకరించాడు. మరోవైపు 2016 రియో పారాలింపిక్స్ రజత విజేత దీపా మలిక్ అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు సొంతం చేసుకుంది. ఖేల్‌రత్నకు ఎంపికైన రెజ్లర్ బజరంగ్ పునియా ప్రస్తుతం రష్యాలో సాధన చేస్తున్న కారణంగా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయాడు. క్రికెటర్ రవీంద్ర జడేజాతో పాటు వివిధ టోర్నీల్లో ఆడుతున్న కొందరు క్రీడాకారులు అర్జున పురస్కారాలు అందుకోలేకపోయారు.

**ఆర్డీటీకి రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్:** రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ అవార్డును అందుకుంది. అనంతపురంలో ఆర్డీటీ 90 కేంద్రాల్లో పేద, మధ్య తరగతి వర్గ పిల్లలకు క్రీడల్లో శిక్షణ అందిస్తోంది. హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, జూడో, సాఫ్ట్‌బాల్, ఖో ఖో, కబడ్డీ క్రీడల్లో 11 వేల మందికి పైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఆర్డీటీ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్‌ను ప్రకటించింది. ఆర్డీటీ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పురస్కారాన్ని అందజేశారు. ఇదే విభాగంలో గగన్ నారంగ్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌కూ అవార్డు లభించింది.



అవార్డుతో ఫెర్రర్

**రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న:** దీపా మలిక్, బజరంగ్ పునియా;

**అర్జున అవార్డు:** రవీంద్ర జడేజా, మహమ్మద్ అనాస్ (అథ్లెటిక్స్), గుర్‌ప్రీత్ సింగ్, సోనియా లాథర్, చింగ్లెన్‌సనా సింగ్ (హాకీ), భాస్కరన్ (వెయిట్‌లిఫ్టింగ్), అజయ్ ఠాకూర్, అంజుమ్ మోద్గిల్, సాయి ప్రణీత్, తేజిందర్ పాల్ సింగ్, ప్రమోద్ భగత్ (పారా బ్యాడ్మింటన్), హర్మీత్ రాజుల్ దేశాయ్ (టేబుల్ టెన్నిస్), పూజ దండ (రెజ్లింగ్), ఫయాద్ మీర్జా (ఈక్వెస్ట్రియన్), సిమ్రాన్ సింగ్ (పోలో), పూనమ్ యాదవ్, స్వప్న బర్మాన్, సుందర్ సింగ్ (పారా అథ్లెటిక్స్), గౌరవ్ సింగ్ గిల్ (మోటార్ స్పోర్ట్స్)

**ద్రోణాచార్య (రెగ్యులర్):** మొహిందర్ సింగ్ (అథ్లెటిక్స్), సందీప్ గుప్తా (టేబుల్ టెన్నిస్), విమల్ కుమార్ (బ్యాడ్మింటన్);

**ధ్యాన్‌చంద్ అవార్డు:** మనోజ్ కుమార్ (రెజ్లింగ్), లాల్రెమ్‌సంగ (ఆర్చరీ), అరుప్ బాసక్ (టేబుల్‌టెన్నిస్), నితిన్ కీర్తనే (టెన్నిస్), ఫ్రెడ్రిక్స్ (హాకీ)

---

దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు టీమ్‌ఇండియా



## ధోని లేకుండానే

**దిల్లీ:** దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీకి చోటు దక్కలేదు. మూడు టీ20ల సిరీస్ కోసం గురువారం సెలక్షన్ కమిటీ జట్టును ప్రకటించింది. విండీస్‌తో సిరీస్‌కు దూరమై రెండు వారాల పాటు సైన్యంలో విధులు నిర్వర్తించిన అతను ప్రస్తుతం కుటుంబంతో కలిసి యుఎస్‌లో విహరిస్తున్నాడు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకున్న సెలక్షన్ కమిటీ స్వదేశంలో జరిగే ఈ సిరీస్ కోసం ధోని పేరును ఎంపిక ప్రక్రియలో పరిగణలోకి తీసుకుందో లేదో తెలియాల్సి ఉంది. మరోవైపు విండీస్ పర్యటన నుంచి విశ్రాంతి తీసుకున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య.. సఫారీలతో సిరీస్ కోసం తిరిగి జట్టుతో చేరనున్నాడు. ఆ ఒక్క మార్పు మినహా విండీస్‌తో టీ20ల్లో తలపడిన జట్టునే కొనసాగించనున్నారు. వచ్చే నెల 15 (ధర్మశాల), 18 (మొహాలి), 22 (బెంగళూరు) తేదీల్లో సఫారీ జట్టుతో టీమ్‌ఇండియా మూడు టీ20లు ఆడనుంది. "సెలక్షన్ కమిటీ ఓ స్పష్టతతో ఉంది. ధోని రిటైర్మెంట్ గురించి అడిగే అవసరం కమిటీకి లేదు. ప్రస్తుతానికి టీమ్‌ఇండియాలో రిషబ్ పంతే అన్ని ఫార్మాట్లలో మొదటి ప్రాధాన్య వికెట్ కీపర్. పరిమిత ఓవర్ల క్రికెట్లో పంత్ తర్వాత సంజు శాంసన్, ఇషాన్ కిషన్ పేర్లను పరిశీలించే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో జట్టులో మరిన్ని మార్పులు జరగనున్నాయి. కొత్త ఆటగాళ్లకు అవకాశమిచ్చి వాళ్ల సత్తాను పరీక్షించనున్నారు. దక్షిణాఫ్రికాతో టెస్టులను దృష్టిలో ఉంచుకొని టీ20 సిరీస్‌లో బుమ్రాకు చోటివ్వలేదు" అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో జట్టు కూర్పుపై సెలక్షన్ కమిటీ ప్రత్యేక కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐతే దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత భారత్ ఆడబోయే పరిమిత ఓవర్ల క్రికెట్ మ్యాచ్‌ల కోసం ధోని జట్టులోకి వస్తాడో లేదో అనే విషయం అనుమానంగా మారింది.

**టీ20 జట్టు:** విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, కృనాల్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, రాహుల్ చాహర్, ఖలీల్ అహ్మద్, దీపక్ చాహర్, నవదీప్ సైని.

---

## రాయుడు రిటైర్మెంట్ వెనక్కి



ఈనాడు డిజిటల్, హైదరాబాద్

తెలుగు క్రికెటర్ అంబటి రాయుడు తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. ప్రపంచకప్‌లో ఆడే అవకాశం రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందిన అతను గత జులైలో క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తిరిగి పరిమిత ఓవర్ల క్రికెట్లోకి రావాలని ఉందని కొద్దిరోజుల ముందు తన అభీష్టాన్ని తెలిపాడు. తనలో ఇంకా క్రికెట్ ఆడే సత్తా ఉందని, తిరిగి జట్టులోకి వచ్చేందుకు కృషి చేస్తానని వెల్లడించాడు. అనుకున్నట్లుగానే అతను గురువారం తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. "వీడ్కోలు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నా. అన్ని ఫార్మాట్లో క్రికెట్ ఆడాలని అనుకుంటున్నా. కష్టకాలంలో నాకు మద్దతుగా నిలిచి, నాలో ఇంకా క్రికెట్ మిగిలి ఉందని నాకు తెలిసేలా చేసిన సీఎస్కే జట్టుతో పాటు మాజీ ఆటగాళ్లు వీవీఎస్ లక్ష్మణ్, నోయల్ డేవిడ్‌లకు ధన్యవాదాలు. క్రికెట్‌కు వీడ్కోలు పలకాలనే నిర్ణయం భావోద్వేగంతో తీసుకున్నది. హైదరాబాద్ తరపున తిరిగి ఆడేందుకు ఉత్సాహంగా ఉన్నా. జట్టు పూర్తిస్థాయిలో సత్తా చాటేందుకు తోడ్పాటు అందిస్తా. జట్టుతో చేరేందుకు వచ్చే నెల 10 నుంచి అందుబాటులో ఉంటా' అని బీసీసీఐ, హెచ్‌సీఏకు పంపిన లేఖలో రాయుడు పేర్కొన్నాడు. "రాయుడు తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. 2019-20 సీజన్‌కు గాను హెచ్‌సీఏ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు అందుబాటులో ఉండనున్నాడు" అని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఓ ప్రకటన విడుదల చేసింది. గత నాలుగేళ్ల నుంచి ప్రపంచకప్ కోసం కష్టపడినా జట్టులో చోటు దక్కకపోవడంతో రాయుడు అప్పటికప్పుడు క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. తన నిర్ణయంపై పునరాలోచించిన అతను.. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో తిరిగి క్రికెట్లోకి అడుగుపెడుతున్నాడని సమాచారం.

---

## కళ్లన్నీ పంత్‌పైనే!



వెస్టిండీస్‌తో రెండో టెస్టు నేటి నుంచే

**జోరును కొనసాగిస్తూ కరీబియన్ పర్యటనను అజేయంగా ముగించాలనే ఉత్సాహంతో భారత్ ఉంటే... సొంతగడ్డపై కనీసం ఒక్క మ్యాచైనా నెగ్గి పరువు నిలబెట్టుకోవాలని వెస్టిండీస్ భావిస్తోంది. నేటి నుంచే చివరిదైన రెండో టెస్ట్. పేలవ ప్రదర్శనతో ఆతిథ్య జట్టు ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోతున్న నేపథ్యంలో కోహ్లిసేనే తిరుగులేని ఫేవరెట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే అందరి దృష్టి మాత్రం అంచనాలను అందుకోవడంలో విఫలమవుతున్న రిషబ్ పంత్‌పైనే.**

కింగ్‌స్టన్

కరీబియన్ పర్యటనలో ఆఖరి సమరానికి టీమ్‌ఇండియా సిద్ధమైంది. క్లీన్‌స్వీపే లక్ష్యంగా.. శుక్రవారం ఆరంభమయ్యే రెండో టెస్టులో విండీస్‌ను ఢీకొంటుంది. తొలి టెస్టులో 318 పరుగుల తేడాతో నెగ్గిన భారత్‌ను అడ్డుకోవడం వెస్టిండీస్‌కు పెను సవాలే. కోహ్లీసేన.. టీ20 సిరీస్‌ను 3-0తో, వన్డే సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

**పంత్‌కు పరీక్ష:** ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్న భారత్ జట్టులో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. పేలవ ఫామ్‌లో ఉన్న వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ పంత్‌కు ఈ మ్యాచ్ పరీక్షే. టీమ్ మేనేజ్‌మెంట్ తనపై పెట్టిన నమ్మకానికి తగినట్లుగా అతడు ఆడలేకపోతున్నాడు. పంత్ వైఫల్యం కంటే.. నిర్లక్ష్యంగా అతడు ఔటవుతున్న తీరే జట్టు మేనేజ్‌మెంట్‌కు అసహనం కలిగిస్తోంది. 0, 4, 65 నాటౌట్, 20, 0, 24, 7.. ఇవి ఈ పర్యటనలో పంత్ స్కోర్లు. ఇప్పటికే సీనియర్ వికెట్‌కీపర్ వృద్ధిమాన్ సాహా జట్టులో ఉండడంతోపాటు కోన భరత్ లాంటి వికెట్‌కీపర్లు అవకాశం కోసం గట్టిగా పోటీ పడుతున్న నేపథ్యంలో గాడిన పడకపోతే పంత్‌కు ఇబ్బందులు తప్పవు. ఇక తొలి టెస్టులో రాణించలేకపోయిన పుజారా.. ఈ మ్యాచ్‌తో సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నాడు. అర్ధసెంచరీ, సెంచరీతో రహానె ఫామ్‌ను అందుకోవడం, విహారి చక్కటి బ్యాటింగ్‌తో తన ఎంపికకు న్యాయం చేసిన నేపథ్యంలో అవకాశం కోసం రోహిత్ శర్మ నిరీక్షించక తప్పదు. ఇక బుమ్రా, ఇషాంత్, షమిలతో కూడిన భారత పేస్ బౌలింగ్ బలంగా కనిపిస్తోంది. ముఖ్యంగా బుమ్రా నుంచి విండీస్ బ్యాట్స్‌మెన్‌కు కఠిన పరీక్ష తప్పదు.

**విండీస్‌కు కష్టమే..:** పేలవ ఫామ్‌లో ఉన్న వెస్టిండీస్‌పై పెద్దగా అంచనాలేమీ లేవు. దృఢ సంకల్పం లోపించిన ఆ జట్టుకు కోహ్లీసేనను నిలువరించడం కష్టమైన పనే. మొదటి టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒక్క విండీస్ బ్యాట్స్‌మన్ కూడా అర్ధసెంచరీ చేయలేకపోయాడంటేనే ఆ జట్టు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొత్త బంతి బౌలర్లు షానోన్ గాబ్రియల్, కీమర్ రోచ్‌లు రాణిస్తుండడం ఒక్కటే వెస్టిండీస్‌కు సంతోషాన్నిచ్చే విషయం. అసాధారణంగా పుంజుకుంటే తప్ప సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయకుండా టీమ్ ఇండియాను అడ్డుకోవడం ఆతిథ్య జట్టుకు కష్టమే.

---

## మూడో రౌండ్లో ఫెదరర్, జకోవిచ్



న్యూయార్క్

టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్, మూడో సీడ్ రోజర్ ఫెదరర్ యుఎస్ ఓపెన్ మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు. రెండో రౌండ్లో జకోవిచ్ (సెర్బియా) 6-4, 7-6 (7-3), 6-1తో లొండెరో (అర్జెంటీనా)ను మట్టికరిపించాడు. ఏడు ఏస్‌లు కొట్టిన జకోవిచ్ ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. మరోవైపు ఫెదరర్ (స్విట్జర్లాండ్) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ తొలి సెట్‌ను కోల్పోయాడు. అతడు 3-6, 6-2, 6-3, 6-4తో జుమర్ (బోస్నియా)పై విజయం సాధించాడు. తొలి సెట్ చేజార్చుకున్నాక ఫెదరర్ బలంగా పుంజుకున్నాడు. పదునైన సర్వీసులు చేసిన అతడు మ్యాచ్‌లో 16 ఏస్‌లు సంధించాడు. ఏడో సీడ్ నిషికోరి (జపాన్), దిమిత్రోవ్ (బల్గేరియా) కూడా మూడో రౌండ్లో ప్రవేశించారు. నిషికోరి 6-2, 4-6, 6-3, 7-5తో క్లాన్ (అమెరికా)పై నెగ్గగా.. కోరిచ్ (క్రొయేషియా) నుంచి దిమిత్రోవ్‌కు వాకోవర్ లభించింది. మహిళల సింగిల్స్‌లో మూడో రౌండ్ చేరేందుకు ఎనిమిదో సీడ్ సెరెనా విలియమ్స్ (అమెరికా) కష్టపడింది. రెండో రౌండ్లో ఆమె 5-7, 6-3, 6-1తో 17 ఏళ్ల మెక్‌నాలీ (అమెరికా)పై విజయం సాధించింది. 1999లో సెరెనా తొలి గ్రాండ్‌స్లామ్ గెలిచేటప్పటికీ మెక్‌నాలీ పుట్టనేలేదు. ఆమె తొలి సెట్ గెలిచి సెరెనాను కలవరపెట్టింది. కానీ ఆ తర్వాత సెరెనా తనదైన శైలిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సెరెనా అక్క వీనస్ విలియమ్స్ మాత్రం రెండో రౌండ్ దాటలేకపోయింది. రెండో రౌండ్లో ఆమె 4-6, 4-6తో ఐదో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) చేతిలో పరాజయంపాలైంది. టాప్ సీడ్ ఒసాకా (జపాన్) అలవోకగా మూడో రౌండ్లో అడుగుపెట్టింది. రెండో రౌండ్లో ఆమె 6-2, 6-4తో లినెట్ (పోలెండ్)పై గెలిచింది. రెండో రౌండ్లో రెండో సీడ్ బార్టీ (ఆస్ట్రేలియా) 6-2, 7-6 (7-2)తో లారెన్ డేవిస్ (అమెరికా)పై నెగ్గగా.. మూడో సీడ్ ప్లిస్కోవా (చెక్) 6-1, 6-4తో బోల్క్‌వాజె (జార్జియా)ను ఓడించింది. ఆరో సీడ్ క్విటోవా (చెక్) 4-6, 4-6తో పెట్కోవిచ్ (జర్మనీ) చేతిలో కంగుతింది.

---



ప్రపంచకప్ షూటింగ్‌లో స్వర్ణం

## మెరిసిన ఎలావెనిల్

రియో డిజనీరో

ప్రపంచకప్ షూటింగ్‌లో భారత యువ షూటర్ ఎలావెనిల్ వలారివన్ సత్తా చాటింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో ఈ తమిళనాడు షూటర్ పసిడి పతకం సొంతం చేసుకుంది. క్వాలిఫయింగ్‌లో 629.4 పాయింట్లతో ఫైనల్ చేరిన ఎలావెనిల్.. తుది సమరంలో 251.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి పసిడి గెలుచుకుంది. 24 షాట్ల ఫైనల్లో గురి తప్పకుండా 10 పాయింట్లు సాధిస్తూ వచ్చిన ఎలావెనిల్.. మరో నాలుగు షాట్లు మిగిలుండగా 1.4 పాయింట్లతో ప్రత్యర్థులపై ఆధిక్యంలో నిలిచింది. ఆఖర్లో సియోనాయిడ్ (250.6, బ్రిటన్)తో పోటీ ఎదురైనా నిలిచిన ఎలావెనిల్.. స్వర్ణం గెలుచుకుంది. యంగ్ షిన్ (చైనీస్ తైపీ, 229.9 పాయింట్లు) కాంస్యం సాధించింది. ఎలావెనిల్ జూనియర్ ప్రపంచకప్ స్వర్ణ విజేతే కాక ఆసియా ఛాంపియన్ కూడా. మరో భారత షూటర్ అంజుమ్ మౌద్గిల్ (166.8) ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ ఏడాది నాలుగు ప్రపంచకప్‌లు జరగ్గా.. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో భారత్ మూడు స్వర్ణాలు గెలవడం విశేషం. పురుషుల 50 మీటర్ల ఎయిర్ రైఫిల్ 3 పొజిషన్స్ విభాగంలో సంజీవ్ రాజ్‌పుత్ రజతం నెగ్గాడు. ఫైనల్లో 152.9 పాయింట్లతో అతను రెండో స్థానంలో నిలిచాడు. దీంతో టోక్యో ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా సంపాదించాడు.

### కార్తీకకు కాంస్యం

**లఖ్‌నవూ:** అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి కార్తీక సత్తా చాటింది. మహిళల ట్రిపుల్ జంప్‌లో 12.74 మీటర్ల దూరం దూకిన కార్తీక కాంస్యం గెలుచుకుంది. ఈ విభాగంలో భైరబి రాయ్ (పశ్చిమ బంగాల్, 13.01 మీ) స్వర్ణం కైవసం చేసుకుంది.

---



**రికార్డు వేటలో కోహ్లి..**

ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే విరాట్ కోహ్లి... ధోనీని అధిగమించి అత్యంత విజయవంతమైన భారత టెస్ట్ కెప్టెనవుతాడు. కెప్టెన్‌గా ఇప్పటివరకు 47 టెస్టుల్లో 27 విజయాలు సాధించిన కోహ్లి.. ప్రస్తుతం ధోని (60 టెస్టుల్లో 27)తో సమంగా ఉన్నాడు. గంగూలీ (49 టెస్టుల్లో 21) మూడో స్థానంలో ఉన్నాడు.

రాత్రి 8 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో

**6** టెస్టుల్లో 200 వికెట్ల మైలురాయిని అందుకోవడానికి జడేజాకు కావాల్సిన వికెట్లు. 150 వికెట్లకు చేరుకోవడానికి షమికి రెండు వికెట్లు అవసరం.

## రోహిత్‌కు అవకాశం లభించదు

గౌతమ్ గంభీర్

యాషెస్ సిరీస్‌లో 'ది బెన్ స్టోక్స్ టెస్టు మ్యాచ్' నుంచి నేనింకా బయటపడలేదు. రెండు నెలల వ్యవధిలో రెండోసారి అద్భుతమైన ఇన్నింగ్స్‌తో స్టోక్స్ ఇంగ్లాండ్‌కు అండగా నిలిచాడు. ప్రపంచకప్ ఫైనల్లో అతడి ఇన్నింగ్స్‌ను ఇప్పటికీ నిర్వచిస్తూనే ఉన్నారు. అంతలోనే మూడో టెస్టులో సెంచరీ గురించి చర్చిస్తున్నాం. ఇక భారత్, వెస్టిండీస్ పోరు శుక్రవారం ప్రారంభంకానుంది. తొలి టెస్టులో మాదిరిగా పిచ్ ఫ్లాట్‌గా ఉండకపోవచ్చు. ఎస్‌జీ లేదా డ్యూక్ ఎలాంటి బంతితో ఆడినా మ్యాచ్‌లో అవకాశం లభిస్తే అశ్విన్ సంతోషపడటం ఖాయం. తొలి టెస్టులో అతడికి అవకాశం దక్కకపోవడం నిరాశ కలిగించింది. రోహిత్‌శర్మ విషయంలోనూ అంతే. అయితే జమైకాలోనూ రోహిత్‌కు అవకాశం లభించకపోవచ్చు. ప్రస్తుతానికి రహానె, విహారి తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారు. మైదానంలో ఇషాంత్‌శర్మను చూస్తుండటం ఆనందంగా ఉంది. అతను జట్టు మనిషి. రెండో టెస్టులోనూ ఇషాంత్ సత్తాచాటుతాడని అనుకుంటున్నా. బ్యాటింగ్ వైఫల్యం తొలి టెస్టులో విండీస్‌కు నష్టం చేసింది.

THE ULTIMATE INVERTER BATTERY
EXIDE INVATUBULAR

---



చాహల్

## విజృంభించిన చాహల్

### దక్షిణాఫ్రికా-ఎపై భారత్-ఎ విజయం

**తిరువనంతపురం:** లెగ్‌స్పిన్నర్ చాహల్ (5/47) విజృంభించడంతో దక్షిణాఫ్రికా-ఎతో తొలి అనధికార వన్డేలో భారత్-ఎ 69 పరుగుల తేడాతో విజయం సాధించింది. గురువారం మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 47 ఓవర్లలో 6 వికెట్లకు 327 పరుగులు చేసింది. శివం దూబె (79 నాటౌట్), అక్షర్ పటేల్ (60 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. ఛేదనలో సఫారీ జట్టు ఒక దశలో 208/5తో నిలిచింది. హెండ్రిక్స్ (110), క్లాసన్ (58) దక్షిణాఫ్రికా శిబిరంలో ఆశలు రేపారు. కీలక సమయంలో చాహల్ మాయ చేయడంతో ఆ జట్టు 45 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది.

---

## ప్రపంజన్ జోరు



### తలైవాస్‌పై బంగాల్ గెలుపు

**దిల్లీ:** ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో బంగాల్ వారియర్స్ మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. రైడింగ్‌లో ప్రపంజన్ (10), మణిందర్ సింగ్ (9) సత్తా చాటడంతో గురువారం జరిగిన మ్యాచ్‌లో బంగాల్ 35-26 తేడాతో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. మ్యాచ్ 5-5 స్కోరుతో నువ్వానేనా అన్నట్టుగా సాగుతున్న సమయంలో ప్రపంజన్ మాయ మొదలైంది. అతను దూకుడుతో ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన బంగాల్ 11-7తో ఆధిక్యం సంపాదించింది. అజయ్ ఠాకూర్ (11) రాణించడంతో తలైవాస్ పుంజుకున్నప్పటికీ.. బంగాల్ పట్టు వదల్లేదు. 11 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలతో 39 పాయింట్లు సాధించిన బంగాల్ పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది.

| ప్రొ కబడ్డీలో ఈనాడు | టైటాన్స్ × పుణెరి (రా.7:30 నుంచి)<br>దిల్లీ × పట్నా (రా.8:30 నుంచి) |
| --- | --- |

# పర్యావరణం పెను విధ్వంసం

● 'ఈనాడు'తో పర్యావరణ నిపుణులు బాబూరావు

ఈనాడు - హైదరాబాద్

పంటలను, పర్యావరణాన్ని ఛిద్రం చేస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఎం.తుమ్మలపల్లెలో సాగుతున్న యురేనియం ఉత్పత్తిపై పర్యావరణవేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అక్కడ జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై పట్టించుకున్నవారే లేకపోయారని.. అధికార యంత్రాంగం దీనిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పర్యావరణ నిపుణులు కె.బాబూరావు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేసిన ఆయన ఎం.తుమ్మలపల్లెలో యురేనియం కారణంగా భూగర్భం విషతుల్యం అవుతుండటంపై తొలినుంచీ అధ్యయనం చేస్తున్నారు. యురేనియం తవ్వకాల అంశంపై 'ఈనాడు'తో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలివి..

### అణు విద్యుత్తు అవసరమేముంది?

ప్రపంచమంతటా ఇప్పుడు పునరుత్పాదక విద్యుత్ వనరులు బాగా అందుబాటులోకి వస్తున్న తరుణంలో అణు విద్యుత్తు అవసరాల కోసం యురేనియం తవ్వకాలకు ఆరాటపడాల్సిన పనేలేదు.



### తెలంగాణలో 2003లోనే ప్రయత్నాలు

తెలంగాణలోని పెద్దగట్టు, లంబాపూర్‌లలో యురేనియం తవ్వకాలకు 2003-05లోనే ప్రయత్నాలు జరిగాయి. అప్పట్లో పెద్దగట్టులో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో తమ వ్యతిరేకతను వ్యక్తం చేసిన ప్రజలపై దాడులు జరిగాయి. పెద్దఅడిశర్లపల్లిలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ ప్రతినిధిగా వచ్చిన దీపక్ అరుణ్ ఆత్రేయ ఆ ప్రాంతం రాజీవ్ పులుల రక్షిత ప్రాంతం సమీపాన ఉంది కాబట్టి అక్కడ యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇటీవల కేంద్రం గతంలో గనులకు ఇచ్చిన అనుమతుల కాల వ్యవధి పొడిగించడంతో తెలంగాణలో మళ్లీ తవ్వకాలు చేయాలని యురేనియం సంస్థ చూస్తోంది. తెలంగాణ ప్రజల్లో చైతన్యం ఎక్కువ. తవ్వకాలను వీరు వ్యతిరేకిస్తారనే అనుకుంటున్నా. ఏం జరుగుతుందో చూడాలి.

### ప్రభుత్వ శాఖల వైఫల్యమిది..

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి.. రెండూ తాము పెట్టిన నిబంధనలను యురేనియం కార్పొరేషన్‌తో అమలు చేయించడంలో ఘోరంగా విఫలమయ్యాయి. అందుకే ఎం.తుమ్మలపల్లెలో ఇంతటి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి.

### ఆ విషాన్ని 2017లోనే గుర్తించా..

ఎం.తుమ్మలపల్లె వద్ద భూగర్భజలం కలుషితం కావడాన్ని నేను 2017లోనే గుర్తించా. దీనిపై అప్పటి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించా. ఫలితమే లేదు. మొదట ఒక రైతుకు జరిగిన నష్టం బయటకు వచ్చినప్పుడు ఇతరులెవరిలోనూ స్పందనలేదు. ప్రమాదం విస్తరించడం మొదలు కాగానే జనం ఆందోళనలు నిర్వహించారు. దీనిపై అప్పట్లో రైతులతో కలిసి యురేనియం సంస్థ ఒక సమావేశం ఏర్పాటు చేసింది. రైతులకు నచ్చచెప్పేందుకు బార్క్ నుంచి శాస్త్రవేత్తలను రప్పించింది. రైతుల కోరిక మేరకు వారి తరపున.. సైన్సు తెలిసిన నేను వెళితే పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

### ఆ దేశాల్లో ఉన్న వ్యవస్థలు మనకేవి?

వివిధ ఖనిజాల తవ్వకాల వల్ల కలిగే ప్రభావాన్ని మదింపు చేసేందుకు అభివృద్ధి చెందిన దేశాల్లో జియో టెక్నికల్ ఇంజినీరింగ్ నిపుణులతో ప్రత్యేక వ్యవస్థలు ఉంటాయి. మన దగ్గర అలాంటివి లేవు. ఉదాహరణకు అమెరికాలో ఇలాంటి సందర్భం వస్తే రైతులకు జరిగే నష్టంపై ప్రభుత్వమే శాస్త్రీయంగా అంచనా వేయిస్తుంది. ఇందుకోసం 'నేషనల్ క్రాప్ లాస్ అసెస్‌మెంట్ మేనేజ్‌మెంట్' అనే వ్యవస్థ ఉంది. మనవద్ద ఎం.తుమ్మలపల్లెలో రైతులకు జరుగుతున్న నష్టం గురించి పట్టించుకునే దిక్కేలేదు.

### నిపుణుల్లేని టాస్క్ 'ఫోర్సు'

యురేనియం ఉత్పత్తి వల్ల వచ్చే ప్రమాదకర వ్యర్థాలను నిల్వ చేసేందుకు రూపొందించిన చెరువు తగిన రక్షణ ఏర్పాట్లతో లేదని నేను గుర్తించి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి, యురేనియం కార్పొరేషన్‌కు వినతిపత్రాలు పంపా. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నం చేసిన వారే లేరు. కాలుష్య నియంత్రణ మండలి జులైలో ఒక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేసి దానితో సమావేశానికి యురేనియం సంస్థ ప్రతినిధులనూ పిలిచింది. ఆ టాస్క్‌ఫోర్స్‌లో సరైన నిపుణులే లేరు. ఆ సమావేశం ఎంతో మొక్కుబడిగా.. అదీ విజయవాడలో జరిగింది. సమస్య పరిష్కారానికి ఏం చేయాలో 3 నెలల్లో నివేదిక తయారు చేయాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. ఏడాది దాటినా ఇప్పటివరకూ నివేదికే తయారు కాలేదు. దీనిని బట్టే మన అధికారయంత్రాంగం ఎంతటి నిర్లక్ష్యంగా ఉన్నదో అర్థమవుతుంది.

## దశ నిర్దేశాలు



బుజ్జాయిలకు విద్యాశాఖ కార్యదర్శి సూత్రాలు

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులందరూ అత్యున్నతంగా సాధన చేయడానికి, ప్రతిభ చూపడానికి 10 రాజీలేని సూత్రాలు పాటించాలని విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి సూచించారు. విద్యార్థుల విధులు- 10 రాజీలేని సూత్రాల పేరిట గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వాటిని పాఠశాలలోని ప్రతి తరగతి గదిలో, ప్రధానోపాధ్యాయుడి గదిలో ప్రదర్శించాలని ఆదేశించారు. పాఠశాల అసెంబ్లీ సమావేశాల్లో వాటిపై వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక్కో సూత్రంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించాలన్నారు.

**10 సూత్రాలివీ**



1. ప్రతి రోజు సూర్యోదయానికి ముందే అమ్మానాన్నలు లేపకున్నా నిద్ర లేస్తాను.
2. శారీరక పరిశుభ్రతకు ప్రతిరోజూ స్నానం చేస్తాను.
3. లక్ష పనులున్నా వేళకు బడికి వెళ్తాను.
4. ఎన్ని పనులున్నా ఏ రోజు పాఠాలు ఆ రోజే చదువుకుంటాను.
5. నా లక్ష్య సాధన కోసం 100 శాతం ప్రయత్నిస్తాను.
6. ఫలితం కోసం ఎదురుచూడను. బాధపడను. గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తాను.
7. నా సామర్థ్యాన్ని నిరంతరం తెలుసుకుంటూ దాన్ని మరింత పెంచుకోవడానికి ప్రయత్నిస్తాను.
8. నా భవిష్యత్తును నిర్మించుకోవడం నా బాధ్యత. దాని కోసం శ్రమిస్తాను.
9. చదువుతోపాటు ఆటలు, పాటలు, కళల్లో పురోగమించడానికి కృషి చేస్తాను.
10. తోటివారితో కలిసిమెలిసి ఉండటం వల్ల నేను అభివృద్ధి చెందుతాను. ఇతరుల అభివృద్ధికి తోడ్పడతాను.

## యురేనియం తవ్వకాలు ఆపాలి

గిరిజన సదస్సు డిమాండ్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: గిరిజనుల బతుకులను చిన్నాభిన్నం చేసే యురేనియం తవ్వకాల ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేయాలని, కేంద్రం అనుమతులను ఆపాలని తెలంగాణ గిరిజన సమాఖ్య డిమాండ్ చేసింది. మఖ్దూం భవన్‌లో గురువారం నిర్వహించిన సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..తవ్వకాలకు అనుమతుల విషయం తెలియదంటూ రాష్ట్రప్రభుత్వం నాటకమాడుతోందన్నారు. ఐఐసీటీ విశ్రాంత శాస్త్రవేత్త బాబూరావు ప్రసంగిస్తూ, 2003లో నల్గొండ ప్రాంతంలో తవ్వకాలు ప్రారంభించినా అప్పటి ప్రజాసంఘాలు, పార్టీలు వ్యతిరేకించడం వల్ల ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తినాయక్, ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, ఎమ్మెల్సీరాములునాయక్ పాల్గొన్నారు.

## గుణాత్మక మార్పు తేవాలి

'సివిల్ సర్వెంట్ల'కు శిక్షణలో వక్తలు

ఈనాడు, హైదరాబాద్; జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: కొత్తగా సర్వీసుల్లోకి చేరే ట్రైనీ సివిల్ సర్వెంట్లు సమర్థ నాయకత్వ లక్షణాలతో సమాజంలో గుణాత్మక మార్పులకు కృషిచేయాలని వక్తలన్నారు. అంకితభావాన్ని కనబరుస్తూ బలహీనవర్గాల అభ్యున్నతికి శ్రమించాలని కేంద్ర సిబ్బంది శిక్షణ విభాగం (డీవోపీటీ) అదనపు కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ బి.పి.ఆచార్య, గిరిజనాభివృద్ధిశాఖ కమిషనర్ క్రిస్టినా పాల్గొన్నారు. 22 రాష్ట్రాల నుంచి 15 కేంద్రప్రభుత్వ సర్వీసులకు ఎంపికైనవారికి ఈ ప్రాథమిక శిక్షణను నిర్వహించారు. సాంకేతిక నైపుణ్యం ఒక్కటే సరిపోదని, ప్రజలతో మమేకమైనప్పుడే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ గిరిజనాభివృద్ధి శాఖలోని 6000మంది ఉద్యోగులకు శిక్షణ వ్యవస్థను కేంద్రం మంజూరు చేసిందన్నారు. తెలుగులో రూపొందించిన డీవోపీటీఈ-లెర్నింగ్ వ్యవస్థనుసభలో ఆవిష్కరించారు.

## 8న గ్రూప్-2 కంప్యూటర్ పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-2 మౌఖిక పరీక్షకు హాజరై, వివిధ ప్రభుత్వ విభాగాల్లో సహాయ సెక్షన్ అధికారి పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబరు 8వ తేదీ కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్ష నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. ఇది హైదరాబాద్ కేంద్రంగా జరుగుతుందని, షెడ్యూలు త్వరలో ప్రకటిస్తామన్నారు. పరీక్ష సిలబస్, హాల్‌టికెట్ నంబర్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

◆ గ్రూప్-4 పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు త్వరలోనే ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని కమిషన్ తెలిపింది.

## సచివాలయ నిర్మాణం వెంటనే చేపట్టాలి

● కేసీఆర్‌కు మంత్రివర్గ ఉపసంఘం నివేదిక

ఈనాడు, హైదరాబాద్: కొత్త సచివాలయం నిర్మాణం వెంటనే చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరింది. ప్రస్తుత సచివాలయం శిథిలావస్థకు చేరినందున భవనాలను కూల్చి వేసి, ఆ స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టాలని సూచించింది. ఉపసంఘం ఛైర్మన్, రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, సభ్యులైన ఆబ్కారి, సంక్షేమ శాఖల మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్‌లు గురువారం ప్రగతిభవన్‌లో సీఎంతో భేటీ అయ్యారు. నూతన సచివాలయ నిర్మాణంపై నివేదిక అందజేశారు. రెండు నెలల క్రితం ఏర్పాటైన ఈ ఉపసంఘం సచివాలయం నిర్మాణంపై నిపుణులతో, వివిధ వర్గాల వారితో సంప్రదింపులు జరిపింది. ఆర్కిటెక్ట్‌ల నుంచి వివరాలు తీసుకుంది. వివిధ రాష్ట్రాల సచివాలయాల నమూనాలు సేకరించింది. హైకోర్టు ప్రస్తావించిన పలు అంశాలపైనా చర్చించింది. బుధవారం సాంకేతిక కమిటీ అందజేసిన నివేదికలోని అంశాలనూ క్రోడీకరించి సీఎంకు నివేదిక సమర్పించింది. "ప్రస్తుత సచివాలయంలో అనేక సమస్యలున్నాయి. భవనాలు పటిష్ఠంగా లేవు. ఉద్యోగులు, ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త సచివాలయం అవసరం ఉంది. ప్రస్తుత సచివాలయ స్థలమే అనువైనది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆ భవనాలను కూల్చివేయాలి" అని ఉపసంఘం సూచించినట్లు తెలిసింది. త్వరలోనే దీనిని పరిశీలించి, కీలక నిర్ణయం తీసుకుంటామని కేసీఆర్ చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం, సాంకేతిక కమిటీ నివేదికలను న్యాయస్థానానికి సమర్పించే అంశంపైనా చర్చించినట్లు సమాచారం.



సీఎం కేసీఆర్‌కు నివేదిక అందజేస్తున్న ఉపసంఘం సభ్యులు.. మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్

## సాగర్ ప్రధాన విద్యుత్కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేత

నాగార్జునసాగర్, మేళ్లచెరువు, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో గురువారం ఉత్పత్తిని నిలిపివేశారు. ఈ సందర్భంగా జెన్‌కో ఎస్‌ఈ రాజనర్సయ్య మాట్లాడుతూ సాగర్ జలాశయం నుంచి కృష్ణాడెల్టాకు ఎలాంటి నీటి కేటాయింపు లేకపోవడంతో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. ఈ ఏడాది సాగర్‌లో 1,284 మిలియన్ యూనిట్లు లక్ష్యం కాగా ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు 45 టీఎంసీల నీటిని వినియోగించి 274 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. మరోవైపు సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని పులిచింతల జల విద్యుత్కేంద్రంలో గురువారం ఉత్పత్తి పునఃప్రారంభమైంది. కృష్ణానదికి భారీ వరద కారణంగా ఈ నెల 23న ఉత్పత్తిని నిలిపివేసిన సంగతి తెలిసిందే. పులిచింతల జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులకు ప్రస్తుతం 172.997 అడుగుల మేర నీరు ఉంది. ప్రస్తుత నీటినిల్వ 42.72 టీఎంసీలు. పూర్తిస్థాయి నీటినిల్వ 45.77 టీఎంసీలు. ఇన్‌ఫ్లో లేదు. దిగువకు మాత్రం 10 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. విద్యుదుత్పాదన కోసమే 9 వేల క్యూసెక్కులను తీసుకుంటుండగా.. మరో వెయ్యి క్యూసెక్కులు స్లూయిస్ ద్వారా దిగువకు వెళ్తున్నాయి.

## రహదారి పనుల్లో వేగం పెంచండి

కేంద్ర మంత్రికి తెరాస బృందం వినతి

ఈనాడు, దిల్లీ: కేంద్రప్రభుత్వం తెలంగాణలో చేపట్టిన జాతీయ రహదారుల పనులు వేగవంతం కావాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని తెరాస ప్రతినిధుల బృందం కోరింది. రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డితో పాటు తెరాస లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, జుక్కల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజుల సురేందర్ దిల్లీలో ఆయనను కలుసుకున్నారు. రాష్ట్రంలో 3,155 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను గుర్తించాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 1,388 కి.మీ.నే గుర్తించారన్నారు. మిగతా రహదారుల పనులనూ వెంటనే ప్రారంభించాలని వారు విన్నవించారు. ఎన్‌హెచ్‌కు సంబంధించి భూ సేకరణ పరంగా సగం వ్యయం, అటవీ భూముల మళ్లింపు వ్యవహారాన్ని రాష్ట్రప్రభుత్వం చూసుకుంటుందని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలోనే లేఖలు రాయడాన్ని పోచారం గుర్తుచేశారు. హైదరాబాద్ ప్రాంతీయ వలయ రహదారితో పాటు వలిగొండ-తొర్రూర్-మహబూబాబాద్-ఇల్లెందు-కొత్తగూడెం, మెదక్-ఎల్లారెడ్డి-రుద్రూరు, బోధన్-బాసర-భైంసాలను హైవేలుగా గుర్తించి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

## గిరిజనులకు భూ పంపిణీ ఏమైంది?

● కొన్ని సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ మెరుగు

● జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ నందకుమార్ సాయి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల్లేని నిరుపేద గిరిజనులకు భూపంపిణీ ఎందుకు చేయడం లేదని జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ నందకుమార్‌సాయి ప్రశ్నించారు. జీవనోపాధికి భూములివ్వాలని మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో చెంచులు కోరుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద వచ్చిన దరఖాస్తుల తాజాస్థితిపై వివరాలు అడిగారు. పెండింగ్ దరఖాస్తుల్లో అనర్హత, తిరస్కరణ ప్రక్రియ చేపట్టామని, రెండు నెలల్లో స్పష్టత వస్తుందని రాష్ట్ర అధికారులు తెలిపారు. అనంతరం సుప్రీంకోర్టు నిర్ణయం ప్రకారం ముందుకెళ్తామని చెప్పారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన ఎస్టీ కమిషన్ ఛైర్మన్ గురువారం హైదరాబాద్‌లో సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌మిశ్రా, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టీనా, అటవీ, విద్య, రెవెన్యూ, వైద్యం, గిరిజన, మహిళాశిశు సంక్షేమశాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. "గిరిజన ఆవాసాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు చేయాల్సిన అవసరముంది. గిరిజన ప్రాంతాల్లో అందిస్తోన్న అలోపతి వైద్యంతోపాటు ఆయుష్ వైద్యసేవలనూ విస్తరించాలి. గిరిజనులు ప్రాచీన వైద్యానికి ఆకర్షితులవుతారు.. వారికి ఆయుష్ వైద్యసేవల్ని చేరువగా తీసుకెళ్లడానికి కృషి చేయాలి. కొన్ని గిరిజన సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ మెరుగ్గా ఉంది. గిరిజనుల ఉపాధిహామీ కోసం పని దినాల్ని 150కి పెంచాలని కేంద్రానికి సిఫార్సు చేస్తాం. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అవసరమైన అనుమతుల ప్రక్రియ దాదాపు కొలిక్కివచ్చింది. తండాలు పంచాయతీలుగా మార్పు, గృహనిర్మాణ పథకాలు బాగున్నాయి. అట్రాసిటీ కేసుల విచారణ వేగంగా లేదు. త్వరగా శిక్షలు పడేలా చూడాలి" అని పేర్కొన్నారు. సమీక్షలో ఎస్టీ కమిషన్ సభ్యులు హరికృష్ణదామోర్, హర్షద్‌భాయ్ చునీలాల్‌వాసవా, మాయా చింతామణ్ ఇవ్‌నాతే, కమిషన్ సంయుక్తకార్యదర్శి ఎస్‌కే రాఠోడ్ పాల్గొన్నారు. గిరిజనులకు వైద్యసేవలపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ యోగితారాణా, ఉన్నతాధికారులు కమిషన్‌కు వివరించారు. సాయంత్రం గవర్నర్ నరసింహన్‌తో కమిషన్ సభ్యులు సమావేశమయ్యారు.



హైదరాబాద్‌లో గురువారం ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నందకుమార్‌సాయి. పక్కన ఎస్కే జోషి

## రెవెన్యూ వ్యవస్థను బలహీనపర్చొద్దు

వీఆర్వో, వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్రరావు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి పంచాయతీ, వ్యవసాయ శాఖల్లో విలీనం చేసే చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని వీఆర్వో, వీఆర్ఏల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో వీఆర్వో, వీఆర్ఏల ఆత్మగౌరవ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఉపేంద్రరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థలో నూతన సంస్కరణలు చేపట్టి, కొత్త చట్టం తెస్తామని పలు సభల్లో ప్రకటించడం బాధాకరమన్నారు. రెవెన్యూ వ్యవస్థను మరింత బలహీన పరిచే చర్యలు సరికావన్నారు. వీఆర్ఏల రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సమగ్ర భూసర్వే ద్వారా రెవెన్యూ రికార్డులను ఆధునికీకరించాలన్నారు. విశ్రాంత వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల విజయరామారావు మాట్లాడుతూ.. ఆర్ఓఆర్ చట్టం ప్రకారం అధికారాలన్నీ తహసీల్దార్లకే కేటాయించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ, ప్రొ.నాగేశ్వర్ మాట్లాడుతూ వీఆర్వో, వీఆర్ఏలను బదనాం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాంటి చర్యలు చేపడుతున్నారన్నారు. రెవెన్యూ ఉద్యోగులు సంఘటితమై తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. వీఆర్ఏల రాష్ట్ర అధ్యక్షుడు (సీఐటీయూ అనుబంధం) ఒంగూరి రాములు, వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, తెలంగాణ వీఆర్ఏల కేంద్రసంఘం అధ్యక్షుడు రఫీ, నవ తెలంగాణ పత్రికా సంపాదకుడు వీరయ్య, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఒకేరోజు ఉమ్మడిగా ప్రభుత్వ బడిలోకి!



మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలానికి చెందిన బహిరన్‌దిబ్బ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఇది. ఇక్కడ ఉన్న పిల్లలందరూ ఒకప్పుడు ప్రైవేట్ బడులకు వెళ్లినవారే. నానాటికీ పెరుగుతున్న ఫీజుల భారంతో తల్లిదండ్రులు సతమతమవుతుండటాన్ని గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు సత్యకుమార్(మధ్యలో) చొరవ, సమయస్ఫూర్తి చూపి ఒకేరోజు 94 మంది విద్యార్థులను చేరదీసి, తన (ప్రభుత్వ)బడిలోకి చేర్చుకున్నారు. స్థానికంగానే కాక దూరంలోని వటిపల్లి, చిల్వేర్ గ్రామాలకు రోజూ నానారకాల వ్యయ ప్రయాసలతో వెళ్లివచ్చే వారిని ఒక దగ్గరికి చేర్చారు. గ్రామస్థుల సమక్షంలో విద్యార్థులందరితోనూ గురువారం ఇలా ప్రతిజ్ఞ చేయించిన ఆయన..ఈ బడిపిల్లల సంఖ్య ఇప్పుడు 134కు పెరిగిందన్నారు. సర్పంచి లక్ష్మమ్మ, అల్లాదుర్గం ప్రజాప్రతినిధి స్వరూప సహకారం తన కృషి ఫలించేలా చేసిందన్నారు.

- అల్లాదుర్గం, న్యూస్‌టుడే

## రేషన్ డీలర్ల సంఘానికి నూతన అధ్యక్షుడు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రేషన్ డీలర్లు కొత్త సంఘాన్ని ఏర్పాటుచేసుకున్నారు. అధ్యక్షుడిగా నాయకోటి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం వివరాలను వెల్లడించారు. గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మల్లేశం, ప్రధాన కార్యదర్శులుగా సంజీవరెడ్డి (రంగారెడ్డి), బి.ప్రసాద్‌గౌడ్ (హైదరాబాద్), డి.రవీందర్(సిద్దిపేట) ఎన్నికైనట్లు ప్రకటించారు. నాయకోటి రాజు, బత్తుల రమేష్ అధ్యక్షతన ఉన్న రెండు సంఘాలను రద్దు చేస్తూ కొద్దినెలల కిందటే అడ్‌హాక్ కమిటీని ఏర్పాటుచేశారని కమిటీ ఛైర్మన్ దొమ్మాటి రవీందర్ పేర్కొన్నారు. రాజు వర్గం మాత్రమే సమావేశమై కొత్త కమిటీని ఎన్నుకుందని ఆరోపించారు. త్వరలో నూతన కమిటీని ఎన్నుకుంటామని, అప్పటిదాకా అడ్‌హాక్ సంఘమే కొనసాగుతుందని స్పష్టంచేశారు.

## ఉమ్మడి చెక్ పవర్‌ను రద్దు చేయాలి

● లేకుంటే అసెంబ్లీ ముట్టడి

● రాష్ట్ర సర్పంచుల సంఘం

కాచిగూడ, న్యూస్‌టుడే: ఉప సర్పంచితో కలిపి ఇచ్చిన ఉమ్మడి చెక్ పవర్‌ను వెంటనే రద్దు చేయాలని, లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని తెలంగాణ పంచాయతీ సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భూమయ్య యాదవ్ హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే, ఎంపీల గెలుపులో కీలకపాత్ర పోషించే సర్పంచులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రతి చిన్న దానికి సర్పంచులనే బాధ్యులను చేయడం సరికాదని పేర్కొన్నారు. కేంద్రం పంచాయతీలకు ఇస్తున్న నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం కోత విధిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకం నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పెత్తనం చేస్తోందని ఆరోపించారు. తమ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబరులో వేలాది మంది సర్పంచులతో అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడురు లక్ష్మినరసింహారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, ఉపాధ్యక్షుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం మీది.. సహకారం మాది

● 'సిద్దిపేట యువశక్తి' పేరిట వినూత్న కార్యక్రమానికి హరీశ్‌రావు శ్రీకారం

ఈనాడు, సిద్దిపేట: తగిన ఉపాధి లేక గ్రామాల్లో ఖాళీగా ఉంటున్న యువతలో నైపుణ్యాలు పెంచి వారికి ఉపాధి చూపే లక్ష్యంతో వినూత్న కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శ్రీకారం చుట్టారు. తన నియోజకవర్గంలోని నారాయణరావుపేట మండలంలోని యువతతో 'సిద్దిపేట యువశక్తి' పేరిట గురువారం సిద్దిపేటలో సమావేశం నిర్వహించారు. వివిధ శిక్షణ కార్యక్రమాలు, అవకాశాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వరరావు, ఐఫోకస్ ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్, యంగ్ అచీవర్ నైనా జైస్వాల్, సిద్దిపేట పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్.. తమ ప్రసంగాలతో యువతలో ప్రేరణ రగిల్చే ప్రయత్నం చేశారు. స్థానికంగా వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న వారి అనుభవాలనూ చెప్పించారు. సెట్విన్, ఆంధ్రా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రతినిధులు తాము అందించే వివిధ శిక్షణ కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ 'యువశక్తి' ద్వారా నేను ఉద్యోగం పొందా.. వ్యాపారం పెట్టి సంపాదిస్తున్నా.. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నా.. అనే మాటలను వినడమే తన కోరికని తెలిపారు.

## దివ్యాంగుడి 'మొక్క'వోని దీక్ష

చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి రాజకీయ నేత కాదు. చదువుకున్న విద్యావంతుడు అంతకంటే కాదు. పశువుల కాపరి. పైగా దివ్యాంగుడు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మదన్‌పల్లి క్యాంపునకు చెందిన మేకల ప్రసాద్‌కు కుడి చేయి పనిచేయదు. కాళ్లలో కూడా సత్తువ లేదు. నిత్యం పశువులను మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్తారు. ఎవరి సాయం లేకుండా ఇప్పటి వరకు 200 మొక్కలు నాటారు. ఈ ఏడాది 500 మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. నాటడమే కాదు.. సంరక్షించే బాధ్యతనూ తీసుకున్నట్లు ఆయన 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. ఒక్క చేత్తోనే గునపంతో గుంతలు తీస్తూ మొక్కలు నాటుతూ.. వాటికి కంచెలు ఏర్పాటు చేస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం



## 'రైతుబీమా' పరిహారాన్ని 10 రోజుల్లో అందించాలి

వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: చనిపోయిన రైతుల కుటుంబాలకు 'రైతుబీమా' కింద నష్టపరిహారం పదిరోజుల్లో అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఆదేశించారు. క్లెయిముల పరిష్కారంలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని గురువారం ఎల్ఐసీ, ఎన్ఐసీ, వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన పథకం సమీక్ష సమావేశంలో ఆయన పేర్కొన్నారు. రెండో విడత రైతుబీమా ఇప్పటికే అమల్లోకి వచ్చిందని తెలిపారు. తొలి విడతలో నమోదైన రైతుల బీమా పాలసీని పునరుద్ధరించామని, సీసీఎల్ఏ వద్ద నమోదుకానివారికి ఇది వర్తించబోదని అన్నారు. మరణ ధ్రువీకరణ పత్రంలో ఆధార్ నంబరు నమోదు చేయడం ద్వారా క్లెయిములను వేగంగా పరిష్కరించవచ్చని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పథకం గురించి మిగతా రాష్ట్రాలు తమను సంప్రదిస్తున్నాయని ఎల్ఐసీ చీఫ్ ఆర్పీ సింగ్ వెల్లడించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

TG